# జనబలం

ప్రజలే ప్రభువులు

ఆగస్టు 2023 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-

## యూనిఫామ్ సివిల్ కోడ్‌పై వ్యవసాయ చట్టాల తరహాలో తొందరపడొద్దు






## వరదల నుండి మన నగరాల రక్షణ తక్షణావసరం

## బియ్యం ఎగుమతులపై నిషేధం.. రైతులకు, దేశానికి హానికరం

## లక్ష్య సాధన పద్ధతుల్లో ఆరితేరాం.. లక్ష్యాల్ని మర్చిపోయాం

## ఎన్నికలు.. అభ్యర్థుల ఎంపిక






# స్వతంత్ర భారతానికి అడుగుజాడ గురజాడ

'దేశమును ప్రేమించుమన్నా
మంచి యన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్టవోయ్

.. ఈసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయ్

.. దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్'

.. స్వాతంత్ర్యానికి నిజమైన అర్థం తెలియచెప్పే ఈ మాటల్ని మహాత్మాగాంధీ స్వతంత్ర పోరాటం లోకి రాకముందే చెప్పిన మహాకవి గురజాడ అప్పారావు నివసించిన ఇంటిని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇటీవల విజయనగరంలో సందర్శించారు. ఈ సందర్భంగా జేపీ రాసిన అభిప్రాయం..


తెలుగు సమాజానికి, సాహిత్యానికి గురజాడ చేసిన
సేవ చిరస్మరణీయం. [illegible]
వాడుక భాషలో రచన చేసిన మహాశయుడు గురజాడ.
భారతదేశ సాహిత్యంలో ఆధునిక యుగంలో
మనకు [illegible] రచన కన్యాశుల్కం.
తెలుగు భాషలో, సాహిత్యంలో క్రాంతి యుగాన్ని
సృష్టించింది కన్యాశుల్కం.
సంప్రదాయం సృష్టించిన అడ్డుగోడల్ని
దాటి, స్వేచ్ఛాయుతమైన మనసుతో, మానవ
విలువలతో, ఉన్నతమైన వ్యక్తిత్వంతో,
[illegible] ఇప్పటికీ మన సమాజానికి
[illegible] భావాలతో [illegible]
సాహిత్యాన్ని సృష్టించిన గురజాడ అడుగుజాడ
తెలుగు సాహిత్యం, భారతీయ సమాజం
ఎల్లవేళలా గురజాడ సందేశం మనసుల్లో
[illegible] ఉంటుంది.
వారి గృహాన్ని [illegible]
నా అదృష్టంగా భావిస్తూ,

23/01/2023.

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సంపుటి 25 సంచిక 8

ఆగస్టు 2023

సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్

## జనబలం చందా రుసుము వివరాలు


| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# రాజ్యాంగం పరిధిలోనే మణిపుర్ సమస్యకు పరిష్కారం!

సంపాదకీయం

తెగలమధ్య ఘర్షణలు మణిపుర్‌లో ప్రజాజీవితాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ప్రజల ప్రాణాలకు, మానాలకు, ఆస్తులకు రక్షణ లేకుండాపోయింది. మే 3 వ తేదీన మొదలైన ఘర్షణల్లో ఇప్పటివరకూ 160 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఐదువేల గృహాలు దగ్ధం అయ్యాయి. సుమారు అరవై వేలమంది నిరాశ్రయులయ్యారు. యావత్తు ప్రపంచం సిగ్గుతో తలదించుకునే విధంగా మహిళలపై అఘాయిత్యాలు జరిగాయి. పిల్లలు పాఠశాలలకు దూరమయ్యారు.

శాంతి భద్రతలను కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు, అధికారులు సహా మొత్తం, ప్రభుత్వ యంత్రాంగం రెండుగా చీలిపోయి కుప్పకూలింది. సాయుధ బలగాలకు చెందిన ఆయుధాగారాల నుండి సుమారు ఐదువేల ఆయుధాలు, మందుగుండు సామగ్రి అపహరణకు గురయ్యాయన్న సమాచారం దిగ్భ్రాంతి కలిగించింది. పరిస్థితులను ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లుగా రాష్ట్ర గవర్నర్ స్పష్టంగా చెబుతూ వచ్చారు. కేంద్ర హోమ్ మంత్రి మణిపూర్ స్వయంగా వెళ్ళి నాలుగు రోజులు ఉన్నారు. పరిస్థితులను సమీక్షించారు. అన్ని పక్షాలలో సంప్రదింపులు జరిపారు. ఒక విస్తృతమైన శాంతి కమిటీని ఏర్పాటు చేశారు.

అయితే శాంతి కమిటీకి ముఖ్యమంత్రిని అధ్యక్షులుగా నియమించడంతో పని ప్రారంభించక ముందే కమిటీ చతికిలపడింది. పలువురు సభ్యులు రాజీనామా చేశారు. ఇన్నాళ్ళూ అధికారపార్టీ సంకీర్ణకూటమిలో ఉన్న కొన్ని పార్టీలు మద్దతు ఉపసంహరించుకున్నాయి. స్వయంగా ముఖ్యమంత్రి మెజారిటీ వర్గానికి కొమ్ముకాయడం వల్లనే పరిస్థితులు దిగజారాయని అధికారపార్టీ లోని మైనారిటీ తెగలకు చెందిన పది మంది ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు.

మణిపుర్‌కు ఆర్టికల్ 355 ను వర్తింపచేసి శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతను కేంద్ర హోంశాఖ చేపట్టింది. అయినా పరిస్థితి మెరుగు కాలేదు. అసోం రైఫిల్స్‌కు చెందిన సాయుధబలగాలు అక్కడ ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని వినియోగించుకోలేక పోయింది. స్థానిక పోలీసులు అసోం రైఫిల్స్ పై ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేసే పరిస్థితి ఏర్పడింది.

మణిపుర్‌లోని రకరకాల సంక్లిష్టతలను అర్థం చేసుకోకుండా సమస్యను పరిష్కారం చేయడం సాధ్యం కాదు. లోయలోని ప్రజలకు, కొండప్రాంతాల ప్రజలకు మధ్య భూములు, ఉద్యోగాలు, ఉపాధి వంటి వనరుల పంపిణీ సమస్యలు ఉన్నాయి. ఆచారాల, సంప్రదాయాల భాషా, సంస్కృతుల, గుర్తింపు సమస్యలు ఉన్నాయి. స్థానిక, స్థానికేతరుల సమస్య ఉన్నది. వీటన్నిటినీ రాజ్యాంగ బద్ధంగా పరిష్కరించాల్సిన బాధ్యత పాలకులపై ఉన్నది.

మణిపూర్ కొండ ప్రాంతాల వారితో సంప్రదించ కుండానే కొండ ప్రాంతాలలో పాలనాపరమైన చర్యలు తీసుకునేందుకు 2022 ఆగస్ట్ లో మణిపూర్ హిల్ ఏరియా డిస్ట్రిక్ట్ కౌన్సిల్ చట్టానికి తలపెట్టిన సవరణల నేపథ్యంలో వివాదం తలెత్తింది. 2008 లో కుకీ తీవ్రవాద సంస్థలతో చేసుకున్న శాంతి ఒప్పందంలో భాగంగా కొండప్రాంతాల్లో సాయుధబలగాల కార్యకలాపాలను నిలిపివేయాలన్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈమధ్య తిరగదోడింది. సాయుధబలగాల ప్రత్యేక అధికారాల చట్టం లోయప్రాంతాల్లో అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా కొండ ప్రాంతాల ప్రజల్లో పెద్ద దుమారాన్ని లేపింది. అలాగే హిల్ ఏరియా కౌన్సిల్ ప్రమేయం లేకుండా జిల్లాల హద్దులను మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రిజర్వు అటవీ ప్రాంతంలో నివసిస్తున్న తెగల ప్రజలను తొలగించే ప్రయత్నం కూడా ప్రారంభం అయ్యింది. మణిపుర్ కొండ ప్రాంతాలలో అరుదైన ఖనిజ నిక్షేపాలు తవ్వడానికి ప్రైవేటు కంపెనీలతో కేంద్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం, కొండ ప్రాంతాలలో ఆయిల్ పామ్ తోటలు పెంచడానికి ప్రైవేటు కంపెనీలతో మణిపుర్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం కొండ ప్రాంతాల ప్రజల్లో తీవ్ర అభద్రతా భావాన్ని రేకెత్తించాయి.

మెయిథాయ్‌లకు ఎస్టీ హోదా ఇచ్చే విషయమై రాష్ట్ర ప్రభుత్వం తన ప్రతిపాదనలను కేంద్రానికి పంపాలన్న హైకోర్టు ఉత్తర్వు అగ్నికి ఆజ్యం పోసింది. కుకీలను స్థానికేతరులు, ఆక్రమణదారులు, చట్టవిరుద్ధంగా నివసిస్తున్నవారు అంటూ, మెజారిటీ తెగ చేసే ఆరోపణ, ఎన్.ఆర్.సి. కావాలని చేస్తున్న డిమాండ్ సహజంగానే కుకీలలో మరింత అభద్రతా భావానికి, ఆందోళనకు దారి తీసింది. తమ ఉనికికి, జీవితానికి, భద్రతకు ప్రభుత్వం వల్ల ప్రమాదం ఏర్పడిందని తెగల ప్రజలు భావిస్తున్నారు.

ఆర్టికల్ 371 ప్రకారం తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రస్తుత ప్రభుత్వం దెబ్బతీస్తున్నదని వారు ఆక్రోశిస్తున్నారు. తమ గురించి నిర్ణయం తీసుకునే ముందు హిల్ ఏరియా కౌన్సిల్ ను సంప్రదించాలన్న రాజ్యాంగ నియమాన్ని ఉల్లంఘించడాన్ని వారు గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో మే 3 వ తేదీన ఇండీజినస్ ట్రైబల్ లీడర్స్ ఫోరమ్‌తో ఒక ఒప్పందంపై సంతకాలు జరగాల్సిన నేపథ్యంలో తెగల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఒక సున్నితమైన సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం సాగించిన మొరటు రాజకీయాలు పరిస్థితిని క్షిణింప చేశాయి. రాష్ట్రంలో తమ రాజకీయ అజెండా కోసం కేంద్ర ప్రభుత్వం కూడా మౌనం పాటించడం అవిశ్వాసానికి మూలం అయ్యింది.

మణిపుర్ చరిత్రను, సమ్మిశ్రిత సంస్కృతిని దృష్టిలో ఉంచుకుని రాజకీయ ప్రయోజనాలను పక్కనబెట్టి రాజ్యాంగబద్ధంగా సమస్యను ఇప్పటికైనా పరిష్కరించవచ్చు. ప్రధాన స్రవంతిలో ఉన్న రాజకీయ నేతలను, పౌర సమాజాన్ని విశ్వాసంలోకి తీసుకోవాలి. తీవ్రవాద సంస్థలను చర్చలకు ఒప్పించాలి. అవసరం అయితే తెగలకు కేంద్రపాలిత ప్రాంతం, స్వయంప్రతిపత్తి గల ప్రాంతీయ మండలి వంటి ఏర్పాట్లకు కేంద్రం సిద్ధం కావాలి. ఒక సరిహద్దు రాష్ట్రంలో అంతరంగిక సమస్యలను పరిష్కరించే దూరదృష్టి ప్రదర్శించాలి.

డి. సోమ సుందర్

# వరదల నుండి మన నగరాల రక్షణ తక్షణావసరం

**డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**



ఇటీవలి భారీ రుతుపవన వర్షాలు, వరదలకు హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, అస్సాంలలో పెద్దఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. ఓ నెలక్రితం, అరేబియా సముద్రంలో వచ్చిన పెను తుపాను బిపర్జె వల్ల రాజస్థాన్, గుజరాత్ ఎడారి ప్రాంతాల్లో వరదలు బీభత్సం సృష్టించాయి. సహాయ, ఉపశమన, పునరావాస చర్యలు తక్షణావసరం. కానీ వరదల నివారణకు దీర్ఘకాల ఏర్పాట్లపై దృష్టి సారించటం కూడా మనకు ఎంతో అవసరం.

మన దేశంలో తరచూ అతి భారీ వర్షాలు, ఉన్నకొద్దీ క్రమపద్ధతి లేకుండా కురుస్తున్నాయి. భూతాపం ఇందుకు కారణంగా కనిపిస్తోంది. గడచిన రెండు దశాబ్దాలలో, భారత ఉప ఖండంలోని చాలాచోట్ల సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉంది. మన వ్యవసాయం ప్రకృతి ఒడిదుడుకులను తట్టుకోగలిగే స్థాయిని సంతరించుకున్నట్లుంది. గతంలోలా వాతావరణ ప్రభావానికి మరీ ఎక్కువ గురికావటం లేదు. కానీ వర్షపాతం మాత్రం క్రమపద్ధతి లేకుండా అసాధారణరీతిలో ఉంటోంది. వానాకాలంలో కూడా ఒకపక్క కుండపోత, మళ్లీ వెంటనే మండుటెండలు! మనది రుతుపవన ఆధారిత దేశం కాబట్టి అధిక వర్షపాతం మంచిదే. కానీ భారీ వర్షం వల్ల వరదలు రాకుండా, నష్టం, అంతరాయం నామమాత్రంగా ఉండేలా మనం చర్యలు తీసుకోవాలి.

వరద తాకిడికి గురవుతున్న ఈ పాంతాలన్నిటిలో 24 గంటల్లో అత్యధిక వర్షపాతం 100 – 200 మిల్లీమీటర్లుంటుంది. ఆ వర్షపాతం ఎక్కువేగానీ, అసాధారణం మాత్రం కాదు. అటువంటి ఓ మోస్తరు భారీ వర్షానికే పలు నగరాలు, పంటపొలాలను భారీ వరద ముంచెత్తింది. వాతావరణాన్నో, పర్యావరణ మార్పునో నిందించి ప్రయోజనం లేదు. ప్రకృతి తన పని తాను చేస్తుంది; మనం ప్రకృతిని శాసించలేం. ప్రకృతితో సమన్వయం ద్వారా ఉత్పాతాల నుండి మనల్ని మనం కాపాడుకోవటం మీద మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. మన పట్టణ ఆవాసాల్ని, నీటి వనరుల్ని, వరద నీటి డ్రైనేజి వ్యవస్థల్ని లోతుగా సమీక్షించుకోవాల్సిన అవసరముంది. ఈ వ్యాసంలో, పట్టణ వరదల మీద ప్రధానంగా చర్చిద్దాం.

భారతదేశంలో 2011లో 4041 మునిసిపాలిటీలు, పట్టణ ప్రాంతాలు ఉన్నాయి. వీటిల్లో పది లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాలు 52. మిలియన్ జనాభా దాటిన పెద్ద నగరాలు ఇప్పుడు బహుశా 64 ఉండొచ్చు. పెద్ద ఆర్థిక వ్యవస్థలన్నిటిలో తక్కువ పట్టణీకరణ ఉన్న దేశం మనం మాత్రమే. మన వద్ద పట్టణీకరణ కేవలం 35%. వచ్చే మూడు దశాబ్దాలలో, దాదాపు 50 కోట్ల మంది పైగా మన నగరాలు, పట్టణాల్లో ఉండబోతున్నారు. అంటే, మన పట్టణ జనాభా రెట్టింపు కాబోతోంది. పట్టణీకరణ అనివార్యం, అవసరం. ఇప్పటికీ మన దేశంలో 45% జనాభా జీవనోపాధి కోసం వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా కేవలం 15-20% మాత్రమే సాగులో ఉన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ సంఖ్య కేవలం 3-5%. పట్టణ ప్రాంతాలకు వలసల్ని, వ్యవసాయేతర ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందటాన్ని ఆపలేం. నిజానికి ప్రాథమిక రంగం నుంచి పరిశ్రమలు, సేవలకు, గ్రామీణం నుంచి పట్టణ ప్రాంతాలకు మళ్లటమే ఆధునికత అంటే. మన నగరాలు, పట్టణాలు ఇప్పటికీ ప్రతి వానాకాలంలో వరదలతో అస్తవ్యస్తమవుతుంటే, రాబోయే కాలంలో పట్టణాల్లో జనాభా రెట్టింపైతే ఎంత విధ్వంసం, వైపరీత్యం జరుగుతుందో ఊహించగలమా! ఈ నేపథ్యంలో మనం చేయాల్సింది ఏమిటి?



మొదటిది, అన్ని పట్టణ ప్రాంతాల్లో సహజ నీటి ప్రవాహాలు, వరద నీటి కాలువలకు ఉన్న అన్ని అవరోధాలను మనం తొలగించాలి. అడ్డగోలు ప్రణాళిక, అసమర్థ అమలు, భూములపై ఒత్తిడి వల్ల చాలా

నగరాల్లో సహజ వరద మార్గాలు, నీటి వనరులు కుదించుకుపోయాయి, దీనివల్ల సాధారణ వర్షానికి కూడా భారీ వరదలు ముంచెత్తుతున్నాయి. వర్షపు నీరు భూమి వాలును అనుసరించి వెళ్తుండాలి. నీటి ప్రవాహాలు, సహజ నీటి కాలువలు, నదుల్లోకి ఇంకాలి. ఈ నీటి ప్రవాహాల్ని అడ్డుకోవటం వల్ల వరదలు, రోడ్లు, నివాస భవనాలు, మానవ ఆవాసాల ముంపు అనివార్యమవుతుంది. సహజ ప్రవాహ మార్గాలకు అన్ని అవరోధాలనూ తొలగించటానికి భారీ ఎత్తున ప్రచార కార్యక్రమం ప్రారంభించాలి. వరద నీటి కాలువల్ని పూడిక తీసి ఆటంకాలు లేకుండా వరద నీరు ప్రవహించేలా పక్కా చర్యలు తీసుకోవాలి. ఎంత వర్షపాతం పడుతుంది, భారీ వర్షాలు పడితే మన వరద నీటి కాలువలు, నీటి ప్రవాహ మార్గాల ద్వారా ఎంత నీరు బయటికెళ్లే అవకాశముందో ప్రతి పట్టణ ప్రాంతానికి సంబంధించి మనకు తగినంత సమాచారం ఉంది. ఏ ఒక్క అవరోధం, ఇరుకు మార్గం ఉన్నా, మిగిలిన వ్యవస్థకు తగినంత డ్రైనేజి సామర్థ్యం ఉన్నప్పటికీ వరద నీటి ప్రవాహం పొంగి పొర్లుతుంది. కాబట్టి వరద నీటి డ్రెయిన్లను రాబోయే అవసరాల్ని కూడా దృష్టిలో పెట్టుకుని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలి. ఏ కాస్త పొరపాటుకూ సందివ్వకూడదు. లేకుంటే మన నగరాల్ని వరదలు ముంచెత్తటం ఏటా అనివార్య పరిణామమవుతుంది.

రెండోది, అస్తవ్యస్త పట్టణీకరణ నుంచి ఇప్పటివరకూ నేర్చుకున్న పాఠాల్ని అమలు చేయటం. తద్వారా పెరుగుతున్న పట్టణ నివాసాల వల్ల భవిష్యత్తులో వరదలు రాకుండా నివారించటం. పట్టణీకరణలో మనం ఇప్పటికీ దిగువ స్థాయిలో ఉన్నాం. రెట్టింపు కానున్న పట్టణ జనాభాకు తగ్గట్లు మనం సిద్ధం కావాలి. ప్రపంచంలోని గొప్ప నగరాలన్నీ భౌగోళిక కాంటూర్లను (మిట్టపల్లాల రేఖాచిత్రాల్ని), భూమి వాలును పరిగణలోకి తీసుకుని ప్రణాళికాబద్ధంగా నిర్మించినవే. ముందుగా భూమి కాంటూర్ సర్వేలు చేశారు. ఆ తర్వాత ప్రతి చిన్న అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి కాంటూర్ మ్యాపుల్ని రూపొందించారు. ఆ తర్వాత వరద నీటి కాలువల్ని, నీటి పైపుల్ని, మురుగునీటి వ్యవస్థల్ని కాంటూర్లకు అనుగుణంగా నిర్మించారు. లండన్, పారిస్, రోమ్, బెర్లిన్, న్యూయార్క్, షికాగో, టోక్యో ఇలా మహానగరాలన్నింటిని నీటివాలును బట్టి నిర్మాణం చేశారు.

భారతీయ నగరాలకు పూర్తిస్థాయి కాంటూర్ మ్యాపులు లేవు. మన మౌలిక వసతులు, పట్టణ ప్రణాళిక, మానవ ఆవాసాలు వీటన్నిటికీ మన సహజ కాంటూర్లను, భూమి పల్లాన్ని అవసరమైన మేర పరిగణలోకి తీసుకోలేదు. అస్తవ్యస్త, అశాస్త్రీయ పట్టణ ప్రణాళిక వల్ల వరదలొచ్చే లోతట్టు ప్రాంతాలలో నివాస భవనాలు, హౌసింగ్ కాలనీలు చట్టబద్ధ అనుమతులతో వెలిశాయి. వరద నీరు చట్టబద్ధ సరిహద్దుల్ని, నిర్మాణ అనుమతుల్ని గౌరవించదు. నీరు పల్లమెరుగు. కేవలం వాలును గౌరవిస్తుంది. భూమ్యాకర్షణ సూత్రాన్ని అనుసరిస్తుంది. మన పట్టణ ప్రణాళిక, నియంత్రణ ప్రకృతిని గౌరవించాలి. మన కాంటూర్ పటాల్ని నగరాలు, పట్టణాల్లోని ప్రతి ప్రాంతానికీ రూపొందించాలి. ఈవేళ్టి



జీపీఎస్, డిజిటల్ టెక్నాలజీ కాలంలో కాంటూర్ మ్యాపింగ్‌ను సమగ్రంగా, వేగంగా తక్కువ ఖర్చుతోనే రూపొందించవచ్చు. నీటి ప్రవాహాలకున్న అన్ని అవరోధాల్ని తొలగించటంలో, కొత్త మౌలిక సదుపాయాల్ని నిర్మించటంలో, అన్నిటినీ మించి భవిష్యత్తులో మొత్తం పట్టణ ప్రణాళిక, నిర్మాణాల అనుమతుల్లో కాంటూర్ మ్యాపులు మనకు దిశానిర్దేశం కావాలి.

మూడోది, తక్కువ నైపుణ్యాలున్న గ్రామీణ పేదలు ఎక్కడికో దూరంగా దుర్భర జీవితం గడపాల్సిన పెద్ద నగరాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామాల మధ్య చిన్న పట్టణాల అభివృద్ధిని మనం ప్రోత్సహించాలి. ప్రత్యేక నైపుణ్యాలున్న ఆర్థిక కలాపాల కోసం పెద్ద నగరాలు అవసరం. అలాంటి సముదాయాలు, ఆ క్లస్టర్ ప్రభావం అక్కడ సాధ్యం. మిగిలిన అత్యధిక శాతం ప్రజలు పట్టణ ప్రాంతాల్లో సౌకర్యవంతంగా జీవించటానికి, ఉపాధి అవకాశాలు పొందటానికి మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం అందుబాటులో ఉండాలి. కాబట్టి చిన్న పట్టణాల్ని ఆర్థిక కార్యకలాపాలకి కేంద్ర బిందువు చేయాలి. గ్రామీణ ప్రాంతాల నుంచి వలసల్ని ఆకర్షించగలిగేలా అభివృద్ధి చేయాలి. దీనివల్ల ప్రజల జీవితాల్లో నాణ్యత పెరుగుతుంది. పట్టణ ప్రణాళిక, వరదల నియంత్రణ మరింత సులభమవుతుంది. సరైన, అవసరమైన స్థాయి వరద నీటి డ్రైనేజీల ఏర్పాటుకి చిన్న పట్టణాలు కూడా ఇదే రకమైన సూత్రాలను అనుసరించాలి. కానీ చిన్న పట్టణ ప్రాంతాల్లో వరదల నివారణ తేలిక. ఎక్కువ జనసాంద్రత, కళ్లు చెదిరే ఆస్తుల విలువ ఉండే పెద్ద నగరాలలో వరద నీటి నిర్వహణ వ్యయం ఎంతో ఎక్కువ. వరదల వల్ల విధ్వంసం, నష్టం మరింత ఎక్కువ.

మన కష్టాల్లో చాలావాటికి ప్రకృతిని నిందించలేం. ప్రకృతికి అనుగుణంగా మారే సామర్థ్యం మానవ సమాజానికి సహజ లక్షణం. భూతాపం అనివార్యం. గ్రీన్‌హౌస్ వాయువులు వెలువడటం తగ్గించటానికి ఒక దేశంగా మనం ఎంత సాధ్యమైతే అంతా చేయాలి. కానీ అసాధారణ రీతిలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల వరదల్ని కూడా మనం నియంత్రించాలి. సరైన ప్రణాళిక, అమలుతో మన లాంటి నీటి కొరత గల, రుతుపవనాల మీద ఆధారపడిన దేశంలో అధిక వర్షపాతం వరమే అవుతుంది. సరైన పట్టణ ప్రణాళిక, అమలుతో ప్రతికూలతని అవకాశంగా మార్చుకోగలం.

# రాజకీయ విలువల పాతకాపు!

ఇటీవల దివంగతులైన సోలిపేట రామచంద్రారెడ్డి పాతతరం రాజకీయాలకు ప్రతినిధి, కొత్తతరానికి రాజకీయ గురువు. ప్రజాసేవకు నిరంతరం కృషి చేసిన ఆయన తాను నిర్వహించిన ప్రతి హోదాకు వన్నె తెచ్చారు. పదవులకు పర్యాయపదం సామాజిక సేవనే అని తన జీవన గమనం ద్వారా నిరూపించారు.



విద్యార్థి దశలోనే సోషలిస్టు భావజాలానికి ఆకర్షితుడైన రామచంద్రారెడ్డి తొలితరం కమ్యూనిస్టుగా ఆనాడు ఉధృతంగా సాగుతున్న తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. సిటీ కాలేజీలో ఇంటర్మీడియెట్ చదువుతున్న రోజుల్లో స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికల్లో ప్రెసిడెంటుగా ఎన్నికయ్యారు. విద్యార్థి నాయకుడిగా, కమ్యూనిస్టు పార్టీ పూర్తిస్థాయి కార్యకర్తగా నిజాం పాలనకు వ్యతిరేకంగా నిలబడ్డారు. తొలి అసెంబ్లీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి గురువారెడ్డి గెలుపు కోసం కృషి చేశారు. రామచంద్రారెడ్డి కార్యదక్షతను, క్రమశిక్షణను మెచ్చుకొన్న గురువారెడ్డి ఆయనను రాజకీయాల వైపు ఆహ్వానించారు. అంతటితో చదువు ఆపేసి గ్రామస్థాయిలో రాజకీయ ప్రస్థానాన్ని ఆరంభించారు. ఇరవై నాలుగేళ్ళ వయస్సులోనే రామచంద్రారెడ్డి సొంత గ్రామం చిట్టాపూర్ గ్రామ సర్పంచిగా ఎన్నికై రెండు పర్యాయాలు కొనసాగారు. ఆ తరవాత దుబ్బాక సమితి అధ్యక్షుడిగా ఉన్నారు. రెండేళ్ల పాటు సిద్దిపేట వ్యవసాయ కమిటీ చైర్మన్‌గా ఉన్నారు. 1972లో కాంగ్రెస్ తరఫున దొమ్మాట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కొంతకాలం మెదక్ జిల్లా సహకార బ్యాంకు చైర్మన్‌గా, ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ సంస్థ అధ్యక్షుడిగా కొనసాగారు. ఆ తరవాత రామచంద్రారెడ్డి తెలుగుదేశం పార్టీ నుంచి రాజ్యసభకు ఎంపికై 1996%--%2002 వరకు ఫ్లోర్ లీడర్‌గా ఉన్నారు. వీటికి అదనంగా తనలోని కమ్యూనిస్టు మూలాలకు అనుగుణంగా భారత చైనా మిత్ర మండలి, సి.ఆర్. ఫౌండేషన్, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టుల్లోనూ గణనీయ పాత్రను పోషించారు. ఈ రకంగా తాను ఏ పార్టీలో ఉన్నా మార్క్సిస్టు భావజాలాన్ని వీడలేదు. నలభై ఏళ్లపాటు రాజకీయ నాయకుడిగా వివిధ పదవుల్లో కొనసాగిన రామచంద్రారెడ్డి తన మాటతీరులో, నడవడిలో ఏనాడూ నీతినియామాల్ని జవ దాటలేదు. భారత చైనా మిత్ర మండలితో ఆయన అనుబంధం విడదీయరానిది. వయసును లెక్క చేయకుండా వారి కార్యక్రమాల్లో పాల్గొంటూ చైనా జీవన విధాన వైవిధ్యాన్ని, భారత చైనా మైత్రి మధ్య అమెరికా పాత్రను చక్కగా వివరించేవారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించే నాయకులకు, కార్యకర్తలకు ఆయన తోడుగా ఉండేవారు. ఆ క్రమంలో ఓపిడిఆర్, డిఎస్?ఓ లాంటి వామపక్ష సంస్థల కార్యక్రమాలకు హాజరయ్యేవారు. వయసు పైబడినా ఆయన ప్రసంగాలు ఉద్వేగపూరితంగా ప్రేరణాత్మకంగా ఉండేవి. ఎన్నో పుస్తకాలు చదివిన ఆయన మేధస్సు వాటిలో ప్రస్ఫుటించేది. తాను పాల్గొన్న ప్రతి సభలోను పేదరికం, నిరుద్యోగం, విద్య, వైద్యం లాంటి మౌలిక సమస్యల గురించి ప్రస్తావిస్తూ సంఘటిత ఉద్యమాల నిర్మాణమే దీనికి పరిష్కారం అని ఘంటాపథంగా చెప్పేవారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నో పార్లమెంట్ కమిటీల్లో సభ్యుడిగా ఉన్నారు. విదేశీ పర్యటనల ద్వారా వచ్చిన అనుభవాలతో వివిధ రంగాల్లో అభివృద్ధికి దోహదపడ్డారు. జనం అభివృద్ధి కోసం భిన్న ఆలోచనావిధానాలను ఒక్కతాటిపైకి తెచ్చిన అరుదైన నేత సోలిపేట.

**-బి. నర్సన్ (ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)-**

# అణగారిన వర్గాలకు గొంతునిచ్చిన గద్దర్



**గద్దర్ మృతి తెలంగాణ సమాజానికి పెద్ద లోటు. అణగారిన వర్గాలకు గొంతునిచ్చారాయన. గద్దర్‌లోని ఆర్తి, తపన, సృజనాత్మకత, నైపుణ్యాలు కోట్ల మంది ప్రజల్ని కదిలించాయి. ఆయన సత్యాన్వేషి, కొత్త ఆలోచలను భేషజాలు లేకుండా స్వీకరించేవారు. గద్దర్ మృతి వల్ల ఒక సాంస్కృతిక దిగ్గజాన్ని కోల్పోయాం అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నివాళులర్పించారు.**

# బియ్యం ఎగుమతులపై నిషేధం
# రైతుకి, దేశానికి హానికరం

బియ్యం ఎగుమతులపై యూనియన్ ప్రభుత్వం నిషేధం విధించటం అర్థరహితం, ప్రగతి నిరోధకమని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆక్షేపించారు. ఈ పార్టీ ఆ పార్టీ అని తేడా లేకుండా వ్యవసాయోత్పత్తుల విషయంలో మన దేశంలో ప్రభుత్వాలు స్పష్టత, నిలకడ లేకుండా వ్యవహరించటం వల్ల స్వతంత్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలవుతున్నా రైతులు తీవ్రంగా నష్టపోతూనే ఉన్నారన్నారు. ప్రపంచ దేశాలన్నీ ఎగుమతుల్ని ప్రోత్సహిస్తుంటే, ఎగుమతి రాయితీలిస్తుంటే, మన ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా ఆంక్షల్ని విధిస్తూ, ఎగుమతులపై కూడా సుంకాలు విధించి రైతుకి నష్టం చేస్తున్నాయన్నారు. పాలకుల అసంబద్ధ చర్యల వల్ల వ్యవసాయం ముడిసరకు ఉత్పత్తి చేసే రంగంగానే కొనసాగుతోంది తప్ప ఆ రంగంలో ఉన్నవారికి ఆదాయం అందించే, దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే శక్తిగా ఎదగటం లేదన్నారు. బాస్మతియేతర రకాల బియ్యం ఎగుమతులపై ప్రభుత్వం తాజాగా విధించిన నిషేధం మరోసారి అదే తరహాలో రైతుకు, దేశానికి హానికర నిర్ణయమన్నారు.

లోక్‌సత్తా కృషి వల్ల 2011లో బియ్యం ఎగుమతులపై ఆంక్షల్ని తొలగించారని, అప్పటి నుంచి ఇప్పటిదాకా భారతదేశం బియ్యం ఎగుమతుల్లో ప్రపంచంలో అగ్రస్థానంలో కొనసాగుతోందని, ఏటా కోటి టన్నుల దాకా ఎగుమతి జరుగుతోందని, తెలుగు రాష్ట్రాలు అత్యధిక లబ్ధి పొందుతున్నాయని జేపీ తెలిపారు.

అప్పట్లో పక్కరాష్ట్రాలలో ధాన్యానికి ఎక్కువ రేటు ఉన్నా తెలుగు ప్రాంత రైతులు అమ్ముకోకూడదని నిత్యావసర వస్తువుల చట్టాన్ని అడ్డం పెట్టి ఆంక్షలు విధించారని, ఆ రాష్ట్రాల్లో బీపీటీ రకం 74 కేజీల బస్తా రూ.1200 ఉంటే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రూ.750 ఉండేదని జేపీ గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో తాను రైతుల్ని సమీకరించి కర్నూలు నుంచి కర్ణాటకకు, నిజామాబాద్ నుంచి మహారాష్ట్రకు ధాన్యం మూటలతో పాదయాత్ర చేసి ఆంక్షల్ని ధిక్కరించి అక్కడ అమ్మకం చేశానని, తనను అరెస్టు చేసే సాహసం ప్రభుత్వాలు చేయలేకపోయాయని.. ఎప్పుడైతే ఆంక్షలు తొలగాయో వారం రోజుల్లోనే మన వద్ద కూడా ధాన్యం రేట్లు పెరిగాయన్నారు. పెరిగిన రేటుకి అమ్మడై మన రైతులకు ఒక్క సీజన్‌లో ఆ ఒక్క వెరైటీ ధాన్యానికి



రూ.3600 కోట్ల మేర అదనంగా లాభం చేకూరిందన్నారు. అప్పటి దాకా అంత డబ్బు రైతుకు రాకుండా ఒక్క కలంపోటుతో ప్రభుత్వం అడ్డుకుందన్నారు. ఆ తర్వాత ఏపీలో అన్ని పార్టీలనూ కూర్చోపెట్టి సంక్షోభాన్ని వివరించి అందరినీ ఎగుమతులకు ఒప్పించానన్నారు. 2011, ఏప్రిల్‌లో ప్రధానమంత్రి డా॥ మన్మోహన్‌సింగ్‌ను కలిసి మన దేశంలో ధాన్యం నిల్వలు ఎలా మూలుగుతున్నాయో, ధర లేక రైతులు ఎంత నష్టపోతున్నారో, ఇతర దేశాల్లో డిమాండ్ ఉన్నా ఎగుమతులపై నిషేధం వల్ల ఎలా అమ్ముకోలేకపోతున్నామో వివరించానని, తాను చెప్పిన వివరాల కంటే అదనపు సమాచారాన్ని ప్రధాని ప్రస్తావించారన్నారు. పాకిస్తాన్, సైబీరియా మొదలైన దేశాల్లో ప్రకృతి వైపరీత్యాల వల్ల ధాన్యం దిగుబడి తగ్గటాన్ని గణాంకాలతో సహా చెప్పారన్నారు. వెంటనే రిజర్వుబ్యాంకు ఆధర్వ్యంలో కమిటీ వేసి ఆ నివేదిక ద్వారా ఆహారధాన్యాల ఎగుమతులపై నిషేధం తొలగించారన్నారు.

ఇప్పుడు బియ్యం ఎగుమతులపై నిషేధం సమాచారం రాగానే, నిల్వల వివరాలను పరిశీలించానని, 2023, జులై 1వ తేదీ నాటికి మన వద్ద 2 కోట్ల 53 లక్షల టన్నులు కేవలం ప్రభుత్వ గోదాముల్లోనే ఉన్నాయని జేపీ అన్నారు. మనకు 1 కోటి 15 లక్షల టన్నుల నిల్వలు చాలని, వ్యూహాత్మక అవసరాల రీత్యా 20 లక్షలు టన్నులు సరిపోతాయని, ఇటువంటి పరిస్థితుల్లో ఎగుమతులపై



నిషేధం ఎందుకు విధించారో అర్థం కాదన్నారు.

దేశ జీడీపీలో వ్యవసాయం వాటా 15 శాతం వరకు మాత్రమే ఉన్నా ఇప్పటికీ జనాభాలో సగం మంది సాగురంగం మీదే ఆధారపడి ఉన్నారని జేపీ అన్నారు. తాత్కాలిక ధోరణితో నిర్ణయాలు తీసుకుంటే మన పట్ల ఇతర దేశాల్లో నమ్మకం సడలుతుందన్నారు. మళ్లీ ఎగుమతుల్ని తిరిగి ప్రారంభించినా తక్కువ రేటు ఇస్తారన్నారు. ధాన్యం విషయంలోనే కాకుండా, అంతర్జాతీయ వాణిజ్యంలో ప్రతి పంట విషయంలో మన పాలకులు ఇలాంటి ధోరణినే అవలంబిస్తున్నారన్నారు.

ఉదాహరణకు, మన దేశం వంటనూనెల అతిపెద్ద దిగుమతిదారుగా ఉందని, గత సంవత్సరం రూ. 1,53,000 కోట్లు విదేశీ మారక ద్రవ్యాన్ని ఇందుకోసం చెల్లించామని జేపీ అన్నారు. దేశంలో సుమారు 2 కోట్ల 70 లక్షల మంది రైతులు నూనెగింజల్ని పండిస్తున్నారన్నారు. ఇంతమంది రైతులు ఆధారపడినా, దేశ ప్రజలకు ఆహారంలో వంటనూనెలు, పప్పు దినుసులు తప్పనిసరైనా నిరంతరం దిగుమతులపై ఆధారపడేలా ప్రభుత్వాల విధానాలున్నాయన్నారు. మనకంటే తక్కువ ఖర్చుతో వంటనూనెల పంటల్ని పండించే వాతావరణం ఇతర దేశాల్లో ఉన్నప్పుడు, మనకు అవి నిత్యావసరమైనప్పుడు స్వయంసమృద్ధి సాధించే దిశగా కనీసం ఆలోచన చేయలేదన్నారు. వంటనూనెల దిగుమతులపై దిగుమతి సుంకం విధించి ఆ డబ్బు మన రైతులకే ఇస్తే మిగతాది రైతులు చూసుకుంటారని, కొద్దికాలంలోనే దేశ అవసరాలకు తగ్గట్లు నూనెల్ని పండించగలుగుతారని తాను యూపీయే ప్రభుత్వ హయాం నుంచి పోరాటం చేస్తే ఎట్టకేలకు 2017-18లో దిగుమతి సుంకం విధించారన్నారు. మొదట్లో 44 శాతం, ఆ తర్వాత 37.5 నుంచి 27 శాతం దాకా సుంకం అమలు చేశారన్నారు. దీనివల్ల తెలుగు రాష్ట్రాల్లో ఆయిల్ పామ్ రైతులు సైతం ఎంతో లబ్ధి పొందగలిగారన్నారు. కానీ వంటనూనెలకు పెద్ద ఎగుమతిదారుగా ఉన్న ఉక్రెయిన్ దేశంలో యుద్ధం వచ్చాక అంతర్జాతీయ మార్కెట్‌లో ఒడిదుడుకులను సాకుగా చూపి వంటనూనెలపై దిగుమతి సుంకం ఎత్తివేశారన్నారు. ప్రపంచ మార్కెట్‌లో రేట్లు తగ్గి స్థిరంగా ఉన్నా మళ్లీ సుంకం విధించకుండా మరో ఏడాది తర్వాత చూస్తామని ఇటీవల ప్రకటించారని, దీనివల్ల మన దేశంలో ఆయిల్ పామ్ ధరలు సగానికి సగం పడిపోయాయన్నారు. ఏ ఉద్యోగికైనా జీతాలు సగం తగ్గితే పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలన్నారు. రైతుకి గతం కంటే ఖర్చు పెరిగి, పంట ధర తగ్గితే ఎంత సంక్షోభమో గుర్తించాలన్నారు. ఇవన్నీ అర్థంకాక రైతులు తమకు మేలు చేసే వ్యవసాయ చట్టాలను కూడా వెనక్కి తీసుకునేలా చేశారని, సంకెళ్లు కావాలని కోరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారి ఆదాయాలకు ప్రభుత్వాలు గండి కొడుతున్నాయన్నారు.

పాలకుల్లో చాలామంది రైతు నేపథ్యం నుంచి వచ్చినవారు ఉన్నారని, ఉద్దేశపూర్వకంగా వారు రైతులకు నష్టం చేస్తుండకపోవచ్చని, అయితే వ్యవసాయం పట్ల మనకున్న దృక్పథం, రైతంటే మనలో పాతుకుపోయిన రైతే రాజు వంటి ఇమేజ్ నష్టం చేకూరుస్తున్నాయని జేపీ తెలిపారు. రైతుకూ జీవితం ఉంటుందని, వ్యవసాయం లాభసాటిగా ఉండటంతోపాటు మంచి విద్య, ఆరోగ్యం, నాణ్యమైన పౌర సేవలు వారికీ అవసరమని మనం గుర్తించాలని, అందుకు తగ్గట్లు విధానాలను అమలు చేయాలని అన్నారు.

వరి, గోధుమలు తినటం మన దేశంలో బాగా తగ్గినా ఇప్పటికీ వాటినే అవసరానికి మించి పండిస్తున్నారని, ఇలాంటి పంటల నుంచి డిమాండ్ ఉన్న పండ్లు, కూరగాయలు, పాలు, చిరుధాన్యాలు, మాంసం, గుడ్లు వంటి వాటి ఉత్పత్తి వైపు రైతుల్ని మళ్లించేలా విధానాలు, మౌలిక వసతులు, పెట్టుబడులు ఉండాలని జేపీ అన్నారు. ఇదే సమయంలో వంటనూనెలు, పప్పు ధాన్యాలు వంటివి మన అవసరాలకు తగినట్లు పండించేలా దిగుమతి సుంకాలు విధించటం, ప్రపంచంలో ఎక్కడ డిమాండ్ ఉన్నా అమ్ముకునేలా ప్రోత్సహించే ఎగుమతుల విధానాన్ని నిలకడగా అమలు చేయటం అవసరమన్నారు. ఇవి చేయకుండా రుణమాఫీల వల్ల ఉపయోగం ఉండదని, రైతు బంధు, పీఎం కిసాన్ యోజన వంటి ఎన్ని తాత్కాలిక సాయాల్ని చేసినా అవి ఖర్చులుగా మిగులుతాయి తప్ప ఆదాయాలుగా మారవని జేపీ స్పష్టం చేశారు.

# ఏడాదికే అర్ధమైంది.. మార్పుకి మథనం మొదలైంది

## డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌తో ఆకెళ్ల రాఘవేంద్ర ముఖాముఖి(మొదటిభాగం)




**ఆకెళ్ల: ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా సంస్థల ఏర్పాటు వెనుక ఎలాంటి మథనం జరిగింది?**

**జేపీ:** స్వాతంత్ర్యం వచ్చిన పదేళ్ల తర్వాత పుట్టిన మా తరం బాగా ప్రభావితం అయింది..ఎమర్జెన్సీకి. ఈనాడు సమాజంలో వివిధ రంగాల్లో, వివిధ రూపాల్లో కృషి చేస్తున్న వాళ్లలో చాలా మంది ఆనాడు ఎమర్జెన్సీకి ప్రభావితం అయిన వాళ్లే. నేను ఆనాడు వైద్య విద్యార్థిగా ఉన్నాను. అప్పట్లో పాశ్చాత్య దేశాల్లో ప్రజాస్వామ్యం, మనదేశంలో ప్రజాస్వామ్యం గురించి, ఓటు హక్కు, రాజ్యాంగం, ప్రభుత్వాల గురించి టెక్స్ట్ బుక్స్‌లో చదువుకున్నాం.. ప్రపంచంలో ఏం జరుగుతుందో పత్రికల్లో చూశాం. తేడా కొట్టొచ్చినట్టు కనిపించింది. ముఖ్యంగా 1973-74లో వాటర్‌గేట్ కుంభకోణంలో అత్యంత శక్తివంతమైన రాష్ట్రపతిని అలవోకగా దింపేశారు. మనదేశంలో అంతకు మించి తప్పులు జరుగుతున్నా, అధికార దుర్వినియోగం ఉన్నా కూడా ఆ పని అసాధ్యం. ఈ అంతరం నన్ను బాగా కలిచివేసింది. ఈ నేపథ్యంలో దేశంలో అందరిలో వివిధ రూపాల్లో అశాంతి ఉండేది. ఆ రోజుల్లో మూడు విషయాలు..అవినీతి, నిరుద్యోగ సమస్య, బీదరికం.. ఇవన్నీ ఎందుకు ఇలా ఉన్నాయి..ఎందుకు తగ్గడం లేదు? ప్రజల్లో నెలకొన్న ఈ ఆందోళన నుంచే ఆనాడు ఉద్యమాలు వచ్చాయి. నవనిర్మాణ్ ఆందోళన పేరుతో గుజరాత్‌లో, బీహార్‌లో లోక్‌నాయక్ జేపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు మొదలయ్యాయి. ఆనాటి రాజకీయ వ్యవస్థ దాన్ని నిర్మాణాత్మకంగా తీసుకోకుండా, ఆత్మశోధన లేకుండా గతంలో కొంత మంచి చేశాం..కొన్ని తప్పులు చేశాం.

మంచిని పెంచుదాం..తప్పుల్ని సవరిద్దామనే ఆలోచన లేకుండా అణిచేసే కార్యక్రమం పెట్టారు. దాంతో ఎమర్జెన్సీ వచ్చింది. దేశం అంతా జైలుగా మారింది. దాన్ని మేమంతా తీవ్రంగా ప్రతిఘటించాం. ఎమర్జెన్సీ పోయాక ఆనందంతో గంతులు వేశాను..కానీ ఆ ఆనందం ఎంతోకాలం నిలవలేదు. స్వేచ్ఛ తిరిగొచ్చింది కానీ వ్యవస్థ మారలేదు. హౌస్ సర్జన్‌గా చేస్తుండగా ...ఆవేశం ఉంది..ఏదో చేయాలనే తపన ఉంది..ఐఏఎస్‌కు వెళ్లొచ్చు కదా అని ఎవరో సూచించారు. అప్పుడే డాక్టర్లను కూడా ఐఏఎస్‌కు అనుమతిస్తున్నారు..దీంతో ఆ మాట చెప్పగానే నేను సివిల్ సర్వీసెస్ వైపు వచ్చేశాను. వచ్చిన సంవత్సరం పాటు పెద్దగా తేడా తెలియలేదు. ఎందుకంటే జాతీయస్థాయిలో క్లాసురూమ్‌ల్లో కూర్చుంటాం..అత్యున్నత స్థాయిలో చర్చలు జరుపుతుంటాం. దేశంలోని మహామహులను కలుస్తాం..క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో పెద్దగా అవగాహన ఉండదు. నేను కరీంనగర్ జిల్లాకు ట్రయినింగ్‌కు వెళ్లాను. అక్కడ ఆరేడు నెలలు ఉండగానే మనసున్న అందరికీ పరిస్థితి అర్థం అయింది. మహారాష్ట్రకు చెందిన ఓ మిత్రుడు, తెలంగాణకు చెందిన మరో మిత్రుడు ముగ్గురం నిజామాబాద్‌లో కలిశాం. కచ్చితంగా నేను దీన్నుంచి బయటకు పోవాల్సిందే అని నేను ఆనాడే అన్నాను.. కానీ ఎప్పుడో చెప్పలేదు. అప్పుడే నాకు అర్థం అయింది. అయితే చేరినప్పుడు ఈ మాట అనుకోలేదు. మంచి పాలకుడు ఉంటే, సమర్థవంతమైన అధికారి ఉంటే, నిజాయితీ పరుడు ఉంటే చాలదు..వ్యవస్థలో మార్పులు రావు...అయితే వీరందరూ అవసరం. కానీ ఇంతకంటే లోతు ఉందని అర్థం అయింది. కానీ ఏమిటి, ఎలా అనేది అర్థం కాలేదు. దూరం నుంచి సమస్య తీవ్రత బాగా అర్థం అయింది. ఆ తర్వాత నుంచి అదృష్టం కొద్దీ చేతనైనంత చేయడం, అంతకు మించి నేర్చుకోవడం, చేసిన కొద్దీ ప్రజలు బాగా స్పందించడం చూశాను. అయితే ఏ చెట్టూ లేని చోట ఆముదం వృక్షమే మహావృక్షం కదా! గుడ్డివాళ్ల ప్రభుత్వంలో ఒంటికన్ను వాడే రాజంట..కానీ నా దృష్టిలో చేసేది చాలా తక్కువ. అల్ప సంతోషులయ్యా మీరంతా 100 చేయాల్సి ఉంటే 30 చేస్తున్నాను..దీనికే పొంగిపోతున్నారని ప్రజలతో అనేవాడ్ని. 70..80శాతం జరిగితే కానీ దేశానికి భవిష్యత్తు లేదు.నాకు జరగంది కనిపిస్తోంది..మీకు జరిగింది కనిపిస్తోంది..అని చెప్పేవాడ్ని. నన్ను నేను మోసం చేసుకోలేదు. ఆత్మవంచన చేసుకోలేదు. కానీ ఓ పక్కన విజయాలు సాధించిన ఉత్సాహం..మరో పక్క వ్యవస్థను లోతుగా అధ్యయనం చేయడం వల్ల అసలు వ్యవస్థ ఏమిటి? ఎందుకిలా తయారవుతుంది..అనేది ఆలోచించేవాడ్ని.. అందుకే అప్పటికీ ఇప్పటికీ వాళ్లంతా విలన్లు..మనం అంతా హీరోలం అనలేదు. ఒక విషవలయంలో అందరం కూడా బందీలైపోయాం. అది బాగా అర్థం అయింది. బహుశా లోక్‌సత్తాకు పునాదిగా ఉన్న సైద్ధాంతిక అంశాలు అక్కడి నుంచే వచ్చాయి. 90వ దశకంలో నేను బాగా అంతర్మథనం చేసుకునేవాడ్ని. రాత్రిపూట అర్ధరాత్రి నిద్రలేచే వాడ్ని..బహుశా మూడోవంతు రాత్రంతా నిద్రలేకుండా గడిపే వాడ్ని..పుస్తకాలు అధ్యయనం చేసేవాడ్ని. చాలా ఆలోచించేవాడ్ని..రాస్తుండేవాడ్ని. ఒకరిద్దరు మిత్రులతో భావాలు పంచుకునేవాడ్ని. వేర్వేరు అంశాల మీద అధ్యయనం చేసి ఓ నిర్ధారణకు వచ్చే వాడ్ని. 90వ దశకంలో అది బాగా పరిణితికి వచ్చింది. బహుశా 1992లో అనుకుంట అడ్మినిస్ట్రేటివ్ కాలేజీలో ఓ శిక్షణ నిమిత్తం వారం రోజుల పాటు ఉన్నప్పుడు సమయం చిక్కింది. ఆ వారం రోజులు నేను దీనిమీదే కాస్త అధ్యయనం చేసి ఒక ప్రజంటేషన్ తయారు చేశాను. ఈ దేశంలో ఏ మార్పులు కావాలనేది ఒకసారి స్పష్టంగా అర్థం అయ్యాక ఎందుకు వ్యవస్థ అనుకున్న ఫలితాలు సాధించలేకపోతుంది..అన్నప్పుడు ఇక మనం సాధించడం కోసం మనం ప్రయత్నాన్ని చేయడమా? లేకపోతే మేధోపరంగా తెలుసుకున్నాం కాబట్టి మన పని మనం మామూలుగా కొనసాగించడమా? నాకు ఏమాత్రం కూడా అనుమానం లేదు. ఎందుకంటే నేను చేరింది ఉద్యోగం కోసం.. అధికారం కోసం కాదు. ఏ లక్ష్యాలతో చేరానో ఆ లక్ష్యాలతోనే బయటకు రావాలని అనుకున్నా..అందుకే నేను బయటకు వచ్చేటప్పుడు ఎవర్నీ నిందించలేదు..ఎవర్నీ తిట్టలేదు. మనం అందరం వ్యవస్థలో బందీలైపోయాం. దీని కారణంగా ఈ మార్పులు రావాలని కొన్ని వేలమంది మిత్రులకు లేఖరాసి మౌనంగా నిష్క్రమించాను. అదే లక్ష్యాలతో లోక్‌సత్తా ఏర్పాటు చేశాం. ఈ అంతర్మథనం బహుశా ఓ 23 ఏళ్లు కొనసాగింది. ఓ పౌరుడిగా, అధికారిగా ఆ పరిణితి వచ్చాక మళ్లీ అమాయకుడిగా ఐదేళ్లలో మార్పులు వచ్చేస్తాయని అనుకున్నాను. ఎందుకంటే ఆశావాదం, టెక్నాలజీ, చదువుకున్న వాళ్లు, విజ్ఞానశాస్త్రం చదివిన వాళ్లందరూ హేతుబద్ధమైన పరిష్కారం ఉంటే ఇట్టే జరిగిపోతుందనే నమ్మకం ఉంటుంది. అలా అనుకున్నాను నేను.

**(ఇంకావుంది)**

# వలంటీర్ల వ్యవస్థతో స్థానిక ప్రభుత్వాలకు గండి

వలంటీర్ల వ్యవస్థతో విప్లవమంటూ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేస్తోందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ బొబ్బిలిలో అన్నారు. రాష్ట్రంలోని 13,371 పంచాయతీలకు ఎన్నికలు 2021లో జరిగాయని, సర్పంచ్‌లుగా గెలిచినవారు రెండున్నరేళ్లుగా ఎందుకు గెలిచామో తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. పంచాయతీ నిధుల్ని పక్కదోవ పట్టించి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికైన ప్రజాప్రతినిధుల్ని నిస్సహాయుల్ని చేసిందన్నారు. గ్రామాల్లోని క్లాప్ కార్యకర్తలకు, గ్రీన్ అంబాసిడర్లకి జీతాలివ్వలేని స్థితిలో ఉన్నారన్నారు. స్థానిక ప్రభుత్వాలు ప్రజాస్వామ్యానికి పాఠశాలలు కాబట్టే లోక్‌సత్తా వాటికి సాధికారత కోసం భారీ ఉద్యమాలు చేసిందని, అధికార వికేంద్రీకరణ తమ మౌలిక లక్ష్యాల్లో ఒకటన్నారు. మీడియా సమావేశంలో లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు, పార్వతీపురం నియోజకవర్గ అధ్యక్షుడు, జిల్లా బాధ్యుడు కొత్తకోట పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర నుండి వలసలు ఆపండి

ఉన్న ఊళ్లో ఉపాధి లేక విధిలేని పరిస్థితుల్లో ఇళ్లకు వృద్ధులను కాపలాపెట్టి ఉపాధి కోసం భార్యాపిల్లలతో ఉత్తరాంధ్ర నుంచి వలసలు పోతున్నారని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు ప్రత్యేక శ్రద్ధతో వలసలు ఆపే ప్రయత్నం చేయాలని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. విశాఖపట్నంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకంలో వంద రోజుల పని నిబంధన వల్ల కూలీలు బాగా నష్టపోతున్నారని, ఇంట్లో నలుగురు ఉంటే ఒక్కొక్కరికి పని దొరికేది 25 రోజులేనని, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుండి అధిక సంఖ్యలో గ్రామాల నుండి హైదరాబాద్, చెన్నై, ముంబయి వంటి మహానగరాలతో పాటు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విజయవాడ ప్రాంతాలకు ఉపాధి కోసం యువత తరలిపోతున్నారన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయని, చదువుకున్న యువత ప్రభుత్వంపై గుర్రుగా ఉందని అన్నారు. ఎన్నికల రాజకీయాలపై ఉన్న శ్రద్ధ యువత ఉపాధి అవకాశాలపై లేదన్నారు. ఉత్తరాంధ్రలోని ఫార్మా కంపెనీల్లో స్థానికులకు తగిన అవకాశాలు లభించకున్నా వారికి తగిన శిక్షణనిచ్చి ఉపాధి కల్పించే ప్రయత్నం ఎమ్మెల్యేలు, అధికారులు చేయటం లేదన్నారు. మొక్కజొన్న, చెరకు, వరి సాగు చేసిన రైతులు వ్యవసాయంలో గిట్టుబాటు ధర లేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు ఉపాధి అవకాశాల మీద ప్రభుత్వం, నేతలు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు వేణుగోపాల్, గొట్టాపు సుధీర్, ఎం.ఎస్.ఎన్ మూర్తి, వడ్డే హరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# హంద్రీనీవా ద్వారా చెరువులకు నీళ్లు నింపాలి

హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా చెరువులకు నీళ్లు నింపాలని లోక్‌సత్తా పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఆనందాచారి అఖిలపక్ష కార్యక్రమంలో విజ్ఞప్తి చేశారు. పాలకుల వైఫల్యం కారణంగా పత్తికొండ ప్రాంత రైతులకు సాగునీరు అందటం లేదన్నారు. పందికోన రిజర్వాయర్ కింద ఉన్న కుడి, ఎడమ కాలువ స్థిరీకరణ పనులు పూర్తిచేసి 61,400 ఎకరాలకు నీరు అందించాలన్నారు. ఎడమ కాలువ ద్వారా పెద్దహుల్టి మీదుగా అటికలగుండు, నలకదొడ్డి, ఆస్పరి మండలం వెంగళాయిదొడ్డి వరకు కాలువ విస్తరించాలన్నారు. తుగ్గలి మండలం రాంపల్లి దగ్గర, మద్దికేర మండలం బసినేపల్లి దగ్గర మినీ రిజర్వాయర్లు నిర్మించాలన్నారు. ఈ మేరకు ఆర్డీఓకు వినతిపత్రం ఇచ్చిన కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య నేతృత్వం వహించగా ఆ పార్టీ నేతలు డి. రాజాసాహెబ్, రామాంజనేయులు, గురుదాస్, సురేంద్ర కుమార్, తిమ్మయ్య, కారన్న, టీడీపీ నేతలు అశోక్ కుమార్, గుడిసె నరసింహులు, సీపీఎం నాయకులు దస్తగిరి, గోపాల్, కాంగ్రెస్ ప్రతినిధి నాగార్జున, జనసేన నేత వీరేష్, లోక్‌సత్తా నేత జయరాం, ప్రజాసంఘాల నాయకులు నెట్టి కంటయ్య, రంగన్న, జొహరాపురం కాశి, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# యూనిఫామ్ సివిల్ కోడ్‌పై వ్యవసాయ చట్టాల తరహాలో తొందరపడొద్దు

## డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

ప్రతి సమాజంలో రాజ్యాంగం ఉన్నత విలువలు ప్రతిపాదిస్తుంది. అదే సమాజంలో సామాజిక రీతి ఉంటుంది. చారిత్రకంగా, సాంస్కృతికంగా. ఒక మంచి రాజ్యం అనవసరంగా వ్యక్తి జీవితంలో జోక్యం చేసుకోకూడదు. అదే సమయంలో ఛాందసం కొనసాగుతుంటే, ఆ మతం లేదా సంప్రదాయంలో నమ్మకం ఉన్న ప్రజలు దాన్ని కొనసాగనివ్వకూడదు. రాజ్యాంగ విలువల్ని చేరుకోవటానికి సమాజాన్ని ప్రేరేపించాలి. ఈ రాజ్యాంగ విలువలకి, సామాజిక రీతికి మధ్య సంఘర్షణే రాజకీయం.

మన సమాజం చాలా బలమైనది. ఏ కులమైనా, ఏ మతమైనా, ఈ ప్రాంతమైనా, ఏ భాషయినా మన దేశంలో కుటుంబాలు బలమైనవి. బహుశా భారత్‌లో ఉన్నంత బలంగా కుటుంబాలు ఇంకెక్కడా లేవు. అంత బలమైన కుటుంబాలున్నాయి కాబట్టే ఇంత పేదరికం ఉన్నా, ప్రభుత్వాలు ఇన్ని రంగాల్లో ఇంత విఫలమవుతున్నా సమాజంలో పెద్దగా హింస, అశాంతి, నేరప్రవృత్తి లేవు. ఇన్ని సమస్యలున్న సమాజంలో అల్లకల్లోలం, బయటికెళ్తే భయం ఉంటాయి. కానీ సమాజంలో ఉన్న బలం వల్ల మతాలకు అతీతమైన ధర్మనిరతి, మంచిచెడు విచక్షణ సహజంగా ఈ దేశ ప్రజల్లో అత్యధికులకు ఉంది. అది ఈ సంప్రదాయంలో భాగంగా వచ్చింది. ఎవరైనా తప్పు చేయాలనుకున్నా.. తప్పు అనే స్పృహ, మనం తప్పు చేస్తే సమాజం మనల్ని వేరు చేస్తుందేమో, తక్కువగా చూస్తుందేమో, చులకనవుతావేమోనన్న భావన చాలామందిని మంచిమార్గాన పెడుతుంది. ఒక రాజ్యానికి, రాజ్యాంగానికి సవాలు, ఈ మంచిని కాపాడుకుంటూ దాన్లో ఉన్న మూర్ఖత్వాన్ని తొలగించటం. ఉదాహరణకు, హిందూ సంప్రదాయం! హిందూ అనేది ఒక మతంగా లేదు. ఒక భౌగోళికమైన ప్రాంతం తప్ప హిందూ మతం అనటానికి లేదు. రకరకాల భావజాలాల్ని, చార్వాకులు, కణాదులు ఇలా రకరకాల వాళ్లను కలిపాం. అంచేత మతంగా భావించటానికి వీల్లేదు. అయినా హిందూ సంప్రదాయంలో చాలా దుర్లక్షణాలున్నాయి. నాలుగు తరాల కిందట సతీసహగమనం ఉండేది. అప్పట్లో అది గొప్ప అనుకునేవాళ్లు. రాజారామ్మోహనరాయ్ చొరవతో గట్టిగా పట్టుబట్టి తెల్లవాళ్ల రాజ్యాధికారాన్ని ఉపయోగించి ఆ దురాచారాన్ని ఆపగలిగారు. అప్పట్లో ఆ సంస్కరణను తీవ్రంగా వ్యతిరేకించారు. అలాగే బాల్యవివాహాలను తిరస్కరించే ప్రయత్నం చేసినందుకు ఈశ్వరచంద్ర విద్యాసాగర్, వీరేశలింగం పంతులు తదితరులను వ్యతిరేకించినవాళ్లున్నారు. వాళ్ల మీద దాడులు చేశారు. వెలివేశారు. వీరేశలింగాన్ని కొట్టబోయారు. వితంతు వివాహం జరిపితే వ్యతిరేకించారు. నన్ను పెంచిన తల్లి బాల్యవితంతువే. కాబట్టి హైందవం కావచ్చు, మరో మతం కావచ్చు, సంప్రదాయంలో ఉన్న బలాన్ని, సమాజానికి పనికివచ్చే అంశాల్ని కాపాడుతూ.. దాన్లో ఉన్న చెడును, ఆ



పాత వాసనని, ఆధునిక యుగానికి సరిపోనటువంటిది, మానవ హక్కుల ఉల్లంఘన వంటివి నిర్జించకపోతే రాజ్యాంగానికి, రాజ్యాంగల విలువలకి అర్థం లేదు. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి పౌరస్మృతిని ఆదేశిక సూత్రాల్లో భాగంగా పెట్టారు రాజ్యాంగ నిర్మాతలు.

ఒక ఆధునిక సమాజ నిర్మాణం కావాలంటే సంప్రదాయంలో ఉన్న కొన్ని ఛాందసాలు, మానవ సమాజానికి హాని చేసేవి తొలగించాలి. అది రాజ్యాంగబద్ధ ప్రభుత్వాల బాధ్యత. అదే సమయంలో మన రాజ్యాంగం ఏనాడూ కూడా మంచిని తొలగించే ప్రయత్నం చేయలేదు. అందుకే మీ కులమేదైనా, మతమేదైనా.. మీరు నమ్మే దేవుడిని, నమ్మిన భావాల్ని ప్రచారం చేసుకునే, పూజించే హక్కు ఉంది. నా దృష్టిలో మహిళలకి అన్ని మతాల్లో అన్యాయం జరిగింది. కొన్ని మతాల్లో ఇప్పటికీ జరుగుతోంది. బహుభార్యాత్వం ఆధునిక యుగంలో మనం సహించేది కాదు. కచ్చితంగా అది పోవాలి. అది ఏ మతం పేరుతో, ఏ కులం పేరుతో ఉన్నా. అలాగే భ్రూణ హత్యల్ని ఆపాలి. జనిటల్ మ్యుటిలేషన్ ఆపాలి. వివాహం విషయంలో, ఆస్తి విషయంలో మగవాళ్లకి ఒక హక్కు, ఆడవాళ్లకి ఒక హక్కు పద్ధతి పోవాలి. హిందూ సమాజంలో మగవాళ్లకి ఉన్న ఆస్తి హక్కు ఆడవాళ్లకి ఉండదు. అది తప్పు కచ్చితంగా. ఒకప్పుడు చెల్లింది. ఇప్పుడు అంగీకరించలేం. కాబట్టి మహిళల హక్కులు, వైవాహిక సంబంధాల్లో సమానత్వం, కొన్ని వ్యక్తిహింసకు దారితీసే పౌర హక్కుల ఉల్లంఘన, ఛాందస భావాల్ని పక్కనపెట్టటం.. ఇవన్నీ ఆధునిక రాజ్యం చేయాల్సిన పనులు. ఏ కులంలో, మతంలో అయినా. హిందూ మతంలో ఉంటే, హిందూ మతంలోని పొరపాట్లు తొలగించాలి. క్రైస్తవంలో ఉంటే క్రైస్తవంలో



తొలగించాలి, ఇస్లాంలో ఉంటే ఇస్లాంలో తొలగించాలి. బౌద్ధం, జైనులు, సిక్కుల్లో ఉన్నా కూడా. అంతకుమించి దీన్ని మతాల సమస్యగా చూడటం ఆధునిక రాజ్యంలో సరైన పద్ధతి కాదు. మన దేశంలో ప్రతిదాన్ని కూడా నా కులానికి ఏదో జరిగిపోతోంది కాబట్టి కులాన్ని సమీకరించి రాజకీయం, నా మతానికి అన్యాయం జరిగిపోతోంది కాబట్టి మతాన్ని సమీకరించి రాజకీయం. నా ప్రాంతానికి, నా భాషకి. ఇదొక అలవాటైపోయింది.

ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫామ్ సివిల్ కోడ్) అంశానికి వచ్చినట్లయితే, ఇస్లాంకి వ్యతిరేకంగానో, హైందవానికి వ్యతిరేకంగానో, క్రైస్తవానికి వ్యతిరేకంగానో కాకుండా.. ఏం ప్రతిపాదిస్తున్నారు? ఎందుకు ప్రతిపాదిస్తున్నారు? ఈ మార్పు ఆధునిక సమాజంలో అవసరమా, కాదా? ఆ రకంగా ఆలోచిస్తే అప్పుడు పరిష్కారాలొస్తాయి. ఇలాంటి ఆలోచన లేక ఈ దేశానికి చాలా నష్టం జరిగింది. ఎనభైల దశకంలో రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉండగా ఒక చిన్న తీర్పు సుప్రీంకోర్టు ఇచ్చింది. షాబానొ కేసులో ఓ ముస్లిం మహిళ, ఒక బీద మహిళ విడాకులకు గురైతే, ఒక మహిళను గనక భర్త వదిలేసినట్లయితే మనోవర్తి నెలకు సుమారు 150-250 ఏర్పాటు చేశారు. లక్షలు, వేలు కాదు. దిగువ కోర్టులో ఇచ్చిన ఈ తీర్పును ఎంతో ఖర్చు పెట్టి మరీ అత్యున్నత న్యాయస్థానం వరకు సవాలు చేశారు. సుప్రీంకోర్టు ఇది వర్తిస్తుంది అని తీర్పు ఇచ్చింది. దానికి మొత్తమంతా గందరగోళపరచి, పెద్ద రాద్ధాంతం చేసి, రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావు మెడలు వంచి ముస్లిం విమెన్స్ బిల్లు తెచ్చారు. ఈ బిల్లు తప్పు అని ఆనాటి కాంగ్రెస్ నాయకులు చాలామంది వ్యతిరేకించారు. ఈవేళ్టి కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఆనాడు హోంమంత్రిగా ఉండేవారు. ఆయన బిల్లుకి వ్యతిరేకంగా రాజీనామా చేశారు. అలాగే మన రాష్ట్రానికి చెందిన ఉన్నతాధికారి అబిద్ హుస్సేన్. అలాంటివాళ్లు వ్యతిరేకించారు. దేశం చాలా నష్టపోయింది ఆ చట్టం వల్ల. కాబట్టి మనం ఈ అంశాలను మతపరంగా కాకుండా, హేతుబద్ధంగా, మహిళల హక్కులు, ఆధునిక సమాజంలో భాగస్వామ్యం.. ఆ రకంగా ఆలోచిస్తే బహుశా దేశానికి ప్రయోజనం చేకూరుతుంది.

**మైనారిటీల నుంచి తప్ప మెజారిటీ నుండి పెద్ద వ్యతిరేకత లేకపోవటానికి కారణం**

మైనారిటీల వైపు నుంచి తప్ప మెజారిటీ ప్రజానీకం వైపు నుంచి ఉమ్మడి పౌర స్మృతికి పెద్ద వ్యతిరేకత లేకపోవటానికి కారణం ఏమిటంటే, ఇప్పటికే హిందూ కోడ్ చట్టం రావటం.

1950వ దశకంలో, అంబేద్కర్ న్యాయశాఖా మంత్రిగా రాజీనామా చేశారు. ఆనాడు ఛాందస హైందవులు హిందూ కోడ్ బిల్లును తిరస్కరించటం అందుకు కారణం. ఈ మతం, ఆ మతం అని కాదు, నెహ్రూ గారు దాన్ని చట్టంగా చేయటం లేదని అంబేద్కర్ రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆ చట్టం వచ్చింది. అంబేద్కర్ వెళ్లిపోయాక చట్టం వచ్చింది. కాబట్టి హైందవ సమాజం వరకు.. ఈ యూనిఫాం సివిల్ కోడ్.. యూనిఫామా, కాదా తర్వాత చూద్దాం, ఆ లేబుల్ కూడా పెద్ద ముఖ్యం కాదు.. కోడ్ లక్ష్యమైన ఆధునికీకరణ చట్టపరంగా చాలావరకు జరిగింది. ఇంకేమన్నా కొత్తదుంటే అమలు జరిపించాలి. ఉదాహరణకి, వారసత్వంలో తేడా ఉంటే కచ్చితంగా చేయాలి. వివాహం విషయంలో తేడా లేదు హైందవంలో. ఆస్తి హక్కుల విషయంలో తేడా ఉంది కొన్ని రాష్ట్రాల్లో, మన రాష్ట్రంలో, తెలుగునాట ఎన్.టి రామారావు ముఖ్యమంత్రిగా మహిళలకు ఆస్తిహక్కును ప్రవేశపెట్టారు. కాగితం మీద ఉందిగానీ, ఎంతవరకు ఆచరిస్తున్నారో నాకు తెలియదు. చెప్పలేను. సర్వే ఆధారాలు లేవు. కొన్ని రాష్ట్రాల్లో, కేరళ వంటి చోట్ల మాతృస్వామ్య సమాజం ఉంది కాబట్టి అమలు కొంచెం ఎక్కువ ఉండొచ్చు. కానీ చట్టపరంగా అందరికీ ఆస్తిహక్కు ఉండాలి. బహుశా హైందవ సమాజంలో ఉమ్మడి పౌరస్మృతి వల్ల కొత్తగా వచ్చే మార్పులు నాకు తెలిసినంతవరకు పెద్దవి లేవు. అందుకని పెద్దగా వ్యతిరేకత రావటంలా. కానీ ఆయా మార్పులకు ఒకప్పుడు హైందవ సమాజంలో కూడా వ్యతిరేకత వచ్చింది.

**ఒకే పౌర స్మృతి వల్ల సమాజంలో సామరస్యం, ప్రయోజనం వస్తుందని అంబేద్కర్, పలువురు సుప్రసిద్ధ న్యాయమూర్తులు చెప్పినా కొన్ని పార్టీలు వ్యతిరేకించటానికి కారణం**

మన రాజకీయంలో వ్యక్తి ఔన్నత్యము, సమాజ భవిష్యత్తు, కుటుంబ భవిష్యత్తు, ప్రభుత్వం, రాజకీయ విధానాలు, వ్యక్తి జీవితానికి మధ్య సంబంధాన్ని అన్వేషించే ప్రయత్నాన్ని మనం పక్కన పెట్టేశాం.

**జనాభా పెరుగుదల విషయంలో అపోహల్ని వీడాలి**

అగ్రకులాలు అనబడేవాళ్లు, దళిత వర్గాలు, గ్రామీణులు, పేదలు, డబ్బున్నవాళ్లు, చదువులేనివాళ్లు, చదువుకున్నవాళ్లు అన్ని వర్గాల్లో కూడా జననాల రేటు తగ్గుతున్నది. ఇది మనం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. జననాల రేటులో తేడాలున్నాయి. ఇవాళ బీహార్‌లో ఎక్కువ జననాలున్నాయి. మనకి తక్కువున్నాయి. అలాగే యూపీలో ఎక్కువున్నాయి, మనకి తక్కువున్నాయి. కానీ అన్ని రాష్ట్రాల్లో కూడా క్రమక్రమంగా జననాల రేటు తగ్గుతున్నది. హిందువుల్లో, అందులోనూ దళితుల్లో తగ్గుతోంది. ముస్లింలలో తగ్గుతోంది. పట్టణాల్లో, గ్రామీణుల్లో, ఉత్తరాదిన, దక్షిణాదిన తగ్గుతోంది. కొన్ని చారిత్రక కారణాల వల్ల 5-10 ఏళ్లు వెనకున్నాయి. ఫెర్టిలిటీ రేటు, అంటే, ఒక మహిళ సంతానోత్పత్తి కాలంలో ఎంతమంది పిల్లల్ని సగటున కంటోంది అని. అది 2.1 కంటే తక్కువ వస్తే జనాభా అదుపులో ఉంటుంది. 2.1 కంటే ఎక్కువ ఉంటే జనాభా పెరుగుతుంటుంది. జనాభా నియంత్రణ కేరళ మొట్టమొదట సాధించింది. తమిళనాడు సాధించింది. ఇవాళ ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణలో, పేద రాష్ట్రం ఒడిషా, మహారాష్ట్రల్లో జనాభా తగ్గింది. దేశంలో రెండు, మూడు రాష్ట్రాలు మినహాయించి అన్ని రాష్ట్రాలూ సాధించాయి. దేశం మొత్తంలో కూడా ఫెర్టిలిటీ రేటు 2కి వచ్చింది. వచ్చే సంవత్సరం 1.9 అవుతుంది. కాబట్టి జనాభా

విషయంలో మనకున్న అపోహల్ని తొలగించుకోవాలి. చాలామందికి ఈ అపోహలు ఉన్నాయి. ఆధునికయుగంలో ఏ కుటుంబానికైనా మంచి జీవితం కావాలి అంటే, పిల్లలు మరీ ఎక్కువ ఉంటే మనకి జీవితం బాగుండదు. ఆ పిల్లల భవిష్యత్తు బాగుండాలి అంటే మనకున్న ఆదాయానికి తగ్గట్లు పిల్లలు తగ్గితే బాగుంటుంది. అదే సమయంలో, ఉమ్మడి పౌర స్మృతి కోరేవారు కూడా దాన్ని మతాల సమస్యగా కాకుండా, ఆధునికీకరించటం కోసమని గుర్తించాలి. దీన్లో ఎవరికీ ఇబ్బంది కలిగించాలని కాదు. మీరు అల్లాని నమ్మినప్పుడు, భారతదేశంలో ఆ స్వేచ్ఛ ఉన్నది, ఆ స్వేచ్ఛ కొనసాగుతుంది. అది వేరు, ఒక సమాజంగా మన సమాజ నిర్మాణం వేరు.

**యూసీసీ వస్తే ముస్లింల జీవితంలో ప్రభుత్వ జోక్యం పెరుగుతుందనే వాదన**

ఆ వాదన పూర్తిగా అసంబద్ధమైనది. ఒక ప్రభుత్వాన్ని మానవ సమాజం ఎందుకు ఏర్పాటు చేసుకుంది? ఉమ్మడి ప్రయోజనాల్ని కాపాడటం కోసం. వ్యక్తులుగా నేను, నా కుటుంబం, నా సంగతి నేను చూసుకుంటా. బలం ఉన్నవాళ్లు బలహీనులను చితక్కొట్టకూడదు. ఇంతవరకు రాజ్యానికి పాత్ర ఉన్నది. అంతేగానీ మీ జీవితంలోకి, మీ పడకటింట్లోకి తొంగిచూసి మీరేం చేయాలో చెప్పటం రాజ్యానికి అవసరం లేదు. అంచేత ఏ మతమైనా సరే, రాజ్యం వచ్చి మీరు జీవితంలో వ్యక్తిగతంగా ఎవరిని ప్రేమిస్తున్నారు, ఎవరిని పెళ్లి చేసుకుంటున్నారు, మీ సంతానం ఎక్కడ బతుకుతారు, ఏం చదువుతారు దీన్లో జోక్యం చేసుకుంటే వ్యక్తిగత జీవితంలో జోక్యం చేసుకున్నట్లు లెక్క. అలాంటివి ప్రశ్నించాలి. అలాకాకుండా ఆడపిల్లలకు ఒకటి, మగపిల్లలకు ఒకటి పద్ధతిలో హక్కులు ఉండటానికి వీల్లేదు. వైవాహిక సంబంధాలు ఇద్దరికీ సమానంగా ఉండాలి. మౌలికమైన, ఆధునిక సమాజం ఇచ్చిన మానవ హక్కుల్ని కాపాడాలి అంటే, అక్కడ నా మతం, నా సంప్రదాయం దెబ్బతింటుందనటం చాలా విడ్డూరమైన వాదన. దీన్ని తిరస్కరించాలి. ఎవరు చేసినా సరే.

**ప్రపంచ దేశాల్లో కూడా షరియా వల్ల నష్టం కలుగుతుందనే వాదన ఉంది గదా..**

మొట్టమొదటి అంశం, భారతదేశంలో షరియా లేదు, ఉండరాదు. సివిల్ సంబంధాల వరకు, మిగతా ప్రపంచంతో సంబంధం లేకుండా వ్యక్తిగత కాంట్రాక్టుల వరకు వాళ్లిష్టం. వ్యక్తిగతమైన సంప్రదాయాన్ని పాటించవచ్చు. కానీ క్రిమినల్ చట్టం విషయంలో షరియా లేదు, మరొకటి లేదు. షరియా పేరుతో చేతులు నరుకుతారు, తల తీసేస్తారు, రాళ్లతో కొట్టి చంపేస్తారు. ఆయా దేశాల్లో కూడా షరియా లేదు. ఉన్నచోటయినా సరే, మనం దాన్ని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించలేం.

**మళ్లీ వెయ్యేళ్ల క్రితం సమాజమంటే ఎవరూ ఒప్పుకోకూడదు**

ఒక ఆధునిక సమాజంలో చట్టబద్ధపాలనకి కొన్ని పద్ధతులున్నాయి. దాన్ని మనం ఒప్పుకున్నాం. వెనక్కెళ్లి మళ్లీ వెయ్యేళ్ల క్రితం సమాజాన్ని సృష్టించాలనుకుంటే దాన్ని ఎవరూ పొరపాటున కూడా ఒప్పుకోకూడదు. అలాంటి ఆలోచన ఉంటే దాన్ని తిరస్కరించాలి. ఒక సివిల్ సంబంధాల్లో.. ఉదాహరణకు ఇస్లామిక్ సమాజంలో నాకర్థమైనంత వరకు ఒక నిఖా, ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదు. అదొక కాంట్రాక్టు. ఏ ప్రభుత్వం దాన్ని ఆపకూడదు. మీ వివాహం కాంట్రాక్టులా జరుగుతుంటే, మనం దానికి అభ్యంతరం పెట్టకూడదు. కానీ ఆ వివాహ సంబంధాలలో మగవాడు మహిళను ఎప్పుడైనా వదిలిపెట్టే అవకాశం ఉంటే, కారణం కూడా చూపెట్టకుండా, మహిళలకు సమాన హక్కులు లేకుండా.. దాన్ని మనం కచ్చితంగా ఆపాలి. ఇవి రెండూ వేర్వేరు విషయాలు. నిఖాలో జోక్యం చేసుకుంటే మనం సంప్రదాయంలో జోక్యం చేసుకున్నట్లు అనవసరంగా. కానీ విడాకులు తేలిగ్గా ఇచ్చేసి ఆడపిల్లకు అన్యాయం జరుగుతుంటే రాజ్యం జోక్యం చేసుకుంటే, రాజ్యం చేయాల్సిన పని చేస్తున్నట్లు.

**విమర్శను సహించలేకపోవటం ఈమధ్య కాలంలో వచ్చింది**

కొన్ని మత సంప్రదాయాల్లో మీరు ఒక్క మాట గనక మాట్లాడితే పూర్తిగా మతానికి వ్యతిరేకం, బ్లాస్ఫిమీ అనే గందరగోళం ప్రవేశపెట్టారు. ఇది పూర్వం లేదు. ఒకప్పుడు ఇస్లామిక్ దేశాలు ప్రపంచంలో ఆధునికీకరణకి ప్రతీక. వెయ్యేళ్ల క్రితం, 7-800 ఏళ్ల క్రితం ప్రపంచంలోని జ్ఞానమంతా భారతదేశం లాంటి దేశాల నుంచి యూరప్‌కి వెళ్లేది. యూరప్ నుంచి మనకు వచ్చేది. ఇస్లాం దేశాలు మధ్యలో సంధిగా ఉండేవి. కేవలం గత వందేళ్లుగానే కొందరు కుహనా మతవాదులు విపరీత ధోరణులు ప్రవేశపెట్టారు. ఉదాహరణకి వహాబిజం సౌదీ అరేబియాలో వచ్చింది. ఇప్పటి రాజకుటుంబం అప్పటి ట్రైబల్ జీవులు. రాజ్యాధికారానికి వత్తాసు కోసం వహాబ్, అనుయాయులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. వహాబ్‌ని ఆయన కుటుంబంలో తండ్రి, సోదరుడు పిచ్చోడిగా భావించారు. అలాంటి వహాబ్‌ని పెద్దోడ్ని చేసి సౌదీ అరేబియాలో వహాబిజం తీసుకొచ్చారు. ఎప్పుడైతే అక్కడ చమురు సంపద దబ్బుందో, ఆయిల్ ప్రపంచానికి అవసరమైందో, రాజ్యాధికారం వాళ్ల చేతుల్లో ఉండి, నియంతృత్వం రాజ్యాధికారమైందో వహాబిజాన్ని ఆ డబ్బుతో విచ్చలవిడిగా పెంచి, అలాంటి తీవ్రవాదాన్ని తీసుకొచ్చారు. సౌదీ అరేబియాలో వహాబిజం పాటించేవారు ఇప్పుడు నూటికి 25 మందే. 75 మంది పాటించరు. నిజమైన ఇస్లాంలో గత వెయ్యేళ్లలో అలా లేదు. సూఫీయిజం వచ్చింది భారతదేశంలో. కబీర్ దగ్గర్నుంచి మరెందరో ఉదాహరణలున్నాయి. ఇస్లాంలోని, హైందవంలోని మంచి సంప్రదాయాల్ని కలిపి తీసుకొచ్చింది మన సిక్కిజం. కాబట్టి తీవ్రవాదం మూలాలు వేరు, గత వందేళ్లుగా వచ్చింది. ఆ వహాబ్ నుంచి వచ్చింది. మరొకడు సయ్యద్ కుతుబ్ అనుకుంటా. 1903 ఆ ప్రాంతాల్లో. అతడు అమెరికాలో చదువుకుంటూ, ఒకరోజు మనసులో ఇదంతా బాగాలేదు, ఆడమగ కలిసి డ్యాన్స్ చేస్తున్నారు అనుకున్నాడు. క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా, క్రైస్తవ సంప్రదాయంలో వాళ్లు డ్యాన్స్ చేస్తారు. అది చూడగానే ఒక్కసారి ఏదో మనసులో గందరగోళం చెలరేగి అప్పట్నుంచి ఈవేళ్టి ఇస్లామిక్ ఉగ్రవాదానికి మూలాన్ని సైద్ధాంతికంగా తయారుచేశాడు. కాబట్టి మనం అర్థం చేసుకోవాల్సింది, భారతీయ సమాజంలో ఉన్న గొప్ప విషయం.. ఏ మతమైనా, ఏ సంప్రదాయమైనా, ఏ ఆలోచనాతీరయినా వాళ్లు సహజీవనం చేయటం సహజంగా వచ్చింది. బౌద్ధం హైందవ సంప్రదాయంలో ఉన్న చెడును తిరస్కరిస్తూ తిరుగుబాటు చేస్తే బుద్ధుడ్ని మనం అవతారాల్లో ఒకటిగా చేశాం. ఇది మనకున్న గొప్పతనం. అలాగే మహావీర్ జైన్. జైన మతస్తులు మన సంప్రదాయంలో భాగం కాదనే భావం మనలో ఎవరికీ

లేదు. అక్కున చేర్చుకున్నాం. అలాగే ఇస్లాం మొట్టమొదట కేరళకి వచ్చింది. మహమ్మద్ ప్రవక్త క్రీ.శ 620లో మక్కా నుంచి మదీనాకు ప్రయాణం చేశారు. అదయిన 10–15 ఏళ్లలో ఇస్లాం మన దేశంలోకి వచ్చింది. క్రీ.శ 640 ప్రాంతం కల్లా వచ్చింది. ఎవరూ దాన్ని వ్యతిరేకించలా. వాళ్లు సహజీవనం చేశారు. క్రైస్తవం సెయింట్ థామస్ ద్వారా జీసస్ క్రీస్తు శిలువనెక్కిన ఇరవై, ముప్పై ఏళ్లలో వచ్చేసింది ఈ దేశంలోకి. ఎవరూ తిరస్కరించలా. అప్పట్నుంచి ఇప్పటి దాకా శాంతియుత సహజీవనం చేశారు. జూడాయిజం 2,600 ఏళ్ల క్రితం వచ్చింది. అప్పట్నుంచి ఇప్పటిదాకా ఏ రకమైన హింస లేకుండా కొనసాగుతోంది. కాబట్టి ఈ గడ్డ మీద ఎన్నో పొరపాట్లున్నాయి మానవ సమాజంగా. కానీ మౌలికంగా ఎలాంటి భావజాలాన్నయినా, సిద్ధాంతాన్నయినా అంగీకరించి కలుపుకునే తత్వం ఉంది. అది కొనసాగుతుంది. అది గుర్తించాలి గానీ, మనం ఆధునికీకరణ ఏం చేసినా కూడా అది మతానికి వ్యతిరేకంగా చూడటం తగదు. మతానికి వ్యతిరేకం కాదు.

**సమాజం మనం అనుకున్నదాని కంటే ఆధునికీకరణకు సిద్ధంగా ఉంది**

ఉమ్మడి సివిల్ కోడ్‌కి ఏమిటి అవరోధాలు అంటే.. నేననుకోవటం పెద్దగా లేవు. సమాజం మనం అనుకున్నదాని కంటే సిద్ధంగా ఉంది. కానీ మనం వాడే భాష, దాన్ని మనం రాజకీయ కోణం నుంచి కాకుండా, మానవీయ కోణంలో చూసే తీరుని బట్టి స్పందన ఉంటుంది. మనం నిర్దిష్టంగా మహిళల హక్కులుగానీ, మానవ హక్కులు గానీ, కొన్ని సంప్రదాయాల వల్ల జరుగుతున్న హింసను ఆపటం గానీ.. అంతవరకు తీసుకొస్తున్నామని ప్రజల ముందు స్పష్టంగా చెప్పినట్లయితే నూటికి 90 మంది ఆమోదిస్తారు.

మన సమాజం ఎప్పుడూ మహిళల్ని నిర్దయగా చూసింది. అన్ని సంప్రదాయాల్లో. హైందవం, క్రైస్తవం, ఇస్లాం తెగలు కావచ్చు– నూటికి 95 సందర్భాల్లో ప్రాచీన కాలం నుంచి మహిళ భారాన్ని మోసింది. ఇది వాస్తవం. మతమన్నది ఆధ్యాత్మిక భావన పెంచింది, మనుషులకు ఆలంబనగా ఉన్నది, మనుషుల ప్రవర్తనను ఒక మంచి మార్గాన పెట్టే ప్రయత్నం చేసింది. కానీ కచ్చితంగా లింగవివక్ష, మత సంప్రదాయాలు రెండూ కలిసిపోయాయి ప్రపంచమంతా చాలామేర.

**యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు ఎలా సాధ్యం?**

ప్రేమతో చేదుమందయినా తినిపించవచ్చు. కఠినంగా ఉంటే తీపిమందయినా తిరస్కరిస్తారు. కాబట్టి ప్రభుత్వాలు, పార్టీలు కొంచెం తాము వాడే భాష, మంచి చేస్తున్నప్పుడు కూడా ఆ భాషని, పదజాలాన్ని, మనం మృదువుగా చెప్తే అంగీకారం ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ చట్టాలు చూడండి. నూటికి నూరుపాళ్లు సమర్థించాను. మంచి చట్టాలు. వ్యవసాయానికి పనికొచ్చేవి. అదే గనక కొంచెం మృదువుగా చేసినట్లయితే సమస్యలు వచ్చేవి కావు. నేనెవర్నీ తప్పుపట్టటం లేదు. గతం నుంచి పాఠాలు నేర్చుకోవాలి. దేశం చాలా నష్టపోయింది ఆ చట్టాలు రద్దవటం వల్ల. అవి ఎందుకవసరం, రైతుకి స్వేచ్ఛ లేకపోవటం వల్ల రేటు ఎట్లా పడిపోతుందీ, ఎల్లకాలం పేదరికంలో ఎట్లా ఉంచుతాం, ఎన్ని సందర్భాల్లో ఎట్లా జరిగిందది, ఇది అర్థమయ్యేరీతిలో గనక ఒక చర్చను ప్రవేశపెట్టి పార్లమెంటరీ కమిటీలో పెట్టి కొంచెం ఓపిగ్గా చేసినట్లయితే, బహుశా చాలా తేలిగ్గా చట్టాలు అమల్లోకి వచ్చేవి. ఎప్పుడైతే అది జరగలేదో పక్షపాత రాజకీయాలు ప్రవేశించి ప్రజాజీవితాలతో ఆడుకుంది. ఏదో అన్యాయం జరుగుతుందని గగ్గోలు పెట్టారు. ప్రపంచంలో అన్ని దేశాల్లో ఇలాంటి చట్టాలే, రైతులకు స్వేచ్ఛనిచ్చేవి ఉన్నాయి. అమ్ముకునే స్వేచ్ఛ ఉంది. సంకెళ్లు లేవు. అదే చట్టం మనం చేస్తే ఆ దేశాల్లో టీవీల్లో కూడా భారతదేశంలో రైతులకు అన్యాయం జరుగుతోందని గగ్గోలు పెట్టించారు. చివరికి ఏ రైతుల ప్రయోజనాల కోసం మనం చేశామో, ఏ రైతులకు సంకెళ్లు తీసేయాలనుకున్నామో ఆ రైతులు మాకు సంకెళు ్లు కావాలని కోరుకున్నారు. ప్రపంచ చరిత్రలో బానిసత్వం ఉన్నవారు బానిసత్వం కొనసాగాలని కోరుకున్న సంఘటన బహుశా ఇదొక్కటే అయ్యుంటుంది. దాన్లో మన అజ్ఞానం, తొందరపాటు ఉన్నాయి. పక్కనపెట్టండి. కానీ ప్రభుత్వంలో మనం నేర్చుకోవాల్సిన పాఠమేంటంటే, ప్రజల మంచి అయినా కూడా మనం ఒక చర్చ పెట్టి మృదువుగా గనక వాళ్లను కూర్చోబెట్టి చేసినట్లయితే సులువుగా ఉండేది. ఇది చెయ్యాల్సిందే అని గట్టిగా అంటే మంచి కూడా చెడు ఫలితాలనిస్తుంది.

**ఏ అంశాలు కావాలో ప్రజల్లో చర్చ పెడదాం**

యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు 75 ఏళ్లు ఆలస్యమైందని చెబుతున్నారు, ఒక 7 నెలలు ఆలస్యమైతే కొంప మునిగేదేమీ లేదు గదా. ఏ అంశాలు కావాలో చర్చ పెడదాం. ఎందుకు అవసరమో గణాంకాలు, వివరాలు తెలియచేద్దాం. ఆ చర్చలో మనం చెబుతున్న మాట వాస్తవమయినట్లయితే, దాన్లో నిజాయతీ ఉన్నట్లయితే, పూర్తిగా నమ్ముతున్నాను– మన సమాజంలో నూటికి 90 మంది అంగీకరిస్తారు. నేను నిష్కల్మషంగా మాట్లాడాను. నూటికి 90 మంది హిందువులైనా, ముస్లింలైనా, క్రైస్తవులైనా ఈ వాదన అంగీకరిస్తారని నమ్ముతున్నాను. మన మనసులో కల్మషం లేదు, నిజాయితీగా మాట్లాడే ప్రయత్నం చేస్తున్నాం, కర్కశత్వం లేదు. మృదువుగా మాట్లాడి ప్రజాప్రయోజనాలు చూపే ప్రయత్నం చేస్తున్నాం. ఆ సరళి ఎప్పుడూ కూడా ప్రజాస్వామ్య సమాజంలో మార్పుకి నాంది పలుకుతుంది. అలాకాకుండా సంఖ్యాబలం ఉందన్న మాత్రం చేత చేస్తే జరగదు. అందులో మన లాంటి దేశంలో ఎవరి మాట ఎవరూ వినరు. వ్యవసాయ చట్టాలు చాలా మంచివి. ఈ దేశంలో నా అంత సమర్థించినవాళ్లు ఎవరూ లేరు. నిర్మొహమాటంగా సమర్థించాను. బహుశా నా ఒక్క మాట వల్ల తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో రైతులంతా నింపాదిగా ఉన్నారు. ఎక్కడా ఉద్యమాలు లేవు, పార్టీలు ఎర వేసినా కూడా. ఎందుకంటే ఒక నిఖార్సయిన నిజాయితీతో చెప్పినప్పుడు, ఎంతో కొంత విశ్వసనీయత ఉన్నప్పుడు ఈ రంగంలో, మనం చెప్పేది వాస్తవం అయినప్పుడు ప్రజలు దాన్ని విశ్వసిస్తారు. దేశమంతా చెప్పే శక్తి మనకు లేదు. ఇన్ని భాషలు ఉన్న దేశంలో. దేశం చాలా వేగంగా మారిపోవాలని చాలా ఆశపడుతున్నవాళ్లలో నేనొకడ్ని. కానీ కొన్ని సందర్భాల్లో కొంచెం నెమ్మదితనం అవసరం. యూనిఫాం సివిల్ కోడ్‌పై కూడా ప్రజల ముందు వాస్తవాలుంచితే అత్యధికులు అంగీకరిస్తారు.

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## Cooperation based on trust - the Jugaad Voters' Government
## Aazadika Amritkal - Right Time for PARADIGM-SHIFT

**Our individual Voters constitute Low - Middle - High income classes with competing aspirations for growth in the society. Their secular behaviour (i.e rationalism అనగా, ఓటర్ యొక్క హేతువాదంతో సమకూడిన సామాజిక న్యాయానికి సంబంధించిన ఆధ్యాత్మిక నడవడి), financial inequalities (ఆర్థిక అసమానతలు), punctuality (ప్రభుత్వపనులలోనూ న్యాయస్థానాల తీర్పులలోనూ కాలనిబద్ధత), must necessarily be addressed transparently by their elected "leaders", MLAs and MP's of the respective Political Parties both internally in their Parties, and externally to the Opposition Parties. Then Voters will consider any Political Party as Trustworthy.**

**"Cooperation based on trust" means :**

1. **representing Government's own position, recognising the opposite Party's position, and work together with tolerance and patience to find cost-effective, timely solutions to various problems, for collectively delivering good governance to the Voters-Community.**
2. **All Political Parties accepting accountability, legally and financially to the Voters, avoiding any scope for suspicion, and to work honestly and peacefully even if ideologies differ from Party to Party or among their Leader's Opinions.**

మన ప్రజాస్వామ్యంలో ఓటర్లు 3 తరగతుల (స్వల్ప -మధ్య- అధిక) ఆర్థిక సంపాదనాపరులై ఉన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశంలో ఈఓటర్ల ఆశలూ, ఆశయాలూ పెరగడం సహజమే. రాజకీయ నాయకులు ఎప్పుడైతే తమపై ఓటర్లకు విశ్వసనీయత పెరగాలని కోరుకుంటారో, అప్పుడు ఆయా పార్టీలను సమర్థించే ఓటర్లు కోరుకునే లౌకికవాదం, ఆర్థిక క్రమశిక్షణ, సమయపాలన, మొదలైన విషయాలలో, తమ తమ పార్టీలలోనూ బయటాకూడా పారదర్శకతతో ప్రాతినిధ్యం వహించాలి.

"నమ్మకం పై ఆధారపడిన పరస్పర సహకారం" అంటే

1. అధికారపక్ష ప్రభుత్వం సమస్య ఏదైనా దానికి సంబంధించిన పరిస్థితిని వివరించి, ప్రతిపక్షాల అవసరాలను కూడా గుర్తించి సహనంతో సకాలంలో చౌకగా చట్టబద్ధంగా ఇరుపక్షాలూ కలిసి సంయమనంతో పరిష్కారాన్ని కనుగొనగలిగే సత్పరిపాలనా సామర్థ్యం.
2. రాజకీయ పార్టీల భావజాలాల మధ్య విభేదాలున్నా, ఓటర్లకు న్యాయ పరంగానూ ఆర్థికపరంగానూ సమస్యల పరిష్కారానికి జవాబుదారీతనాన్ని బాధ్యతగా స్వీకరించి, కలసి పనిచేస్తూ, అనుమాన రహితంగా నిజాయితీ, శాంతిభద్రతలతో కూడినచట్టబద్ధ పరిపాలనయే ధ్యేయంగా ఒకరికొకరు సహకరించుకోవడం.

Continued......2

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## అంతర్గత ప్రజాస్వామ్యంతో జాతీయ పొలిటికల్ పార్టీ నిర్మాణానికి అంకురార్పణ

## నమూనా మార్పుతో ప్రతిపాదిత ద్విపక్ష జాతీయ పార్టీ ఓటర్లజాతికి అంకితం !

## 50-50 రాజనీతి!

ప్రస్తుతం మనదేశంలోని 96 కోట్ల మంది ఓటర్లూ 2 సమూహాలుగా (groups) విడిపోయేరు. (1) UPA :Indian National Congress Party + 26 విభిన్న కుల-మత స్వార్థాలతో కూడిన పార్టీల ఓటర్లు (2)NDA : హిందూత్వ జీవన విధానాన్ని స్వచ్ఛమైన లౌకికవాదంగా భావించే Bharateeya Janata Party + విదేశాలనుండి దిగుమతయిన Secularism, capitalism, socialism,communism అనే భావజాలాలలో ఇరుక్కున్న ఓటర్లు .
నమూనా మార్పునకు (paradigm shift) ఇదే సమయం !

దేశంలో ఓటర్లు ఎంతమంది ఉన్నా పార్టీలెన్ని ఉన్నా ప్రభుత్వాలు మారుతున్నా రాజ్యం ఒక్కటే శాశ్వతంగా ఉంటుంది.
దేశ భవిష్యత్తుని సమిష్టిగా తప్ప ఒంటరిగా ఏఒక్క ఓటరూ నిర్ణయించలేడు. అందుచేత జుగాడ్ ఓటర్ల ద్విపక్ష పార్టీ ఒక్కటి చాలు.
75 శాతం మెజారిటీ / 25 శాతం మైనారిటీ సంఖ్య తో సుపరిపాలన సాధ్యం.

ఉభయ తెలుగు రాష్ట్రాలలోని ప్రతీ 'MLA' నియోజకవర్గంనుండీ కనీసం ఒక కార్యకర్త ముందుకు రావాలి. 'జుగాడ్ భారత్ పార్టీ' (suggested temporary name)లో ప్రవేశం ఎవ్వరికీ ఉచితంగా లభించదు. డబ్బులేనిదే పొలిటికల్ పార్టీయే లేదు - అందుకే, ఓటర్ల యొక్క కష్టార్జితం ఒకేసారి పార్టీ మూలనిధికి ఇచ్చే డబ్బు (MONEY) తో ప్రారంభమవుతుంది. ఈడబ్బుని స్వచ్ఛంద 'దానం/ ధర్మం / ముష్టి లేదా విరాళం' అని భావిద్దాం. ఓటరు యొక్క వార్షికాదాయం 3 లక్షల లోపుంటే 2 వేలు, లేదా 5 లక్షల లోపుంటే 5 వేలు, లేదా 10 లక్షల లోపుంటే 10 వేల రూపాయిలు బేషరతుగా ఇవ్వగలిగిన వారందరూ జుగాడ్ ఓటర్లే. ఓటర్లు వివాహితులయితే దంపతులిరువురూ పార్టీ బాధ్యత స్వీకరించవచ్చు. లాయర్లూ, ప్రభుత్వోద్యోగులూ, మీడియామిత్రులతో సహా ఇవ్వగలిగిన వారు అందరూ ఎంతోకొంత డబ్బు SBI బాండ్ల రూపేణా విరాళమివ్వాలి. పార్టీ నిర్వహణ ఖర్చులకై (50+25+15+10) ప్రతీ 'MLA' నియోజకవర్గం ప్రాతిపదికగా ఓటర్ల భాగస్వామ్యంతో ఒక కోటి రూపాయలు మించకుండా విరాళ నిధి సేకరణ జరుగుతుంది. ఇదే నమూనా మార్పు !

1. కార్యకర్తకు (భారత భాగ్య విధాత) ఒకేసారి చెక్కు రూపేణా 10వేల రూపాయలు విరాళం ఇవ్వగలిగిన ఆర్థిక స్తోమత ఉండితీరాలి. అతనికి/ఆమెకి ఏ నియోజకవర్గంలో ఓటర్ గుర్తింపు కార్డుందో అదే అతని/ ఆమె యొక్క 'MLA' నియోజకవర్గం .
2. కార్యకర్తగా నమోదయిన తరువాత మాత్రమే, 10 నుండి 25 (or more) జుగాడ్ ఓటర్ల మద్దతు మీ బంధు మిత్రులనుండీ మీవిశ్వసనీయతతో, తీసుకు రాగలగాలి. మీ విరాళదాతలకు భారతదేశంలోని ఏ MLA/MP నియోజకవర్గంలోనైనా ECI ద్వారా జారీ చేయబడ్డ ఓటర్ గుర్తింపు కార్డు ఉంటే చాలు.

Continued......3

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com


ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

3. నేను తొలి-అనుసంధాన-కార్యకర్తగా మహేశ్వరం నియోజక వర్గం నుండి 10 వేలు విరాళమిచ్చి, నాప్రతిపాదనతో 30 మంది జుగాడ్ ఓటర్ల విరాళ సేకరణ చేయడం జరిగింది. (ప్రస్తుతం ఆ డబ్బు ఒక జాతీయ బ్యాంకు FD లో ఉంది) నేను ఎన్నికలలో పోటీ చేయను.
4. పార్టీ నిర్మాణంలోనూ విధి విధానాల నిర్ణయాలలోనూ క్రమసంఖ్యలో మొదట వచ్చిన 25 మంది కార్యకర్తలకూ ప్రాధాన్యత ఉంటుంది. పార్టీ నిర్మాణానికి కనీసం 100 మంది కార్యకర్తలు భావిభారత భాగ్యవిధాతలుగా ముందుకు రావాలి.
5. పార్టీపేరు ఓటర్లే సమిష్టిగా నిర్ధారించుకుంటారు. నేరచరితులకు BForm లభించదు. పార్టీ 'అధినేత' స్థానంలో, కార్యకర్తల మెజారిటీ నిర్ణయాలతో తనవ్యక్తిగత నిర్ణయాన్ని హేతుబద్ధంగా జోడించి, పార్టీని అదుపులో పెట్టగలిగిన సామర్థ్యంతో ఎన్నుకోబడిన ఏకార్యకర్తయినా 'అనుసంధానకర్తగా' ఉండవచ్చు. సందర్భోచితంగా అనుసంధానకర్తలకు 3 ఓట్లతో వీటోహక్కు ఉంటుంది. ఊహించనలవికాని జుగాడ్ ఓటర్ల కొత్త ఆలోచనలెన్నో... రాష్ట్రంలో ఎమ్మెల్యే నియోజకవర్గం ప్రాతిపదికగా, ఆర్థిక/అధికారవికేంద్రీకరణ మూలసూత్రంగా పరిపాలన సాగుతుంది. దేనికితగ్గ ప్రణాళిక (Agenda) దానికి ఉంటుంది.

ప్రస్తుతం మనదేశంలో ECI గుర్తింపుకార్డు పొందిన ఓటర్లు 96 కోట్లమంది ఉన్నారు. వీరిలో మనచే ఎన్నికైన ప్రతినిధుల సంఖ్య కేవలం 4000 MLA లూ 800 MP లు మాత్రమే.
ఉభయ తెలుగురాష్ట్రాలలోనూ MLA నియోజకవర్గం నుండి గ్రామ సర్పంచి వరకూ నిధులు,విధులు,జవాబుదారీ ప్రాతిపదికగా, అవినీతికి తావులేని జుగాడ్ ఓటర్ల స్వయంపాలన తప్పక సాధ్యం అవుతుంది. కృషితోనాస్తి దుర్భిక్షం.

భారత భాగ్య విధాతలు : (Rs/-10,000 donors)

Sarvasri : (1) M.PARTHASARATHY (2) K.SUBRAHMANYAM
(3) Col.P.V.RAMANA RAO (4) U.SUBBA RAO (5) Prof.C.K.MURTHY
(6) SYED ANSARI (7) Smt. D.KASTURI (8) K.SRINIVAS MURTHY
(9) Dr. VAMSI RAJ (10) Dr.G.ABBAIAH

జుగాడ్ ఓటర్లు : Sarvasri (11) JVL. NARAYANA (12) S.D.BABU
(13) T.SURYANARAYANA (14)Smt.D. SUBHADRA (15) M.RANGA RAO
(16) M.SAI SUBBARAO (17) Smt.D.JANAKI (18) J.VENKATA RAO
(19) P.NARASIMHA RAO (20) SAI SURYANARAYANA (21) MSS KUMAR
(22) Dr.U.V.KRISHNA MURTHY (23) M.RAMA RAO
(24) NANDAN SRIDHAR (25) Smt.K.RAJESWARI
(26) Smt.K.LAKSHMI (27) Justice CHANDRAKUMAR
(28) K. VASUDEVA RAO (29) NARAGONI (30) D.KONDALA RAO

Continued......4

# PREAMBLE ( ప్రాదేశిక )

## WE, THE Jugaad Voters OF INDIA, On the occasion of Azadi ka Amrit Mahotsav having solemnly resolved:

To establish a financially self-sustainable MODEL POLITICAL SYSTEM [MPS] (temporarily termed as Jugaad Party) based on the proposed Party's founding principles of "COOPERATION BASED ON TRUST" in order to enable all the Law Abiding Voters with good normal character and political integrity, who are registered with Election Commission of India under the Sovereignty of our SOCIALIST SECULAR DEMOCRATIC CONSTITUTION, every word there in pleasantly and meaningfully defined in the MPS manifesto, to participate in a conflict-free good governance to the citizens of India, in a peaceful and transparent manner. Corruption free Jugaad Voters irrespective of their own individual ideologies shall collectively run the proposed party with their own funds, with declared rules of decentralised power and expenditure for the common benefit of citizens, within the Party, and in all collective daily public activities involving other political parties.

On this auspicious day the 26th November 2021 we THE Jugaad Voters OF INDIA, HEREBY ADOPT, IMPLEMENT AND OWN TO OURSELVES THIS Jugaad Party Constitution.

## జుగాడ్ ఓటర్ల 50:50 రాజకీయ సంకల్పం !

మనరాజ్యాంగమే మన సర్వజన రక్ష, దానిప్రకారం, శాంతియుత "రహస్య ఓటింగుపద్ధతి" లో ఎన్నుకునేవాడూ, ఎన్నుకోబడినవాడూ ఇద్దరూ ఓటర్లే. "లౌకికవాద ప్రజాతంత్ర సామ్యవాదం" (Secular Democratic Socialism), అనగా, అంతర్గత ప్రజాస్వామ్యంతోకూడిన, స్వజాతీయ స్వాధికార స్వపరిపాలన. "జుగాడ్ ఓటర్లచే నిర్వచించబడిన మెజార్టీపాలన". నిర్వహణ ఖర్చులనిమిత్తం ఓటర్లు వారియొక్క ఆర్థిక స్తోమతను బట్టి ఒకేసారి పార్టీకి ఇచ్చే విరాళం 2 వేలు, లేదా 5 వేలు, లేదా 10 వేల రూ.ద్వారా మాత్రమే "జుగాడ్ పార్టీ" లో ప్రవేశం. తాము స్వీకరించిన పనికి తగ్గ తాత్కాలిక నేతృత్వాధికారం ఉంటుంది. ఎవ్వరికీ అధినేత హెూదా ఉండదు. సందర్భోచితంగా అనుసంధానకర్తలకు 3 ఓట్లతో వీటోహక్కు ఉంటుంది. MLA నియోజకవర్గం నుండి గ్రామ సర్పంచి వరకూ నిధులు, బాధ్యతలు, జవాబుదారీతనం ప్రాతిపదికగా జుగాడ్ ఓటర్ల పర్యవేక్షణలో స్వయంపాలనాధికారం.

ఏ పార్టీ అభ్యర్థి అయినా, ఎన్నికల సమయంలో ఓటర్లంతా సమానమే, కాబట్టీ ఓట్ల వ్యాపారం జరగదు. జుగాడ్ పార్టీ అభ్యర్థిని చూడగానే జనాలు గుర్తుపడతారు. కండువాలుండవు, కటౌట్లుండవు, ఫ్లెక్సీలుండవు. ఈపార్టీలో నేరచరితులకు B-Form లభించదు. ఈపార్టీ అభ్యర్థులందరూ గెలుపు గుఱ్ఱాలే. ఎవర్నిఎన్నుకుంటారో ఓటర్ల ఇష్టం. ఎన్నికలనిమిత్తం చేసే ఖర్చు ఎన్నికలకమిషన్ పరిమితికి మించేప్రసక్తేలేదు. గ్రామస్థాయినుండీ ఎక్కడికక్కడ ఆర్థికవనరుల వికేంద్రీకరణతో పారదర్శకంగా జరగవలసిన అధికారవికేంద్రీకరణ - "చట్టబద్ధ సుపరిపాలన ద్వారానే" సాధ్యం. దానికోసం కనీసం 100 మంది, "భావజాలాల సంకెళ్ళనుండీ విముక్తిచెందిన" చిత్తశుద్ధిగల, కార్యకర్తల/జుగాడ్ ఓటర్ల నిధులతో, వినూత్నమైన ఆలోచనతో, ఒక జాతీయ రాజకీయ పార్టీ వ్యవస్థ కేంద్ర ఎన్నికల కమిషన్ నియమావళితో నిర్మించడమే - జుగాడ్ ఓటర్ల ఉద్యమ ప్రాథమిక సంకల్పం!

**M.Parthasarathy (9866416798) &**
**25 other Jugaad Voters READY with Rs 1 lakh starting Fund.**

**Advt.**

# లక్ష్య సాధన పద్ధతుల్లో ఆరితేరాం..
# లక్ష్యాల్ని మర్చిపోయాం

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



క్రియాశీల ప్రజాస్వామ్యంలో ఎన్నికలనేవి ఎన్నిక తర్వాత ఏం జరుగుతుందని తప్ప ఎన్నికలో ఎవరు గెలుస్తారని కాదు. కానీ అధికారంలో ఎవరున్నారన్నదే మనకు సమాజంలో అన్నిటి కంటే ముఖ్యం. ఒకసారి అధికారంలోకి వచ్చాక ప్రజాప్రయోజనాల్ని మెరుగుపరచటానికి ఏం సాధిస్తున్నాం అని ఎప్పుడోగానీ ఆలోచించం. కేవలం రాజకీయ నేతల్ని, పార్టీల్ని నిందించి ప్రయోజనం లేదు. మీడియా, గొంతున్నవాళ్లు, సమాజం చాలామేర ఇదే రకంగా ఎన్నికల్ని అధికార పీఠాల ఆటగా భావిస్తూ మునిగితేలుతున్నారు. రాజకీయం ఎందుకోసమో, అధికారం ఎందుకో, వాటి నిజమైన లక్ష్యాలేమిటో మనం పెద్దగా పట్టించుకోవటం లేదు.

ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఇరవయ్యో శతాబ్దం గురించి చెప్పిన మాటలు గుర్తున్నాయా? "మనం లక్ష్యసాధన పద్ధతుల్లో ఆరితేరాం, కానీ లక్ష్యాల్ని మర్చిపోయి గందరగోళ పడుతున్నాం" అన్నారు. ఈవేళ మనం అధికారాన్ని ప్రజల జీవితాల్ని మెరుగుపరిచేందుకు వినియోగించటం మర్చిపోయాం. ఏం చేసైనా అధికారం చేజిక్కించుకోవటమే సర్వస్వంగా వ్యవహరిస్తున్నాం. మన ప్రస్తుత రాజకీయాలు, అధికార క్రీడలు.. ఐన్‌స్టీన్ మాటలకు నిలువెత్తు నిదర్శనం.

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు, ఆ తర్వాత అధికారం కోసం పెనుగులాట, ఎవరు ముఖ్యమంత్రి అవుతారంటూ జనం ఊపిరిబిగబట్టేలా మీడియా ఇచ్చిన కవరేజీ ఇవన్నీ ప్రతి పెద్ద రాష్ట్రంలో సర్వసాధారణాలయ్యాయి. మన ప్రజాస్వామ్యంలోని బలాలు, బలహీనతలకు సంబంధించి పలు అంశాల్ని ఇవి తేటతెల్లం చేస్తాయి. రాజకీయ గుత్తాధిపత్యం, నిజమైన రాజకీయ పోటీ, న్యాయంగా నిష్పక్షికంగా ఎన్నికల నిర్వహణ, ఎన్నికల తీర్పులను మొత్తమ్మీద అందరూ ఆమోదించటం, శాంతియుతంగా అధికార మార్పిడి మనకున్న గొప్ప బలాలు. ఓటర్లను ప్రలోభపెట్టటానికి చట్టవిరుద్ధంగా డబ్బు పందేరం, ఆదాయాలు, వృద్ధిని పణంగా పెట్టి తాత్కాలిక సంక్షేమం, కులం, మతం వంటి భావోద్వేగాలను రెచ్చగొట్టి ఓట్లు అడగటం, అధికారం మార్గం కాకుండా లక్ష్యం కావటం, అధికార కేంద్రీకరణ, చట్టబద్ధపాలనలో ఘోరంగా విఫలమవటం, వ్యక్తిగత నియంతృత్వం మన బలహీనతలు.

కర్ణాటకలో ప్రభుత్వం మారింది. అవినీతి పెద్దఎత్తున అడ్డూఆపూ లేకుండా పెరిగిపోయిందన్న భావన దిగిపోయిన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ విశ్వసనీయతను రాష్ట్రంలో తీవ్రంగా దెబ్బతీసింది. రాష్ట్ర స్థాయిలో విశ్వసనీయ నాయకత్వాన్ని తయారుచేసి ప్రోత్సహించటంలో అశక్తత లేదా అయిష్టతను ప్రదర్శించటం, ఓట్ల సమీకరణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై మితిమీరి ఆధారపడటం ఆ పార్టీకి ప్రతికూలమైంది. మనలాంటి విశాల, వైవిధ్యభరిత సమాజంలో అది అవివేక, ఆచరణసాధ్యంకాని వ్యూహమని రుజువైంది. భారతదేశంలో ప్రతి పెద్ద రాష్ట్రం ప్రపంచంలోని చాలా దేశాలకన్నా పెద్దది. యూనియన్, రాష్ట్రాల మధ్య అధికారాల విభజన స్పష్టంగా ఉన్న నిజమైన ఫెడరల్ రాజకీయ వ్యవస్థ మనది. ఇటువంటి దేశంలో, 'డబుల్ ఇంజిన్ సర్కార్' అనే వాదన అహేతుకం. ఆచరణసాధ్యం కూడా కాదు. భారత్‌లో రాజకీయాలకి, పాలనకి రాష్ట్రం యూనిట్. జాతీయ స్థాయిలో ఎన్నికల ఫలితం ప్రధానంగా రాష్ట్రాల్లో వచ్చిన ఫలితాల అంకగణిత సగటుగా ఉంటుంది. ఇది మన వైవిధ్యానికి, ఫెడరలిజానికి మంచి పరిణామం.




రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి ఎన్నిక మధ్య ఓట్ల అంతరం కొద్దిపాటేగానీ, గణనీయమనదగ్గ స్థాయిలో 5-10% దాకా ఉంటుంది. చాలామంది ఓటర్లు స్థానిక, రాష్ట్ర, జాతీయ అన్ని ఎన్నికల్లో ఒకే పార్టీకి ఓటు వేస్తారు. రాష్ట్రంలో ఆ సమయంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పట్ల తమకున్న సంతృప్తి, అసంతృప్తికి అనుగుణంగా ఓట్లు వేస్తారు. ఇటువంటి పరిస్థితిలో యూనియన్, రాష్ట్రాల స్థాయిలో ఒకే పార్టీ పాలన ఉండాలని వాదించటం, రాష్ట్ర, స్థానిక స్థాయిల్లో ఓట్లు ఆకర్షించటం కోసం జాతీయ నాయకుడి మీద ఆధారపడటం ప్రతికూల ఫలితాలనిస్తుంది.

స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకి బలమైన తీర్పు వచ్చినా సిద్ధరామయ్యను ముఖ్యమంత్రిగా ఎంపిక చేయటానికి కాంగ్రెస్ నాయకత్వం ఎదుర్కొన్న సందిగ్ధ పరిస్థితి మన రాజకీయంలోని బలహీనతకు అద్దం పడుతుంది. మన ప్రజాస్వామ్యం ప్రధానంగా రాజకీయ పార్టీల ద్వారా నడస్తుంది. పార్టీలే అప్రజాస్వామికంగా పనిచేస్తుంటే, కొద్దిమంది వ్యక్తుల లేదా కుటుంబ గుత్తాధిపత్య సారథ్యంలో నడుస్తుంటే ప్రజాస్వామ్య విలువలను, పాలనలో హేతుబద్ధతను పెంపొందించటం అసాధ్యమవుతుంది.


మనం వెస్ట్‌మినిస్టర్ నమూనా మంత్రివర్గ వ్యవస్థ ప్రభుత్వాన్ని ఎంచుకున్నాం. రాష్ట్రంలో ముఖ్యమంత్రికి తప్ప ఎవరికీ అధికారాలు లేవు, మంత్రివర్గం సైతం నామమాత్రమే. అధికారం ఒక వ్యక్తి చేతిలో అంతగా కేంద్రీకృతమైందనేది వాస్తవం. మంత్రివర్గ ఉమ్మడి బాధ్యత అనేది మన ప్రజాస్వామ్యంలో మిధ్య.

ఓటర్లను ఆకట్టుకోవటానికి కాంగ్రెస్ అన్ని రకాల తాత్కాలిక, వ్యక్తిగత సంక్షేమ చర్యల్ని హామీ ఇచ్చింది. ఒక ప్రజాస్వామ్యంలో, ముఖ్యంగా అపార పేదరికం ఉన్న దేశంలో, బాధని, కష్టాన్ని తగ్గించేందుకు పేదల తాత్కాలిక అవసరాలను పట్టించుకోవటం అవసరం. కానీ అన్ని ఇళ్లకీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పేదరికాన్ని ఎలా తగ్గిస్తుంది? మధ్యతరగతి వర్గాలు, సాఫ్ట్‌వేర్ ఎగ్జిక్యూటివ్‌లు, డాక్టర్లు, వృత్తినిపుణులు, ఎంటర్‌ప్రెన్యూర్‌లు ఉచిత విద్యుత్తు అడిగారా? తాత్కాలిక ప్రజాకర్షక హామీల భారం కర్ణాటక ఖజానా మీద ఏటా రూ.60,000 కోట్ల వరకు ఉంటుందని అంచనా. సంఘటిత రంగంలో ఉన్న, మంచి జీతభత్యాలు అందుకుంటున్న ప్రభుత్వోద్యోగులకు ఎప్పటి నిధులు అప్పుడే బడ్జెట్‌లో పూర్తిస్థాయి కేటాయింపు చేస్తూ పెన్షన్ ఇచ్చే పద్ధతి ఇప్పుడు అమలులో ఉంది. ప్రభుత్వం, ఉద్యోగులు కొంత వాటా చెల్లించే ఈ విధానం 2004 నుంచి ప్రభుత్వంలో చేరిన వారందరికీ వర్తిస్తోంది. ఎవరికీ పెద్ద భారం లేకుండా, భవిష్యత్తు తరాలకు నష్టం లేకుండా కొనసాగుతున్న ఈ పెన్షన్ విధానం స్థానంలో ఈవేళ్టి ఉద్యోగులకు బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు లేకుండా, పే రివిజన్ కమిషన్లకనుగుణంగా నిరంతరం పెరిగే పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణ 'పరిశీలన'కు కూడా కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కొద్దిమంది, గొంతున్న, సంఘటితమైన ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టి సంతృప్తి పరచాలనుకోవటం వల్ల ఓ పదేళ్ల తర్వాత రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన పార్టీ, భారతదేశంలో ఘనమైన జాతీయ పార్టీ అధికారం కోసం చెల్లించాల్సిన మూల్యం ఇదా?

మనం పేదలకు అవసరమైన తాత్కాలిక సాయాల్ని అందించాలనటంలో సందేహం లేదు. కానీ పేదరికాన్ని తొలగించాలంటే ఆ సాయాన్ని దీర్ఘకాలిక చర్యలతో సమతూక పరచాలి. విద్యలో, ఆరోగ్యంలో ప్రతి బిడ్డకూ ఫలితాలు అందేలా చేయటం, ప్రతి పౌరునికీ చట్టబద్ధపాలన రక్షణ, మెరుగైన మౌలిక వసతుల నిర్మాణం, పెట్టుబడుల ప్రోత్సాహం, వృద్ధి, ఉద్యోగాల సృష్టి మాత్రమే పేదరికాన్ని నిర్మూలించి, ప్రగతిని పెంపొందించే మార్గాలు. నిజమైన పరిపాలనను, అభివృద్ధిని పణంగా పెట్టి పేదరికాన్ని కొనసాగిస్తూ తాత్కాలిక జనాకర్షణ కోసం ఇష్టారాజ్యంగా అప్పులు చేద్దామని పార్టీలు, ప్రభుత్వాలు అనుకుంటే ఒక దేశంగా మనం విషాదకర పర్యవసానాల్ని ఎదుర్కోక తప్పదు.

భారతదేశం, చైనా 1990లో జీడీపీ, తలసరి ఆదాయంలో సమాన స్థాయిలో ఉన్నాయి. ఇప్పుడు చైనా జీడీపీ, తలసరి ఆదాయం అయిదు రెట్లు కంటే ఎక్కువ. భవిష్యత్తును దెబ్బతీసి, అప్పులతో వచ్చేతరం మీద భారం వేసి ఈవేళ ఎలాగోలా ఓట్లు సంపాదించాలని మనం అనుకుంటే, అధికారం లక్ష్యం ఏమిటో మనం మర్చిపోయాం. కాంగ్రెస్, యావత్ దేశం కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. "ఎలాగోలా అధికారమే పరమావధి- భవిష్యత్తు ఏమైనా సరే" ధోరణి వినాశకర మార్గం. నెహ్రూ ఎన్నో సందర్భాల్లో చెప్పినట్లు, "భారతదేశం గెలిస్తే, ఓడిపోయేదెవరు? భారతదేశమే ఓడిపోతే గెలిచేదెవరు"?

# మూడో వంతు విద్యార్థులకే తరగతికి తగిన విద్యాప్రమాణాలు



తెలంగాణ రాష్ట్రంలో ఇటీవలికాలంలో పాఠశాల విద్యాప్రమాణాల మీద కొంత చర్చ, ప్రయత్నం మొదలైందిగానీ, ఇంకా చాలాదూరం ప్రయాణించాల్సి ఉందని తాజాగా మరో అధ్యయనం తెలిపింది.

రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం.. రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల్లో అత్యధికులు తప్పులు లేకుండా ఇంగ్లిష్ మాత్రమే కాదు, ఇంట్లో, బయటా మాట్లాడుకునే భాష తెలుగును కూడా చదవలేకపోతున్నారు. కూడికలు, తీసివేతలూ చేయలేకపోతున్నారు. భాగాహారాల్లో పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంది. ఈ సర్వేలో, తెలుగు, ఇంగ్లిష్ కంటే హిందీని తప్పులు లేకుండా చదువుతున్నవారి శాతం కొద్దిగా ఎక్కువగా ఉంది. మొత్తమ్మీద మూడో వంతు లోపు విద్యార్థుల్లోనే తరగతికి అవసరమైన అభ్యసన సామర్థ్యాలు ఉన్నట్లు వెల్లడైంది. గణితంలో అయితే ఆ శాతం 9వ తరగతిలో గరిష్టంగా పది శాతమే ఉంది.

**400 పాఠశాలల్లో, 16,000 మంది విద్యార్థులపై సర్వే..**

అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు గత విద్యాసంవత్సరం 1-5 తరగతులకు తొలిమెట్టు పేరిట ప్రత్యేక కార్యక్రమానికి విద్యాశాఖ శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అదేవిధంగా 6-9 తరగతుల్లో కూడా విద్య నాణ్యత పెంచాలన్న లక్ష్యంతో హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ)లోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్స్ ఇన్ పబ్లిక్ సిస్టమ్స్ (సిప్స్), సేవ్ ది చిల్డ్రన్ సహకారంతో మార్చి 9 నుంచి 16వ తేదీ వరకు సర్వే నిర్వహించింది. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 400 పాఠశాలల్లో 16 వేల మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అందులో అభ్యసన సామర్థ్యాలు (తరగతికి తగిన విద్య నేర్చుకోవటం) ఎక్కువమందిలో చాలా తక్కువగా ఉన్నాయని స్పష్టమైంది.

తెలంగాణలో మాత్రమే కాదు, ప్రభుత్వ పాఠశాలలనే కాదు.. దేశవ్యాప్తంగా, పలు ప్రయివేటు పాఠశాలల్లో కూడా ఇదే తరహా పరిస్థితి నెలకొంది. సంపన్నులను మినహాయిస్తే.. తల్లిదండ్రులకు కాస్త చదువు, స్వావలంబన, పిల్లల్లో స్వతహాగా తెలివితేటలు, కష్టపడేతత్వం వంటివి ఉన్న కొన్ని సందర్భాల్లో తప్ప సగటు భారతీయ విద్యార్థులకు చెప్పుకోదగిన చదువు అందటం లేదు. మొత్తంగా చూస్తే ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చెబుతున్నట్లు, ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా ఏ పాఠశాలలో చదివినా ఈ దేశంలో నూటికి 80 మంది పిల్లలు పేరుకు విద్యార్థులు తప్ప వారికి చదువు అందటం లేదు.

**రాష్ట్ర విద్యాశాఖ సర్వేలో భాషాంశాలను ధారాళంగా చదివేవారి శాతం (వరుసగా 6, 7, 8, 9 తరగతుల్లో)**

| | 6, 7 | 8,9 |
|---|---|---|
| తెలుగు | 40 | 46 |
| ఇంగ్లిష్ | 36 | 44 |
| హిందీ | 41 | 47 |

**సైన్స్, సాంఘిక శాస్త్రాలను చదివి అర్థంచేసుకునేవారి శాతం**
(వరుసగా 6, 7, 8, 9 తరగతుల్లో)

| | | | | |
|---|---|---|---|---|
| సైన్స్ | 20 | 15 | 30 | 32 |
| సాంఘికం | 15 | 20 | 27 | 30 |

**లెక్కలు సరిగా చేయగలిగినవారి శాతం**

| | 6 | 7 | 8 | 9 |
|---|---|---|---|---|
| కూడికలు | 88 | 91 | 93 | 96 |
| తీసివేతలు | 68 | 72 | 77 | 83 |
| గుణకారాలు | 30 | 39 | 60 | 65 |
| భాగహారాలు | 12 | 19 | 33 | 35 |

**తరగతికి తగ్గ అభ్యసన సామర్థ్యాలు (వరుసగా 6, 7, 8, 9 తరగతుల్లో)**

| | | | | |
|---|---|---|---|---|
| గణితం | 5 | 3 | 1.5 | 10 |
| సైన్స్ | 10 | 20 | 25 | 30 |
| సోషల | 20 | 22 | 25 | 32 |

ఈ పరిస్థితిని మార్చటానికి ప్రపంచవ్యాప్తంగా, మన దేశంలోనూ పలు పద్ధతులు, అనుభవాలు ఉన్నాయి. సాంకేతికత అందుబాటులో ఉంది. అలాగే తల్లిదండ్రుల్లో, సమాజంలో విద్యకు ఎంతో డిమాండ్ ఉంది. అదనంగా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ఇప్పుడు వెచ్చిస్తున్న నిధులతోనే అందరికీ మంచి ప్రమాణాల విద్యను అందించవచ్చు. కావలసిందల్లా రాజకీయంలో, పాలనా యంత్రాంగంలో సంకల్పం.







# యువత ఓటే వజ్రాయుధం .. ఓటర్లుగా నమోదవ్వండి,

## కాలేజీల్లో 'ఓట్ ఇండియా - సేవ్ డెమోక్రసీ' ప్రచార కార్యక్రమం

దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్య రాజకీయం క్రియాశీలంగా ఉండాలంటే యువత ఓటర్లుగా మారి ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. 'ఓట్ ఇండియా – సేవ్ డెమోక్రసీ' ప్రచార కార్యక్రమాన్ని విజయనగరం ఉమాభారతి డిగ్రీ కళాశాలలో ఆయన ప్రారంభించారు. విద్యార్థులతో ర్యాలీ అనంతరం మాట్లాడుతూ, చదువుకునే యువత రాజకీయాన్ని, పరిపాలనను పట్టించుకోకుంటే అందరూ మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాలనలో లోపాల్ని సరిచేయాలంటే ఓటు హక్కు గొప్ప ఆయుధమన్నారు. ఓటర్లుగా నమోదవటం, పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకోవటం పట్ల అశ్రద్ధ చూపకూడదని, ఇవన్నీ ఆన్‌లైన్‌లో తేలిగ్గా చేసేయొచ్చన్నారు. కాలేజి కరస్పాండెంట్ బీఏ రావు మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగ ఫలాలు అందరికీ అందుబాటులోకి తెచ్చే అవకాశం యువత చేతుల్లో ఉందన్నారు. సమావేశంలో వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు ఈశ్వరప్రసాద్, ఇప్పలవలస గోపి, త్రిసూల్ రమణ స్కూల్స్ అధినేత కుమార్, తాడేపల్లి నాగేశ్వరరావు, కందాల సాయిబాబా, జలంత్రి రామచంద్రరాజు, పి.ప్రభాకరరావు, కళాశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వరరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

**చీపురుపల్లిలో.. :** రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది విద్యార్థులు ఓటర్లుగా నమోదు కావాల్సి ఉండగా, 2 లక్షల మంది మాత్రమే నమోదైనట్లు సమాచారమని వెంటనే ఓటర్లుగా నమోదవ్వాలని చీపురుపల్లి సత్య రామా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'ఓట్ ఇండియా – సేవ్ డెమోక్రసీ' కార్యక్రమంలో బాబ్జీ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సంఘం ప్రస్తుతం ఓటరు నమోదు, పోలింగ్ కేంద్రాల పరిశీలన కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తోందని, విద్యార్థులు ఉపయోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ జగదీష్ కోరారు. వి.ఎన్.ఎస్ కుమార్, బ్లడ్ బ్యాంక్ అధినేత నాగేశ్వరరావు, మాతృభూమి సేవాసంఘం కార్యదర్శి గోపాలరావు, సత్యనారాయణ మాస్టారు, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

**మహిళా డిగ్రీ కళాశాలలో.. :** పరిపాలన, రాజకీయాల్ని పట్టించుకోవటం ఎవరి ప్రయోజనం కోసమో కాదని, మనకు సౌకర్యాలు, ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కోసమని, అందుకే ఓటును పట్టించుకోవాలని విజయనగరం శ్రీనివాస మహిళా డిగ్రీ కళాశాలలో బాబ్జీ అన్నారు. ఓటర్ల జాబితాలో అవసరమైన సవరణలు, కొత్తగా నమోదు చేసుకోవటం కోసం ఇంటింటికీ బీఎల్‌ఓల సర్వే కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఓటు లేదని హైరానా పడకుండా ఇప్పుడే జాగ్రత్త పడాలన్నారు. లోక్‌సత్తా తరపున 'ఓట్ ఇండియా – సేవ్ డెమోక్రసీ' కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు బాబ్జీని ప్రజాసంఘాల నేతలు అభినందించారు.






# విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ - ప్రజా ప్రయోజనాలు

విశాఖ ఉక్కు కర్మాగారం (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్) ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కె. చంద్రశేఖరరావు అంతటితో ఆగకుండా కర్మాగారం నిర్వహణకు కావలసిన నిధులిచ్చి, ఉక్కు ఉత్పత్తులను కొనుగోలు చేస్తామని ప్రకటించటం కొంతకాలం క్రితం నాటకీయ పరిణామాలకు దారితీసింది. మూలధనం (వర్కింగ్ క్యాపిటల్) కింద నిధుల సేకరణకు మార్చి 27న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఇచ్చిన 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్' టెండర్లలో పాల్గొని కొనుగోళ్లు చేయటంపై అధ్యయనానికి అయిదుగురు సింగరేణి అధికారుల బృందాన్ని ఆయన పంపించారు. ఈ నేపథ్యంలో కొందరు బీఆర్ఎస్ నాయకులు నాడు విశాఖ ఉక్కు కోసం తెలంగాణ ప్రాంత ప్రజలు పాల్గొన్న వైనాన్ని, త్యాగాలు చేసిన ఘటనల్ని గుర్తుకుతెచ్చుకుని నివాళు లర్పించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకుని తీరుతామని బీఆర్ఎస్ పార్టీ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ తోట చంద్రశేఖర్ ప్రకటించారు. బైలదిల్లా ఇనుప ఖనిజం గనులను విశాఖ స్టీల్‌ప్లాంట్, బయ్యారంలకు కేటాయించి తెలుగు ప్రజల హక్కుల్ని కాపాడాలని ఆయన యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు కూడా ఇదే మాట ఉద్ఘాటించారు. 'ఇప్పటికిప్పుడు విశాఖ ఉక్కును ప్రయివేటీకరించాలనుకోవటం లేదు, ప్లాంటును బలోపేతం చేసే ప్రయత్నాలు చేస్తున్నాం, ముడి సరకు పెంచే అంశంపై దృష్టి పెట్టాం, అందులో భాగంగానే ఆర్ఐఎన్ఎల్ అధికారులతో భేటీ అవుతున్నాం' అని అదే సమయంలో యూనియన్ ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే వ్యాఖ్యానించటం బీఆర్ఎస్ నేతలకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. కేసీఆర్ దెబ్బతోనే ప్రయివేటీకరణపై యూనియన్ ప్రభుత్వం దిగొచ్చిందని బీఆర్ఎస్ అగ్రనేతలు, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు ప్రకటించుకున్నారు కూడా. అయితే స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగదని మరుసటి రోజే యూనియన్ ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించటం, ప్లాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయటం నిబంధనల ప్రకారం అంత తేలిక కాదని స్పష్టం కావటంతో బీఆర్ఎస్ నేతలు వెనక్కుతగ్గారు. 'రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల ద్వారా అమలు చేస్తున్న పలు కార్యక్రమాలు, పథకాల పనుల్లో ఏటా దాదాపు 3 లక్షల టన్నుల ఇనుము వినియోగిస్తోంది. దీనిని నేరుగా 'వైజాగ్ స్టీల్' పరిశ్రమ నుంచి టోకుగా కొంటే రాష్ట్ర ప్రభుత్వానికి లాభదాయకంగా ఉంటుంది' అని సింగరేణి సంస్థ అధ్యయనంలో తేలినట్లు వార్తలొచ్చినా నివేదిక గురించి ఎవరూ అధికారికంగా ప్రకటనలు చేయలేదు. నిజానికి విశాఖ స్టీల్ ప్లాంట్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌కు కేసీఆర్ స్పందించక ముందే స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తున్నట్టు కేటీఆర్ ప్రకటించారు. దీంతో ఉక్కు కర్మాగార కార్మిక నేతలు హైదరాబాద్ వచ్చి మంతనాలు జరిపి, కేసీఆర్ స్వయంగా ప్లాంట్‌ను సందర్శించాలని కోరారు. ఈ నేపథ్యంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయంలో బీఆర్ఎస్ వ్యూహం ఎలా ఉండబోతుందన్నది వేచి చూడాలి.



ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రవేశానికి బీఆర్ఎస్ ప్రయత్నాల చుట్టూ పరిణామాలను అలా ఉంచితే, ఏపీలో దాదాపు అన్ని ప్రతిపక్ష పార్టీలూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగుల ఉద్యమానికి ఇప్పటికే మద్దతు ప్రకటించాయి. ఉత్తరాంధ్ర అభివృద్ధికి

సమగ్ర ప్రణాళిక రూపొందించే ప్రక్రియలో భాగంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆమధ్య విశాఖపట్నంలో నిర్వహించిన సదస్సుకు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ హాజరైనప్పుడు తమ ఉద్యమానికి మద్దతు ప్రకటించాలని స్టీల్‌ప్లాంట్ ఉద్యోగ సంఘాల నాయకులు నినాదాలు చేశారు. నినాదాలు చేస్తున్నవారిలో చాలామంది పుట్టకముందే తాను విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రత్యేక అధికారిగా పనిచేశానని, కర్మాగారం గురించి తనకు స్పష్టమైన అవగాహన ఉందని వారికి జేపీ సమాధానమిచ్చారు. 'నినాదాలు, చప్పట్లు, వ్యక్తులకు లొంగను. సత్యానికి, ప్రజాప్రయోజనాలకి, హేతుబద్ధ వాదనకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు తప్ప సంఘటిత శక్తుల ఒత్తిడికి లొంగను. సమాజంలో కొందరైనా నిజాన్ని నిజంగా, హేతుబద్ధంగా చెప్పగలిగితే తర్వాత చరిత్ర నిగ్గు తేలుస్తుంది' అని స్పష్టం చేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగదని స్పష్టం చేసిన యూనియన్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు ప్రారంభించింది. విశాఖ నగరంలోని హెచ్‌బీ కాలనీ వంటి చోట్ల ఆస్తుల అమ్మకానికి నోటిఫికేషన్ జారీ అయింది. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వివిధ పార్టీల, సంఘాల ఆందోళనలు జరుగుతున్నాయి. ఎన్నికల సమీకరణలు కూడా గుంభనంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ లేదా మరో ప్రభుత్వ కంపెనీని ప్రయివేటీకరించాలా, ప్రభుత్వమే నడపాలా? కొందరు ప్రశ్నిస్తున్నట్టు, లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ సంస్థల్ని కూడా నడపలేని నేతలు ప్రభుత్వాలను సమర్థంగా నడపగలరా? అనే ప్రశ్నలు మరింత పదునెక్కాయి.

## Purpose of Government

అయితే కేవలం ఈ ప్రశ్నల్నే చర్చిస్తే ప్రస్తుతమున్న పరిస్థితులు, లాభనష్టాలను బట్టి కొన్ని రకాల సమాధానాలు, పరిష్కారాలు లభిస్తాయి. ఈ అంశాన్ని సమగ్రంగా చూస్తేనే అసలైన పరిష్కారం కనిపిస్తుంది.

ప్రభుత్వ రంగ సంస్థలు ఎన్నో ఏళ్లపాటు లాభాల బాటలో ప్రయాణించినవి ఉన్నాయి. ఇప్పుడు కూడా లాభాలు ఆర్జిస్తున్నవి ఉన్నాయి. కానీ చాలా ప్రభుత్వ రంగ సంస్థలు పోటీ లేనంత వరకే, గుత్తాధిపత్యం ఉన్నంత వరకే లాభాలు సంపాదించాయి. ప్రభుత్వ రంగ సంస్థ అంటే అనివార్యంగా రాజకీయ జోక్యం, ఆశ్రిత పక్షపాతం, అవినీతి ఉంటాయి. కచ్చితంగా నష్ట ప్రమాదం పొంచి ఉంటుంది. ఈ నేపథ్యంలో, లాభనష్టాలతో ప్రమేయం లేకుండా ప్రభుత్వం ఆయా కంపెనీల్ని, పరిశ్రమల్ని నడపాలా, అంత అవసరం ఉందా అన్నది అసలు ప్రశ్న.

కాబట్టి, ప్రభుత్వం (రాజ్య వ్యవస్థ) చేయాల్సిన పనేంటి అనే మౌలిక ప్రశ్నకు సమాధానం నుంచే ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ అంశానికి సరైన సమాధానం లభిస్తుంది.

ప్రభుత్వం చేయాల్సిన పనులు ప్రధానంగా వ్యక్తులు తమంతట తాము చేసుకోలేని ఉమ్మడి అవసరాలు! ఇందుకోసమే రాజ్యవ్యవస్థతో ప్రజలు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఏ ఒక్కరూ దోపిడీకి, వివక్షకు గురికాకుండా, సమాజంలో అందరికీ సమానంగా ఎదిగే అవకాశాలు ఉండేలా ప్రభుత్వం చేసే పనులుండాలి. వాటిల్లో దేశ సరిహద్దు లోపల ముఖ్యమైన అంశాలను తీసుకుంటే.. మొట్టమొదటిది చట్టబద్ధపాలన. ఆ తర్వాత మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం, స్థానిక స్వపరిపాలన, నాణ్యమైన పౌర సేవలు మొదలైనవి.

ఎటువంటి ప్రత్యామ్నాయం చూపకుండా, ఏదో గాల్లో నుంచి అద్భుతం జరుగుతుందన్నట్టు భ్రమింప చేసే రాజకీయ క్రీడను సాగించకుండా రాజ్య వ్యవస్థ చేయాల్సిన ఈ పనుల మీద కనీసం దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలైన 1991 నుంచి దృష్టి పెట్టినా.. దేశం అనేక రెట్లు ఎక్కువ ఫలితాల్ని సాధించి ఉండేది. పేదరికాన్ని తుడిచిపెట్టి అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే పెద్ద వెల్లువ లాంటి పరిణామమే దేశంలో చోటు చేసుకుని ఉండేది. కేవలం రాజ్య వ్యవస్థ పాత్రను సక్రమంగా నిర్వర్తించుకుని, సరైన ఆలోచనలతో నిధుల వినియోగం వల్లే మన కంటే వనరుల్లో ఎంతో వెనుకబడిన జపాన్ వంటి దేశాలు మన కళ్ల ముందే సంపన్న దేశాలుగా ఎదిగాయి.

**చట్టాన్ని దుర్వినియోగం చేయటమే రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకోవటానికి మార్గమైంది**

రాజ్యం పాత్రలో కీలకమైన చట్టబద్ధపాలననే తీసుకుంటే, ఈవేళ్టి రాజకీయం చట్టబద్ధపాలన వైఫల్యం చుట్టూనే తిరుగుతోంది. అధికారంలో ఉన్న పార్టీలు జాతీయ స్థాయిలో, రాష్ట్రాల్లో కూడా చట్టాన్ని దుర్వినియోగం చేయటం తమ రాజకీయ ప్రాబల్యాన్ని కాపాడుకోవటానికి మార్గంగా భావించటం మన దేశంలో ఎప్పటి నుంచో ఆనవాయితీగా వస్తున్నా, ఇటీవల ఈ

పోకడ తీవ్రమైంది. పోలీసు యంత్రాంగాన్ని గుప్పెట్లో పెట్టుకుని ప్రత్యర్థులను అణగదొక్కుతున్నారు, విమర్శలకు పాల్పడేవారిని వేధిస్తున్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛకు మారుపేరుగా నిలిచిన పేర్కొందిన మీడియా సంస్థలు సైతం ప్రభుత్వాల మీద విమర్శలకు జంకుతున్న పరిస్థితి. కాలం చెల్లిన చట్టాల్ని కూడా యధేచ్ఛగా ప్రయోగిస్తున్నారు. చట్టబద్ధపాలన అమలు చేయటంలో ఘోర వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవటానికి బూటకపు ఎన్‌కౌంటర్లకు, బుల్‌డోజర్ కూల్చివేతలకు పాల్పడుతున్నారు. పోలీసు యంత్రాంగం రాజకీయం చేతిలో కీలుబొమ్మగా మారిపోయి, కోర్టుల్లో నేర నిరూపణ సకాలంలో జరుగుతుందన్న నమ్మకం లేని వ్యవస్థలో నేరస్తులను అదుపు చేయటానికి ఎన్‌కౌంటర్లను కూడా ప్రజల్లో పలువురు సమర్థిస్తున్నారు. అలాగే స్వతంత్ర ప్రతిపత్తితో దర్యాప్తు చేయాల్సిన సీబీఐ వంటి నేర పరిశోధనా సంస్థలు రాజకీయ పక్షపాతంతో వ్యవహరిస్తున్నాయనటానికి బలమైన ఆధారాలు కనిపిస్తున్నాయి. ఆర్థిక నేరాలపై నిగ్గు తేల్చాల్సిన ఈడీకి ప్రతిపక్షాల నేరాలు తప్ప అధికార పార్టీ నేరస్తులు కనిపించటం లేదు. ఈ తాకిడిపై ప్రతిపక్షాలు ఆక్రోశిస్తున్నాయి తప్ప, మౌలిక సంక్షోభాన్ని గుర్తించటం లేదు. తాము అధికారంలోకి వస్తే ప్రతీకారం తీర్చుకుంటాం అంటున్నాయే తప్ప చట్టబద్ధపాలనను బాగు చేస్తామనటం లేదు. న్యాయ విచారణ ప్రక్రియను సులభతరం చేసేందుకు శిక్షా స్మృతిలో తీసుకురావాల్సిన సాధారణ సంస్కరణలపై కూడా ప్రభుత్వాలు ఇంకా తాత్కారం చేస్తున్నాయి. లోక్‌సత్తా కృషితో వచ్చిన గ్రామ న్యాయాలయాల చట్టాన్ని అమలు చేయకుండా సామాన్య ప్రజలకు న్యాయాన్ని మరింత భారం చేస్తున్నారు. రాజకీయ వ్యవస్థ తీరు పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకత వల్ల న్యాయవ్యవస్థ కూడా పలు సందర్భాల్లో కట్టుతప్పుతోంది. రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన స్థాయిలో ప్రమాణాల్ని పాటించటం లేదు. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తి అంటే జవాబుదారీతనంలేకపోవటం అనే విపరీతార్థాలు తీస్తున్నారు. న్యాయ సంస్కరణలు కొరవడటం వల్ల ప్రజల్లో కోర్టుల పట్ల విశ్వాసం సన్నగిల్లుతూ వ్యవస్థను బలహీనపరుస్తున్నాయి. విదేశీ పెట్టుబడులు వేగంగా రావటం లేదు. సమాజంలో హింస, పౌరుల్లో అభద్రతా భావం పెరుగుతోంది. పూర్వకాలం పలువురు చక్రవర్తుల కాలంలో అమలు చేసిన పాటి చట్టబద్ధపాలన కూడా మన వద్ద లేదంటే అతిశయోక్తి కాదు. మన కుటుంబ వ్యవస్థలో, సమాజంలో అంతర్గతంగా ఉన్న బలం వల్లే ప్రజలు స్వచ్ఛందంగా కట్టుబాట్లను పాటిస్తున్నారు. ఎంతో పేదరికం, అవిద్య ఉన్న దేశమైనా శాంతియుతంగా ఉండటానికి మన సమాజంలోని బలం తప్ప పాలకుల చట్టబద్ధపాలన సామర్థ్యం కారణం కాదు. అలాగని ఇటీవల కొంతమంది వాదిస్తున్నట్టు, మన సంస్కృతీ సంప్రదాయాల మీదే ఆధారపడి రాజ్యాంగం నిర్దేశించిన రీతిలో చట్టం అందరికీ సమానంగా వర్తించే చర్యలు చేపట్టకపోతే మరిన్ని ప్రమాదాలు ఎదురవుతాయి. పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో కుటుంబ వ్యవస్థ బలహీనపడి శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయి, అలాగే వేగంగా పెరగాల్సిన ఆర్థిక వ్యవస్థలో పరస్పర అపనమ్మకాల వల్ల పెట్టుబడి ఒప్పందాలు మూల్యం చెల్లించాల్సి వస్తుంది. కాబట్టి చట్టబద్ధపాలనను సరిదిద్దాల్సిన అవసరం ఈవేళ తక్షణావసరం.

**ఉన్నత విద్యకు సరైన అధ్యాపకుల్ని కూడా తయారుచేయలేని అధ్వాన్న పాఠశాల విద్య**

మన విద్యారంగంలో పరిస్థితి అధ్వాన్నంగా ఉందంటే, ఎంత ఎక్కువ చదువుకుంటే, అంత ఎక్కువ నిరుద్యోగం ఉందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఎకానమీ (సీఎంఐఈ) ఇటీవల విడుదల చేసిన సర్వే కూడా తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో పట్టభద్రుల నిరుద్యోగం 34.14 శాతానికి చేరింది. ఉన్నత విద్యలో బోధించటానికి సరైన అధ్యాపకులు కూడా తయారుకాని పాఠశాల విద్యను కొన్ని దశాబ్దాలుగా కొనసాగిస్తూండటం వల్ల సంక్షోభం పెరుగుతోంది. సాంకేతిక వృత్తి విద్యలో మన సిలబస్ మార్కెట్ కంటే ముప్పై ఏళ్లు వెనుకబడి ఉందని ఇటీవల ఓ విదేశీ నిపుణుల కమిటీ వచ్చి చెబితే.. కొత్త కోర్సులు పెట్టటానికి బోధించేవారు లేరు కాబట్టి పాత పాఠాలే వల్లె వేస్తున్నామని మనవాళ్లు సర్దిచెప్పుకుంటున్నారు. మన పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులు, పరీక్షల నిర్వహణ ఏవీ సగటులో పోటీ ప్రపంచానికి సరితూగేవి కావు. అటు వ్యక్తి సుఖానికి, ఇటు సమాజ హితానికి రెంటికీ పనికిరాని విద్యావ్యవస్థను కొనసాగిస్తూ వచ్చారు. మౌలిక మార్పులు లేకుండా విద్యావిధానాన్ని కొనసాగిస్తుండటం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం పాఠశాల విద్య కోసం ఏటా ఒక్కో విద్యార్థి మీద రికార్డు స్థాయిలో 90 వేలకు పైగా ఖర్చు చేస్తున్నా పెద్దగా ఫలితాలు కనిపించటం లేదు.

ఈ నేపథ్యంలో విద్యకు సమాజంలో ఉన్న డిమాండ్‌ను ప్రయివేటు రంగం సొమ్ము చేసుకుంటూ, పరీక్షల విధానాన్ని పక్కదోవ పట్టించింది. విద్యావ్యవస్థలోని అవినీతి కూడా ఇందుకు దోహదం చేసింది. విద్యాప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయని ఎట్టకేలకు ఒప్పుకోక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వం సుమారు

రెండేళ్ల క్రితం జాతీయ విద్యావిధానాన్ని తీసుకొచ్చినా ఇప్పటికీ పట్టాలెక్కలేదు. నిబంధనలు, వాటి అమలు చుట్టూ గందరగోళాన్ని దాటి నాణ్యమైన విద్య, పరీక్షల నిర్వహణ పద్ధతులు వంటి అంశాలు చర్చకు రావటం లేదు. పరీక్షా పత్రాల లీకేజిని అరికట్టటం, అందరినీ పాస్ చేయటం, మాస్ కాపీయింగ్ చేయించయినా పాస్ పర్సంటేజి, స్కోర్లు పెంచటం వంటి అంశాల చుట్టూనే ప్రభుత్వాల ప్రాధాన్యాలు తిరుగుతున్నాయి.

**ఓపీ సంఖ్యను రోజుకు 30,000కి పెంచటం 'ఎయిమ్స్' లక్ష్యమట**

ఇక ఆరోగ్య రంగం విషయానికి వస్తే, రోజుకు లక్షన్నర మంది, గంటకు 6-7,000 మంది, నిమిషానికి 100 మంది కేవలం ఆరోగ్య విధానంలో ప్రభుత్వాల వైఫల్యం వల్ల మన దేశంలో పేదలుగా మారుతున్నారు. కోట్లాదిమంది ప్రజల ఉత్పాదక శక్తి బాగా తక్కువగా ఉంటోంది. దేశంలో యువ జనాభా అధికంగా ఉన్నా జీవనశైలి వ్యాధులు పెరుగుతూ భవిష్యత్తు భారతం పట్ల భయాల్ని పెంచుతున్నాయి. ఔషధాలు, టీకాల రంగం, వైద్య నైపుణ్యాలు, సాంకేతిక వనరులు వంటి మనకున్న బలాల్ని ఈ సంక్షోభాన్ని చక్కదిద్దేందుకు కాకుండా.. తాత్కాలిక పథకాలతో ప్రజలను మభ్యపెట్టటానికి, ప్రయివేటు రంగానికి, విదేశీ రోగులకు ఉపయోగపడటానికి మాత్రమే ప్రభుత్వాలు ఉపయోగిస్తూ కాలయాపన చేస్తున్నాయి. దీనివల్ల ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలున్నా ప్రజలకు ఆరోగ్యం అందటం లేదు. దీంతోపాటు, విద్యలో డబ్బు ఖర్చు చేస్తున్న ప్రభుత్వాలు, ఆరోగ్య రంగంలో మాత్రం బాగా తక్కువగా ఖర్చు చేస్తున్నాయి. యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి జీడీపీలో కేవలం 1% ఖర్చు చేస్తున్నాయి. ఇందులోనూ రాష్ట్ర ప్రభుత్వాల వ్యయం ఎక్కువగా ఉంటుండగా, యూనియన్ ప్రభుత్వం మొక్కుబడిగా ఖర్చు పెడుతోంది. అందరికీ ఆరోగ్యం అందించాలని, అందులోనూ ప్రాథమిక ఆరోగ్యం కీలకమని అంతర్జాతీయ డిక్లరేషన్లు, ఆరోగ్య దినోత్సవాల సందేశాలు ఘోషిస్తున్నా, వాటిని భారత్ కూడా ఆమోదిస్తున్నా, ఇప్పటి వరకూ ఆ దిశగా హేతుబద్ధమైన చర్యలు తీసుకోలేదు. దేశంలో 13 లక్షల మంది శిక్షణ పొందిన డాక్టర్లు ఉన్నా, వైద్యుల కొరత వల్ల ప్రజలకు వైద్యం అందటం లేదనే భ్రమను ప్రచారం చేస్తూ జిల్లాకో మెడికల్ కళాశాల పేరుతో ప్రభుత్వాలు హడావుడి చేస్తున్నాయి. మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో ఔట్ పేషెంట్ (ఓపీ) సంఖ్య ఇప్పుడు 3,000 వరకు ఉందని, ఈ సంఖ్యను 30,000 చేయటం తమ లక్ష్యమని ఇటీవల ఆ ఆస్పత్రి డైరెక్టర్ స్వయంగా ప్రకటించారంటే.. ప్రాథమిక ఆరోగ్యం పట్ల మనకు ఎంత శ్రద్ధ ఉందో, ప్రాథమిక ఆరోగ్యం అనే కాన్సెప్ట్‌ని మనం ఎంత వక్రమార్గం పట్టించామో అర్థమవుతుంది. చిన్న అనారోగ్యాలకు కూడా పెద్దాస్పత్రులకు వెళ్లటం వల్ల, రోగులకు సరైన వైద్యం అందకపోవటంతోపాటు ఆర్థిక భారం కూడా ఎక్కువవుతుంది. దీనివల్ల అసలు ఆస్పత్రికి వెళ్లి చూపించుకోవాలంటేనే విముఖత పెరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా మహిళలు ఆస్పత్రి ఖర్చులు ఎక్కువవుతాయని జబ్బు ప్రాథమిక దశలో ఉన్నప్పుడు వైద్యుడిని సంప్రదించకుండా అలక్ష్యం చేస్తున్నారని దేశంలో పలు అధ్యయనాలు తెలియచేశాయి.

**ప్రజారోగ్యం - స్థానిక ప్రభుత్వాలు - వ్యవసాయం - గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అంతరం**

అలాగే ఆరోగ్యంలో మరో కీలకాంశం ప్రజారోగ్య సేవలు. ప్రజారోగ్యంలో భాగమైన పారిశుధ్యం, మురుగునీటి పారుదల, నాణ్యమైన మంచినీరు వంటివి లేకుండా డాక్టర్ ఎంతటి సమర్థులైనా చికిత్సపరంగా ఏం చేయగలరు? కానీ మన దేశంలో స్థానిక ప్రభుత్వాలు బలహీనమవటంతో, నిధులు, అధికారాలు లేక ఉత్సవ విగ్రహాలుగా మిగలటంతో ప్రజారోగ్య సేవలు ఆశించిన స్థాయిలో లేవు. స్వచ్ఛ భారత్, అందులో భాగంగా టాయిలెట్ల నిర్మాణం వంటివి విపరీత కేంద్రీకృత పాలనతో పైస్థాయి నుంచే చేస్తుండటం వల్ల ప్రచారం తప్ప క్షేత్రస్థాయిలో ఫలితాలు అధ్వాన్నంగా ఉన్నాయి. అలాగే వ్యవసాయం అభివృద్ధి పేరుతో సాగునీటి ప్రాజెక్టులు, పథకాలు, సబ్సిడీలు వంటి వాటి కోసం భారీగా ఖర్చు చేస్తున్నా, రైతుకు ఆదాయం తేవటంలో, వ్యవసాయం మీద మితిమీరిన భారం లేకుండా వ్యవసాయేతర రంగాలలో ఉపాధిని సృష్టించటంలో, గ్రామాలకు-పట్టణాలకు మధ్య అంతరాన్ని తగ్గించటంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. రైతులకు మార్కెట్‌లో సంకెళ్లను తెంచి కొంత మెరుగైన ఆదాయానికి వ్యవసాయ చట్ట సవరణల్ని తీసుకొచ్చినా అవగాహన లేక, రాజకీయ కారణాలతో వాటిని రద్దు చేయించారు. వ్యవసాయాన్ని ఆధునీకరించి లాభసాటి చేయకుండా, ఇంకా పాతకాలం నాటి నినాదాలు, పద్ధతులతోనే సాగితే దేశం ఉపాధి, ఆర్థిక, సామాజిక పరంగా పెద్ద మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. వ్యవసాయ ఎగుమతుల్లో ఇండియాకి ఏడాదికి 100 బిలియన్ డాలర్ల సామర్థ్యం ఉన్నా, మన సాంప్రదాయ రాజకీయం అడ్డుపడుతోంది.

ఉపాధి అవకాశాలకు ఎంతో కీలకమైన మౌలిక వసతులకు సంబంధించి ఆర్థికంగా పెద్దవైన 49

దేశాలతో పోలిస్తే భారత్ అట్టడుగు అయిదు స్థానాల్లో ఉంది. మంచినీరు, పారిశుద్ధ్యం, వరదనీటి పారుదల, మురుగునీటి పారుదల, విద్యుత్తు, రోడ్లు, రవాణా.. అన్నిటిలో భారత్ ప్రగతి అధ్వాన్నంగా ఉంది. ఇటీవలికాలంలో మౌలిక వసతుల అభివృద్ధికి కొంత బలమైన ప్రయత్నం జరుగుతోంది. ఈ ఏడాది బడ్జెట్‌లో అభివృద్ధి పెట్టుబడులకు యూనియన్ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల రూపాయల వరకూ కేటాయించింది. రైల్వే రంగంలోగానీ, రాష్ట్రాలకు పెట్టుబడులను గానీ కలిపితే ఈ మొత్తం రూ.13 లక్షల 70 వేల కోట్ల రూపాయలు. పర్యావరణహిత సాంకేతికతతో ఈ రంగంలో చేయాల్సింది ఇంకా చాలా ఉంది.

**అన్నిటికీ పరిష్కారాలున్నాయి**

ఇంత సంక్షోభం ఉన్నా మన చర్చ వీటి చుట్టూ తిరగటం లేదు. పోనీ పరిష్కారాలు లేవా, ఆచరణ సాధ్యం కావా, ఈ సంక్షోభానికి పరిష్కారం లేదా అంటే, చట్టబద్ధపాలన, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, స్థానిక స్వయంపాలన.. ఇలా అన్ని రంగాల్లో మన దేశ పరిస్థితుల్లో ఆచరణసాధ్య పరిష్కారాలున్నాయి. లోక్‌సత్తా వీటి ప్రతిపాదనలో కీలక పాత్ర పోషించటంతోపాటు, అమలుకు నిరంతరం కృషి చేస్తోంది. వివరాలు కాకున్నా, స్థూలంగా కొన్ని పరిష్కారాలను పరిశీలిస్తే..

**చట్టబద్ధపాలన:** పోలీసు వ్యవస్థను ఆధునీకరించటం, నేర నిర్ధారణ పరీక్షల్లో అధునాతన సాంకేతికతల్ని వినియోగించటం, ఒక స్థాయి దాటిన నేరాల దర్యాప్తును పూర్తిగా రాజకీయ జోక్యం నుంచి తొలగించటం. స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే, నిపుణులతో కూడిన ప్రాసిక్యూషన్ వ్యవస్థ ఏర్పాటు, సత్వర, ఖర్చు లేని న్యాయానికి గ్రామ న్యాయాలయాల చట్టం ద్వారా స్థానిక కోర్టులు, తీర్పుల్లో నాణ్యతా ప్రమాణాల నుంచి ఉన్నత న్యాయమూర్తుల నియామకం వరకు న్యాయ వ్యవస్థను సంస్కరించటం.

**విద్య:** మన పరీక్షా పద్ధతుల్ని సమూలంగా మార్చి.. విద్యార్థికి పరిజ్ఞానం పెరిగే బోధనా పద్ధతుల్ని, బట్టీ, కాపీయింగ్‌లకు అవకాశం లేకుండా పరీక్షల నిర్వహణ, విద్యార్థులపై ఒత్తిడి లేకుండా అభ్యసన సామర్థ్యాల బేరీజు వంటి పద్ధతులను అమలు చేయటం, తద్వారా ప్రయివేటు విద్యాసంస్థలు, సమాజం కూడా విద్యలో సరైన సక్సెస్ దిశలో ప్రయాణించేలా వ్యవస్థీకృత మార్పులు తేవటం.

**ఆరోగ్యం:** మన ఆరోగ్య వ్యవస్థ తలకిందులుగా ఉండటం వల్ల పైస్థాయిలో ఆస్పత్రుల మీద భారం పెరిగి, అక్కడ రోగులకు కూడా సరైన వైద్యం అందటం లేదు.

**కొన్ని వ్యూహాత్మక రంగాలు మినహా మిగిలిన ప్రభుత్వ రంగ సంస్థల నుంచి వాటాలను ఉపసంహరించుకోవాలన్న ఎన్‌డీయే ప్రభుత్వ నిర్ణయాన్ని తెలియచేస్తూ 2021లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రకటనలో పేర్కొన్న అంశాలు:**

- వ్యాపారాలను ప్రోత్సహించటం తప్ప వ్యాపారం చేయటం ప్రభుత్వ విధి కాదు. యువ అధికారుల ప్రతిభను ప్రభుత్వ సంస్థల నిర్వహణ పేరిట వృధా చేస్తున్నట్టుగా అనిపిస్తోంది. ప్రజాసంక్షేమం చూడటమే సర్కారు ప్రథమ కర్తవ్యం. 50-60 ఏళ్ల క్రితం ప్రభుత్వ రంగ సంస్థలు స్థాపించిన నాటి పరిస్థితులు వేరు. కాలానికి అనుగుణంగా వీటిలో సంస్కరణలు తీసుకురావాలి. ప్రజాధనాన్ని సద్వినియోగం చేయటమే మా లక్ష్యం. దేశాన్ని వృద్ధి ప్రస్థాన దిశగా తీసుకెళ్లేందుకు స్పష్టమైన మార్గసూచిని బడ్జెట్ ఇచ్చింది.
- కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలు నష్టాలను చవిచూస్తున్నాయి. వాటిలో కొన్నింటికి పన్ను చెల్లింపుదారుల డబ్బు ద్వారా మద్దతు ఇవ్వాల్సి ఉంటుంది. పేదలు హక్కుదారులుగా ఉన్న డబ్బును పీఎస్‌యూల కోసం వెచ్చించాల్సి వస్తుంది. ఆర్థిక వ్యవస్థపై అధిక భారం పడుతుంది. చాలా సంవత్సరాల నుంచి నడుస్తున్నాయనో, కొందరి కలల ప్రాజెక్టులనో చెప్పి పీఎస్‌యూలను కొనసాగించరాదు. ప్రభుత్వం స్వయంగా సంస్థలను నడపటం, వాటికి యజమాని ఉండటం ప్రస్తుత కాలంలో అవసరం లేదు. అది సాధ్యం కూడా కాదు. ప్రభుత్వమే వ్యాపారం చేయటం ప్రారంభిస్తే కొన్నిసార్లు నష్టాలకూ దారితీస్తుంది. అందువల్ల ప్రభుత్వం వ్యాపారంలో ఉండరాదు. 1) అణు ఇంధనం, అంతరిక్షం, రక్షణ 2) రవాణా - టెలికమ్యూనికేషన్లు 3) విద్యుత్తు, పెట్రోలియం, బొగ్గు, ఇతర ఖనిజాలు 4) బ్యాంకింగ్, బీమా, ఆర్థిక సేవలు.. ఈ నాలుగు రంగాల్లో మాత్రమే ప్రభుత్వ వాటా వీలైనంత కనిష్ట స్థాయిలో ఉంటుంది. ప్రజాధనం సద్వినియోగమే లక్ష్యంగా సంస్కరణలు చేపట్టటం అవసరం.

కాబట్టి మన ఆరోగ్య వ్యవస్థలోని మౌలిక సంక్షోభాన్ని సరిచేయాలంటే ప్రాథమిక ఆరోగ్యాన్ని ప్రజలకు ఎటువంటి భారం లేకుండా నాణ్యమైన రీతిలో అందించటం అవసరం. ఇందుకోసం ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తాయే ఫ్యామిలీ డాక్టర్ పద్ధతిలో ఒక సమగ్ర ఆరోగ్య విధానాన్ని రూపొందించి ప్రభుత్వాలకు

అందించాయి. ఇందుకయ్యే ఖర్చు కూడా ఎంతో తక్కువ. ఆరోగ్య సంక్షోభాన్ని పరిష్కరించకుండా, దేశ ప్రజల జీవితాల్ని ప్రభుత్వాలు బాగు చేయలేవు. ఏడాదికి యూనియన్ ప్రభుత్వం రూ.30,000 కోట్లు చొప్పున మూడేళ్ల పాటు అదనంగా ఖర్చు చేస్తే చాలు, ఆరోగ్య వ్యవస్థ ఒక కొలిక్కి వస్తుంది. కోటిన్నర దాకా ఉపాధి అవకాశాలు వస్తాయి. ఇదేసమయంలో మెడికల్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తే కేవలం పదేళ్లలో ఆ రంగంలో 100 బిలియన్ డాలర్లను మార్క్‌ను భారత్ దాటవచ్చు.

వ్యవసాయం, మౌలిక వసతులు, చిన్న పట్టణాల అభివృద్ధి, స్థానిక ప్రభుత్వాలు, ఉపాధి: వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేసి రైతులకు ఆదాయాలు, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి. గ్రామాల మధ్య ఉండే ఈ పట్టణాలలో నాణ్యమైన విద్య, ఆరోగ్యం వంటి సదుపాయాలుంటే, ఊరు నుంచి రోజూ వెళ్లి అక్కడ ఉద్యోగ, వ్యాపార పనులు చూసుకుని తిరిగి గ్రామానికి వెళ్లగలుగుతారు. అక్కడ పొలం పనులు, ఇంటి అవసరాలు చూసుకుంటూ ఒత్తిడి లేకుండా బతకగలుగుతారు. ఈ చిన్న పట్టణాల్లోనే ప్రాథమిక ఆరోగ్యానికి కీలకమైన ఫ్యామిలీ డాక్టర్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందుతాయి. స్థానిక ప్రభుత్వాల బలోపేతానికి చర్యలు తీసుకుంటే, ప్రజారోగ్య సేవలూ మెరుగుపడి నివారణ వైద్య సేవలు ఇంకా మెరుగవుతాయి. అలాగే స్థానిక సచివాలయాల్లో సిటిజన్ చార్టర్లను ఏర్పాటు చేసి సేవల్లో లోపాలకు పరిహారం చెల్లించే ఏర్పాటు చేస్తే ప్రజలకు చాలామేర నాణ్యమైన పౌర సేవలు అందుతాయి. ఆ విధంగా వ్యవసాయం లాభసాటి, ఉపాధి, స్థానిక పాలన బలోపేతం, నాణ్యమైన ప్రాథమిక

**కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణకు యూనియన్ ప్రభుత్వం 2022, ఏప్రిల్ 19న జారీ చేసిన మార్గదర్శకాలు:**

- జాతీయ, ఇంధన భద్రత, కీలక మౌలిక సదుపాయాలు, ఆర్థిక సేవలందించాలనే చతుర్ముఖ వ్యూహంతో పెట్టుబడుల ఉపసంహరణ విధానం రూపొందించారు.
- కీలక రంగాల్లో ప్రభుత్వ వాణిజ్య సంస్థల యాజమాన్యంలో ప్రభుత్వం నామమాత్రంగానే ఉండాలి. మిగతా వాటాలన్నీ ప్రయివేటుపరం చేయాలి లేదా మరో ప్రభుత్వ రంగ సంస్థలో కలిపివేయాలి లేదా మరో దానికి అనుసంధాన సంస్థగా మార్చాలి లేదా పూర్తిగా మూసివేయాలి.
- దేశానికి కీలకంకాని ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్ఈ)లను తప్పనిసరిగా ప్రయివేటుపరం చేయాలి లేదా మూసివేయాలి.
- మూలధన కొరతతో ఇబ్బంది పడేవి.. అధునాతన టెక్నాలజీ ఆవిష్కరణలు లేనివి.. విభిన్న రకాల ఉత్పత్తులు, సేవలు అందించలేని ప్రభుత్వ రంగ సంస్థలు వాణిజ్యంలో చొచ్చుకుపోలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సంస్థలకున్న ఉత్పాదక ఆస్తులు ఆర్థికాభివృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోలేకపోతున్నాయి.
- 'నూతన స్వయం సమృద్ధ భారతదేశం..' అనే లక్ష్యాన్ని సాధించటానికి ప్రభుత్వ రంగ సంస్థల యాజమాన్యాల్లో ప్రభుత్వ పాత్రను కనిష్ట స్థాయికి తగ్గించాలి. కొత్త పెట్టుబడులను ప్రయివేటు రంగం నుంచి రాబట్టాలి.
- ప్రయివేటు పెట్టుబడులు, వాటి నుంచి అధునాతన టెక్నాలజీ, అధిక ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం కల్పించటం వల్ల పీఎస్ఈలు అభివృద్ధి చెందటమే కాకుండా నూతన వ్యాపారాలకు అనుబంధంగా మరిన్ని ప్రయివేటు సంస్థలు ఏర్పడి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.
- ఈ నేపథ్యంలో కేంద్ర పీఎస్ఈల్లో యాజమాన్యం పాత్రను ఇతర ప్రభుత్వ సంస్థ లేదా రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేస్తే ఆయా లోపాలను సరిదిద్దకపోగా, నూతన విధానం లక్ష్యాలను దెబ్బతీస్తుంది. కాబట్టి పీఎస్ఈలో కేంద్రం పెట్టుబడుల ఉపసంహరణకు నోటిఫికేషన్ జారీ చేసినా దేశంలో మరో ప్రభుత్వ సంస్థ పెట్టుబడులు పెట్టి దక్కించుకోకుండా నియంత్రించారు.
- కంపెనీల చట్టం–2013లోని సెక్షన్ 2(45) ప్రకారం ప్రభుత్వ కంపెనీ అంటే ఏ కంపెనీలోనైనా యూనియన్ లేదా రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతానికి తగ్గకుండా ఉందని అర్థం.
- ఇక నుంచి సాధారణ విధానం కింద యూనియన్ లేదా రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలోని ఏ సంస్థ అయినా సరే 51 శాతం వాటా కలిగి ఉంటే అది ఇక నుంచి ఏ పీఎస్ఈలో పెట్టుబడి పెట్టి కొనటానికి అనుమతి లేదు.
- ఒకవేళ ప్రజాప్రయోజనాలరీత్యా ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా కేంద్ర పీఎస్ఈలో పెట్టుబడులు పెట్టి సొంతం చేసుకోవటానికి టెండర్లు వేయాలంటే తప్పనిసరిగా యూనియన్ ప్రభుత్వ అనుమతి పొందాలి.
- సింగరేణి సంస్థలో 51 శాతం వాటా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానిదైతే, మిగిలిన 49 శాతం కేంద్రం వాటా ఎట్టి పరిస్థితుల్లో విశాఖ ఉక్కు పరిశ్రమలో సింగరేణి పెట్టుబడులు పెట్టటానికి యూనియన్ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చెల్లదని కేంద్ర అధికారులు స్పష్టం చేశారు. ఒకవేళ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులు పెట్టాలన్నా యూనియన్ ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అనివారు వివరించారు.

# విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల ప్రయోజనాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించిన జేపీ



విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల ప్రయోజనాలను కాపాడటంలో, వారికి ఉద్యోగాలిప్పించటంలో కీలకపాత్ర పోషించారు లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్! ఆనాడు ప్రత్యేక అధికారిగా ప్లాంట్‌కు భూ సేకరణ చేయటంతోపాటు ఆ భూమికి న్యాయమైన పరిహారం ఇవ్వాలని పోరాడారాయన. అప్పట్లో భూ సేకరణ అంటే ప్రభుత్వం ఎవరి భూమినైనా లాక్కోవటం, నామమాత్రపు డబ్బు విదల్చటం తప్ప.. న్యాయంగా బేరీజు వేసి పరిహారం చెల్లించటమన్నదే లేదు. అలాంటి పరిస్థితుల్లో నిర్వాసితుల ప్రయోజనాల్ని పరిరక్షించేందుకు జేపీ ఫైళ్లు పట్టుకుని గుమాస్తా నుంచి ముఖ్యమంత్రి దాకా తిరుగుతూ రాత్రింబవళ్లు శ్రమించారు. ఒక్కోసారి ఆయా కార్యాలయాల్లో బంట్రోతులు కూర్చునే పీట మీద కూర్చుని వేచి చూడాల్సి వచ్చేది. నిర్వాసితుల భూములకు గరిష్ఠ ధరను చెల్లించటంతోపాటు వారి కుటుంబంలో ఒకరికి ప్లాంట్‌లో ఉద్యోగం ఇవ్వాలని జేపీ వాదించారు. చదువులేని వాళ్లను ఎట్లా తీసుకుంటామన్న ప్లాంట్ ఉన్నతాధికారుల ధోరణిపై పోరాడి నిర్వాసితులకు ఉచితంగా శిక్షణనిచ్చి మరీ ఉద్యోగంలోకి తీసుకునేలా ఒప్పించారు. దీనివల్ల స్టీల్‌ప్లాంట్‌కు భూములిచ్చినవారికి అప్పట్లో అత్యధిక పరిహారం దక్కటంతోపాటు, దాదాపు 8,000 మంది యువతకు ప్రత్యేక శిక్షణ అనంతరం విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగాలు లభించాయి. వేల మందికి జీవన భద్రత, ఎదిగే అవకాశాలు లభించాయి. స్టీల్‌ప్లాంట్, ఉద్యోగుల ప్రయోజనాలపై జేపీ కంటే ఎవరికి ఎక్కువ పట్టింపు ఉంటుంది! జయప్రకాష్ నారాయణ్ చెబుతున్నట్లు, రాజ్య వ్యవస్థ వ్యాపారాల నుంచి వైదొలిగి తాను చేయాల్సిన పనుల్ని సక్రమంగా చేయటం మీద దృష్టి కేంద్రీకరించటం వల్ల.. ప్రభుత్వ రంగ ఉద్యోగులకు దీర్ఘకాలంలో ఇంకా ఎక్కువ లాభమే సమకూరుతుంది తప్ప నష్టం ఉండదు.

వైద్యం.. ప్రణాళికాబద్ధ నిర్మాణంతో, ప్రత్యామ్నాయ ఇంధన వనరులతో చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయటం ద్వారా సాధ్యమవుతుంది.

వీటితోపాటు అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని బ్రాండిక్స్ కంపెనీ తరహాలో ఉపాధిని ప్రతి జిల్లాలో పెద్ద ఎత్తున కల్పించేందుకు వెసులుబాట్లు కల్పించాలి. మన దేశంలో ప్రయివేటు రంగంలో నెలవారీ జీతాలు పొందుతున్న వారి సంఖ్య ఇప్పటికీ రెండు కోట్ల లోపే ఉంది. ఈ సంఖ్యను వేగంగా రెట్టింపు చేస్తే ఉపాధి రంగంలో ఒక ఉత్సాహపూరితమైన వాతావరణం నెలకొని ఆర్థిక రంగానికి పెద్ద ఊపు లభిస్తుంది.

**రాజ్యాంగ ప్రజాస్వామ్య పరిరక్షణా బాధ్యత - ఎన్నికల సంస్కరణలు**

ఈ అంశాలకు అవరోధాలు లేకుండా చేసేందుకు, జాతీయోద్యమ లక్ష్యమైన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాన్ని దేశంలో పరిరక్షించేందుకు ప్రభుత్వాలు ఎన్నికల వ్యవస్థలో, పార్టీల పనితీరులో ప్రోత్సాహకాల్ని మార్చాలి. ఇందుకోసం కొన్ని మౌలిక మార్పుల్ని తేవాలి. మన ఎన్నికల వ్యవస్థలో ఒక్క ఓటు ఎక్కువ వస్తే గెలుపు కాబట్టి.. ప్రతి ఓటునూ రాబట్టుకోవాలని ఆరాటపడుతూ విపరీతంగా డబ్బు వెదజల్లుతున్నారు. ఓట్లు కొనుగోలు చేయటం, ఫిరాయింపులను ప్రోత్సహించటం, ఆర్థిక ప్రగతిని, భవిష్యత్తును తాకట్టుపెట్టి తాత్కాలిక పథకాలను ప్రకటించటం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. స్థానిక ప్రభుత్వాలను బలహీనపరిచి ప్రజలకు ఓటు విలువ అర్థం కాని వ్యవస్థను నిర్మించటం, నాణ్యమైన విద్య అందకుండా చేయటం, పేదరికాన్ని కొనసాగించటం వల్ల మన దేశంలో ప్రజల్ని ఎన్నికల సమయంలో ప్రలోభపెట్టటం సాంప్రదాయ రాజకీయానికి తేలిక అవుతోంది. ఈ పరిస్థితి ఇదే రీతిలో కొనసాగితే రాజకీయం నుండి ఆలోచన, సేవాభావం ఉన్నవారంతా కనుమరుగవుతారు, చివరికి రాజకీయం పూర్తిగా ప్రజల

విశ్వాసాన్ని కోల్పోతుంది. కాబట్టి ఒక ఓటు తక్కువ వచ్చినవారి ఓట్లు కూడా వృధా కావు, ప్రతి ఓటుకూ విలువ ఉంటుంది, ఓట్ల శాతాన్ని బట్టి సీట్లు వస్తాయి అనే దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెడితే ఎన్నికల వ్యవస్థలో డబ్బు ప్రభావాన్ని వేగంగా అదుపు చేయవచ్చు. దీంతోపాటు ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వల్ల డబ్బు ప్రభావం ఇంకా నియంత్రణలోకి వస్తుంది. వీటన్నిటతోపాటు రాజకీయ పార్టీల్ని ప్రజాస్వామీకరించి, పదవుల్లో ఎవరుండాలి, ఎన్నికల్లో ఎవరు పోటీ చేయాలి అనే అంశాల్ని కొందరు వ్యక్తులు కాకుండా పార్టీ సభ్యులందరూ కలిసి నిర్ణయించే చట్టబద్ధ ఏర్పాటు చేస్తే మన ఎన్నికల వ్యవస్థ క్రమంగా ఆరోగ్యకరంగా మారుతుంది.

**వీటిని వదిలేసి ప్రభుత్వాల పాత్ర అక్కర్లేని అంశాలపై ఆందోళనలా?**

ప్రభుత్వాలు తాము చేయాల్సిన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, రోజువారీ సేవలు, మౌలిక వసతులు వంటి అంశాల్లో, ఎన్నికల సంస్కరణల్లో ఎంత విఫలమవుతున్నాయో కనిపిస్తున్నా, హేతుబద్ధ, ఆమోదయోగ్య పరిష్కారాలు అందుబాటులో ఉన్నా, ఈ అంశాల్లో విఫలమైతే స్వతంత్ర భారత్ వందో మైలురాయిని చేరేటప్పటికి అందుకోవాల్సిన లక్ష్యాల్లో విఫలమయ్యే ప్రమాదమున్నప్పటికి, వీటి గురించి మాట్లాడకుండా.. ప్రభుత్వాలు తమకు సంబంధం లేని పనులు చేయాలంటూ కొందరు ఆందోళనలు చేయటం, రాజకీయ పార్టీలు, సంఘాలు వారికి మద్దతివ్వటం ఎంతవరకు సమంజసం?

విశాఖ స్టీల్‌ప్లాంట్ చుట్టూ సెంటిమెంట్‌ను రగులుస్తున్నారుగానీ, ఇది నిజంగా ప్రజల సమస్యా? పోనీ ఉద్యోగులకేమన్నా సమస్య వస్తోంది కాబట్టి వారి తరపున సంఘీభావం చెప్పటానికైనా.. వారి ఉద్యోగాలేవీ పోవు. ప్రభుత్వ గుత్తాధిపత్యం వల్ల లభించే అసంబద్ధ ప్రయోజనాలను ఆశించి కొందరు చేసే డిమాండ్లకు ఆమోదం తెలపటం వల్లే నిజానికి ప్రజలు నష్టపోతారు. ఉద్యోగులు కూడా బాధ్యతా యుతంగా, భవిష్యత్తు తరాల కోసం ఆలోచించాలి. పెట్టుబడుల ఉపసంహరణ పారదర్శకంగా, విశ్వసనీయతతో జరగాలని డిమాండ్ చేయవచ్చు గానీ.. ఈవేళ కొద్దిమంది తాత్కాలిక అవసరాల కోసం దేశాభివృద్ధి, కోట్లాదిమంది యువత భవిష్యత్తు కోసం ప్రభుత్వాలు చేయాల్సిన పనుల్ని, కేటాయించాల్సిన వనరుల్ని ఫణంగా పెట్టమనటం ఎంతవరకు న్యాయం?

ఆందోళన చేస్తున్న ఉద్యోగులనుద్దేశించి విశాఖలో జేపీ చెప్పినట్లు, ప్రభుత్వం అన్నీ చేస్తుందనేది భ్రమ. ప్రభుత్వం తాను చేయాల్సిన పనులు సక్రమంగా చేస్తే చాలు. మనం ప్రభుత్వం చేయాల్సిన చట్టబద్ధపాలన వంటి పనుల్ని ప్రయివేటీకరిస్తున్నా మాట్లాడకుండా, గూండాలు, ఎమ్మెల్యేలు సెటిల్‌మెంట్లు చేస్తున్నా నోరు విప్పకుండా.. ప్రభుత్వం చేయనక్కర్లేని పనులు మాత్రం చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వం వ్యాపారం చేస్తే ప్రజలకు నష్టం తప్పదనటానికి టెలిఫోన్లే పెద్ద ఉదాహరణ. ఒకప్పుడు దరఖాస్తు చేస్తే ఎప్పటికి వస్తుందో తెలియని అరుదైన సదుపాయంగా, విలాస వస్తువుగా ఉన్న ఫోన్లు ప్రయివేటీకరణతో అందరికీ అందుబాటులోకి వచ్చాయి. నాకు మెరుగైన సేవ అందిందా, ప్రజలకు చౌకగా, నాణ్యమైన సేవలు, ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయా అనేవి తప్ప ఎవరు తయారుచేశారన్నది మనకనవసరం.

అలాగే ప్రభుత్వం ఉన్నది ప్రభుత్వోద్యోగుల కోసం తప్ప ప్రజల కోసం కాదన్నట్టు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) తీసుకురావాలని కొంతమంది ఆందోళన చేస్తున్నారు. ఈ విధానంలో ఈవేళ రూపాయి పెట్టుబడి లేకుండా, బడ్జెట్‌లో కేటాయింపులు లేకుండా రేపటి తరం ఆదాయాల నుంచి పెన్షన్ తీసుకుంటారు. దీనివల్ల పన్నులు చెల్లించేవారి డబ్బులో చాలాభాగం ప్రభుత్వోద్యోగుల పెన్షన్లకే ఖర్చవుతూ, వచ్చే తరాల మీద భారం పెరుగుతూ కొన్నేళ్లలో రాష్ట్రాలు, వాటి నుంచి దేశం దివాలా తీసే పరిస్థితి వస్తుంది. కాబట్టి ప్రభుత్వోద్యోగులకు ఇప్పుడు ఇస్తున్న జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ద్వారానే పెన్షన్ ఇచ్చే పద్ధతిని కొనసాగించాలి. దీని ద్వారా ఎంత పెన్షన్ ఇచ్చినా అభ్యంతరం లేదు.. కానీ అప్పులు చేయకుండా ఎంత పెన్షన్ డబ్బు ప్రభుత్వ వాటాగా ఇవ్వగలదో అంత డబ్బూ బడ్జెట్‌లో చూపాలి. అప్పులు చేసి తెచ్చిన డబ్బు అభివృద్ధికి, భవిష్యత్ తరాల కోసం మాత్రమే ఖర్చు చేయాలి.

ప్రభుత్వం తన పాత్రకు పరిమితమై, సంక్షేమం–అభివృద్ధి మధ్య సమతూకం పాటిస్తూ ఆర్థిక రంగాన్ని పెంచటానికి అన్ని చర్యలూ తీసుకుంటే.. మన దేశం చైనాకు దీటుగా ఎదగగలుగుతుంది. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను తాను సమర్థించటానికి కారణాలపై చర్చకు సిద్ధమని జేపీ ప్రకటించారు. కాబట్టి చర్చకు తగిన వాతావరణం కల్పించటం, వివరాల్ని ప్రజల ముందుంచటం, వాస్తవాలు, హేతుబద్ధత ఆధారంగా నిర్ణయాలు తీసుకోవటం స్టీల్‌ప్లాంట్ విషయంలో మన కార్యాచరణ కావాలి.

# ఎన్నికలు - అభ్యర్థుల ఎంపిక

నేర చరితులు ఎన్నికల్లో పోటీ చేయకుండా చూడాల్సిన అవసరముందని, కానీ ఎవరినైతే మనం నేరస్తులు అనుకుంటున్నామో వాళ్లను ప్రజలు హీరోలుగా అనుకుంటున్నారని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఏళ్ల తరబడి న్యాయం అందని కేసుల్ని కండబలంతో బందన్యాయం ద్వారా మూడు నాలుగు రోజుల్లో వాళ్లు తేల్చేస్తున్నారన్నారు. కులం, మతం, మందబలాలతో అక్రమార్జన చేసిన నేరగాళ్లు పోలీసుల్ని గుప్పెట్లో పెట్టుకోవటం కోసం రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారన్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి రూ. 40 కోట్లు ఖర్చు చేయాల్సిన ప్రస్తుత ఎన్నికల వ్యవస్థలో అలాంటి నేరస్తులు పార్టీలకు గెలుపు గుర్రాలవుతున్నారన్నారు.

'ఎన్నికలు - అభ్యర్థుల ఎంపిక'పై ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (సుపరిపాలన వేదిక) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన చర్చా కార్యక్రమంలో జేపీ మాట్లాడారు.

ఏ నేరస్తుడు పోలీసుల్ని, రాజ్యాన్ని చూసి భయపడాలో వాడు పదవిలో కూర్చుని పోలీసుల్ని శాసిస్తున్నాడని, ఎమ్మెల్యే చెప్తేనే కేసులు, లేదంటే సాక్ష్యాలు కూడా ఉండవని జేపీ అన్నారు. పోలీసులు మాట వినకపోతే శంకరగిరి మాన్యాలు పట్టిస్తారన్నారు. నేర చరితుల వివరాల్ని బయటపెట్టటం 1999లో తెలుగునాటే మొదలైందని, వివిధ రంగాలకు చెందిన సుప్రసిద్ధులతో కలిసి ప్రామాణికంగా, పార్టీలకు అతీతంగా లోక్‌సత్తా బయటపెట్టిందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ వివరాల్ని ప్రజల ముందుంచాలనే చట్టం 2003లో రావటానికి ఈ కృషే ప్రాతిపదికన్నారు. నేర చరితులకు పార్టీలు టికెట్లివ్వకుండా మనం గట్టి ప్రయత్నం చేయాలని, కానీ చట్టబద్ధపాలన, ఎన్నికల సంస్కరణలు, నిజమైన అధికార వికేంద్రీకరణ లేకుండా వారిని నిరోధించటం సాధ్యం కాదన్నారు. డబ్బు పంచం అని ఎవరైనా కూర్చుంటే, ఓటు వేయం అని ప్రజలు కూర్చునే పరిస్థితి వచ్చిందన్నారు. డబ్బు పంచకుంటే అభ్యర్థిగానే పరిగణించటం లేదన్నారు. ఇది ప్రజల తప్పు కాదన్నారు. మనం ఒక సంక్లిష్ట పరిస్థితికి వచ్చామన్నారు. ఈ పరిస్థితిని తమకు తాముగా సంస్కరించే ఓపిక రాజకీయ పార్టీలలో కనిపించటం లేదన్నారు. పాలనా సమాచార హక్కు (ఆర్‌టీఐ) విషయంలో పార్టీలు, నేతలు ప్రవాహంలో కొట్టుకుపోతున్న



వైనాన్ని ఈ సందర్భంగా ఉటంకించారు. ఆర్‌టీఐకి అతీతమని పార్టీలు దబాయిస్తున్నాయన్నారు. ఆర్‌టీఐ బిల్లు రూపొందించేటప్పుడు ఈ సమస్య ఉందని, అందువల్లే తాను ఎన్నికల నిధుల ద్వారా పార్టీల్ని పరోక్షంగా బాధ్యుల్ని చేసే ఏర్పాటు చేశానన్నారు. ఆ క్లాజు ఆధారంగానే ప్రధాన సమాచార కమిషనర్ రాజకీయ పార్టీలు కూడా ఆర్‌టీఐ పరిధిలోకి వస్తాయని ఆదేశం జారీ చేశారని, దానిపైనే ఇప్పుడు సుప్రీంకోర్టులో వాదనలు కొనసాగుతు న్నాయని తెలిపారు. ఇలాంటి రాజకీయంలో మార్పు తేవాలంటే వ్యవస్థీకృత సంస్కరణలు తప్పనిసరి అని జేపీ పేర్కొన్నారు.


యూనియన్ హోం శాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య మాట్లాడుతూ, ఎన్నికలపై నిఘా వేయటంతోపాటు తప్పుడు సమాచారంతో వేసే నామినేషన్లను రద్దు చేయాలన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలపై తెలంగాణ వ్యాప్తంగా 496 కేసులు ప్రత్యేక కోర్టుకు చేరేలా తాము చొరవ చూపామని, సరైన సాక్ష్యాలు చూపకపోవటంతో దాదాపు అన్నీ కొట్టివేశారని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ వేదిక అధ్యక్షుడు పద్మనాభరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆరేడు కేసుల్లో జరిమానా పడగా, పోలీసులపై చేయిచేసుకున్న కేసులో రాజాసింగ్‌కు మాత్రం శిక్ష పడిందన్నారు. మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి మాట్లాడుతూ, కొందరు నేతలు డబ్బిచ్చి టికెట్లు కొంటున్నారని, గెలిచాక మళ్లీ డబ్బిచ్చి మంత్రి పదవి తీసుకుంటున్నారన్నారు. లోక్‌సత్తా ఉద్యమ సమన్వయకర్త బండారు రామ్మోహనరావు మాట్లాడుతూ, పార్టీ మారితే ఆరు నెలల్లో కేసు పరిష్కరించాలనే నిబంధన ఉన్నా ఎవరూ పట్టించుకోవటం లేదన్నారు. ప్రజల్లో బ్యాలెట్ ద్వారా పార్టీలు అభ్యర్థుల్ని ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి గోపాల్‌రెడ్డి, సహ చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, సుపరిపాలన వేదిక కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యురాలు శ్రీదేవి, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

(గత సంచిక తరువాయి)

# అందరికీ ఆరోగ్యానికి
# ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు \ అతి తక్కువ వ్యయం**

## జులై 2021
### (తెలుగులో స్థూల అనువాదం)



**(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)**

మన వనరులు పరిమితం, అవసరాలు అనేకం. ఖజానాకున్న తీవ్ర పరిమితుల దృష్ట్యా, ఆరోగ్యానికి బడ్జెట్ కేటాయింపుల్లో భారీ పెంపుల్ని ఆశించటం అవాస్తవికమవుతుంది. అయితే, ఆరోగ్య రంగానికి చాలాకాలంగా తగినన్ని నిధుల్ని ఇవ్వటం లేదు. డబ్బును సరిగా వినియోగిస్తే, బహుముఖంగా అనేక రెట్లు ఫలితాలనిచ్చే రంగం ఇది. దుర్భర పేదరికాన్ని అంతం చేయటానికి అత్యంత వేగవంతమైన మార్గం మెరుగైన ఆరోగ్యం. కాబట్టి, ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయాల్ని జి.డి.పిలో 0.5 శాతం మేర పెంచటం వివేకవంతమైన, సముచితమైన పని. అటువంటి మోస్తరు కేటాయింపు కూడా ఎంతో పెద్దస్థాయి ఫలితాన్ని సాధిస్తుంది. సమగ్రమైన, ఆచరణసాధ్యమైన, జవాబుదారీతనంతో కూడిన అమలు వ్యవస్థ రూపకల్పన, ఎక్కడ ఆచరణసాధ్యమైతే అక్కడ పోటీ, ఎంపిక పద్ధతులు ప్రవేశపెట్టటం.. తక్కువ ఖర్చుతో గణనీయ ఫలితాలను తీసుకొస్తాయి.

సమకాలీన రాజకీయ చర్చ స్వభావాన్ని మార్చటం కూడా అంతే ముఖ్యం. పరిణతి చెందిన ప్రజాస్వామ్యాలలో ఆరోగ్యం, విద్య విధానాలపై లేదా ఆ సేవల స్థితిపై ప్రజలు దృష్టి పెట్టకుండా ఒక్క రోజు కూడా గడవదు. భారతదేశంలో, రాజకీయ ప్రక్రియ జీవితం, మరణం, సాధికారత వంటి వాస్తవ అంశాలతో సంబంధం లేకుండా సాగుతోంది. ఆరోగ్యం, విద్యల్ని వెనక్కి నెట్టారు. బద్ధశత్రువుల మధ్య అధికార క్రీడ స్థాయికి రాజకీయాల్ని దిగజార్చారు. కానీ అంతిమంగా చూస్తే, నాణ్యమైన ఆరోగ్యం, పౌరుని చుట్టూ తిరిగే ప్రజాస్వామ్యం కలగలిసి ఉంటాయి. మెరుగైన ఆరోగ్యం కోసం సంఘర్షణ, జవాబుదారీతనమున్న ప్రజాస్వామ్యం కోసం పోరాటం, ప్రజల సాధికారత కోసం అన్వేషణ, ప్రభుత్వ ధనానికి ఖర్చుకు తగ్గ అత్యుత్తమ విలువ లభించాలనటం.. ఇవన్నీ విడదీయలేని అంశాలు. ఒక సమాజంగా మనకు బలముంది, అవరోధాలను అధిగమించగల సామర్థ్యం ఉంది. మన శ్రామికులకు నైపుణ్యాలు, చొరవ ఉన్నాయి. మన ప్రజలకు సద్బుద్ధి, ఆకాంక్ష ఉన్నాయి. 21వ శతాబ్దంలో నివసించే సదవకాశం మనకు లభించింది. అనేక మానవ సంకటాలకి ఈ శతాబ్దంలో ఆచరణసాధ్యమైన పరిష్కారాలున్నాయి. నివారించదగ్గ బాధను మునుపెన్నడూ లేనిరీతిలో నివారించగలం. మనకు దిశానిర్దేశం చేయటానికి సొంత దేశంలో, ప్రపంచవ్యాప్తంగా కూడా పారంపరిక అనుభవం ఉంది. ఆ పాఠాల్ని అంతర్లీనం చేసుకుని, ఒక ఆచరణసాధ్యమైన ఆరోగ్య వ్యవస్థను నిర్మించి, సుస్థిరం చేసుకోవటానికి కృషి చేస్తే, మన సంపూర్ణ సామర్థ్యానికి తగ్గ ఆరోగ్యాన్ని, ఆనందాన్ని అందుకోగలం.

(ఇంకా ఉంది. . . )




## ఆబాలగోపాలం తప్పక చూడాల్సిన, భద్రపరచుకోవాల్సిన 5 అద్భుత ఇంటర్వ్యూలు @

# youtube.com/JP Loksatta

స్వతంత్ర భారతం 75 - లోక్‌సత్తా 25 కలిసి వచ్చిన అపురూప సందర్భంలో భవిష్యత్ భారత కార్యాచరణపై ఆబాలగోపాలం తప్పక చూడాల్సిన, భద్రపరచుకోవాల్సిన 5 అద్భుత ఇంటర్వ్యూలు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌తో..

1) **సామాజిక, రాజకీయ విశ్లేషకురాలు, యువ జర్నో స్వాతి ఇంటర్వ్యూ :**
   ఎన్నికల్లో ముక్కుమూసుకుని ఓట్లు వేయటం, ఎవర్ని గెలిపించినా ఏమున్నది గర్వకారణం అని నిట్టూర్చటం, మార్పు కోసం ఏదైనా చేయగల సత్తా ఉన్న యువత రోజువారీ జీవితంలోనే అలసిపోతుండటం.. ఏమిటి చేయటం?.. ఇంకా పలు ప్రశ్నలు.
2) **లైఫ్‌లో ఇంతవరకూ ఎవరినీ ఇంటర్వ్యూ చేయని సామాజిక, పాలనా అంశాల ఉద్యమకారులు, ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభరెడ్డి ఎక్స్‌క్లూజివ్ :**
   రాజకీయాల్లోకి వస్తే చెప్పుతో కొట్టండి.. అన్న వారిని అధికారంలోకి తేవటం తప్ప లోక్‌పాల్ ఉద్యమం సాధించింది ఏమిటి? దేశంలో అవినీతి ఎందుకు అంతం కావటం లేదు?.. & మోర్.
3) **సామాజిక, రాజకీయ ఉద్యమకారులు, మీడియా విశ్లేషకులు కటారి శ్రీనివాసరావు ఇంటర్వ్యూ:**
   మోదీ, కేసీఆర్, జగన్‌ల బాకాలే తప్ప ఉద్యమకారులు, పౌర సమాజం గొంతు ఈవేళ బలంగా ఎందుకు వినిపించటం లేదు? ఏవి ఉచితాలు, ఏవి అనుచితాలు.. సంక్షేమం అంటే ఏమిటి?.. ఇంకా అనేక అంశాలు (రెండు భాగాలు).
4) **విద్యావేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణులు, రచయిత ఆకెళ్ల రాఘవేంద్ర ఎక్స్‌క్లూజివ్:**
   ట్యాక్స్ ఎగ్గొడితే అది నల్లడబ్బు. మరి సరిగా సేవలు అందించని ప్రభుత్వాలకు పన్ను సరిగా కట్టనక్కర్లేదనుకునే పౌరులు కూడా బ్లాక్‌మనీగాళ్లే అవుతారా? ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు ఎలా ఉండాలి?.. & మోర్ (రెండు భాగాలు).
5) **పబ్లిక్ పాలసీ యువ రీసెర్చర్ సుమేధ ఇంటర్వ్యూ (ఇందులో జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వీవీ లక్ష్మీనారాయణ కూడా పాల్గొన్నారు):**
   మోదీ ఈడీని ప్రయోగిస్తున్నాడని ఆరోపిస్తున్నారు గానీ.. ఒక్క పార్టీ కూడా చట్టబద్ధపాలనని సంస్కరించాలని ఎందుకు డిమాండ్ చేయటం లేదు? డ్రగ్స్‌ని నిషేధించినా ఎందుకు అదుపు చేయలేకపోతున్నారు?.. ఇంకా పలు ప్రశ్నలు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th August, 2023 Posting Date 15 &16th of every month




# ఎన్నికల సంవత్సరం - స్వాతంత్ర్య దినోత్సవం



మన దేశంలో ఎన్నికల సంవత్సరం మొదలైంది. కానీ ఎన్నికలు ఎందుకోసమో మర్చిపోయిన వాతావరణమే కొనసాగుతోంది. ఎవరు గెలుస్తారు అన్న చర్చే జరుగుతోంది. ఈ స్వాతంత్ర్య దినోత్సవమైనా మన దృష్టిని నాయకుల నుంచి ఎన్నికల లక్ష్యాల వైపు మళ్లించే సందర్భం కావాలి. అంటే, మన జీవితాల గురించిన ఆలోచన కలిగించాలి. దేశం నాశమైనా ఓట్ల కోసం ప్రభుత్వోద్యోగులకు మళ్లీ పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేస్తాం వంటి హామీలు, అప్పు చేసి ఉచితాలు ఇవ్వకుండా, తాత్కాలిక పథకాలకు, అభివృద్ధికి మధ్య సమతూకం పాటిస్తూ పెట్టుబడులను ప్రోత్సహిస్తూ ఆర్థిక వ్యవస్థను పెంపొందించటం, ప్రజలకు జేబు ఖర్చు లేకుండా మంచి విద్య, ఆరోగ్యం అందించటం మన ఎన్నికల చర్చలో అత్యంత ప్రాధాన్యాంశాలు కావాలి. ఆ తర్వాత చట్టబద్ధపాలన అమలు, అధికార వికేంద్రీకరణ. వీటితోపాటు, ఓట్ల కొనుగోలు అవసరం లేకుండా ఎన్నికల సంస్కరణలపై ఏకాభిప్రాయ సాధన.. కనీసం ఈ మేరకు మనం 2023-24 ఎన్నికల్లో ఎజెండాను తిప్పగలిగినా వచ్చే పాతికేళ్లలో దేశాన్ని అగ్రస్థాయికి తీసుకెళ్లే ప్రయత్నంలో విజయం సాధించగలం.

**77వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలతో,**

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,

ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020